# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 37 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## రైళ్లలో ఇ-ప్యాంట్రీ సౌకర్యం



2

## ఇప్పటి వరకే రూ.11.83 కోట్లు

### మేడారం హుండీల ఆదాయం



2



# మోడీ మోరీ తీస్తేందుకొస్తడా?

## కేసీఆర్ ఫామ్‌హౌస్ ఇడ్సిపెడ్తడా?

- నిధుల కేటాయింపులో దక్షిణాది రాష్ట్రాలకు మోడీ అన్యాయం
- కాళేశ్వరం కేసు సీబీఐకిస్తే కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తమన్న కిషన్ రెడ్డి ఎక్కడున్నడు ?
- బీఆర్ఎస్‌కు ఓట్లడిగే నైతిక హక్కు లేదు
- సోయిలేనోళ్ల లెక్క ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నరు
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటెయ్యాలె
- మీడియా ప్రతినిధుల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం బ్యూరో):** మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మోడీ మోరీ తీయడానికి వస్తడా...బీఆర్ఎస్ గెలిస్తే కేసీఆర్ ఫామ్ హౌస్ విడిచిపెడ్తడా అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో భవిష్యత్తును ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొందన్నారు. పన్నెండేండ్లు అధికారంలో ఉండి ప్రధాని మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటిస్తామని ప్రధాని మోడీ స్వయంగా చెప్పారు. కానీ, ఆ హామీ అమలు చేయాలేదు. అలాంటి మోదీని చూసి ఓటు వేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆదిలాబాద్‌కు మహారాష్ట్ర నుంచి 60 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారని విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తమని బీజేపీ నేతలు బూటకు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌కు వరదలు వచ్చిన సమయంలో కారుకు కారు, బండికి బండి ఇస్తామన్న ...మిగతా 2లో

జైలుకుపోవాలని బావబామ్మర్దులు

# పోటీ పడ్తున్నరు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తప్పించుకోలేరు

### సీఎం రేవంత్ చిట్‌చాట్

**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ కేసులో కీలక వ్యక్తిగా ఉన్న ప్రభాకర్ రావును బీఆర్ఎస్ నేతలు 20 నెలలు అమెరికాలో దాచి పెట్టారనీ, చివరకు ఆయనను సుప్రీం కోర్టు ద్వారా భారత్‌కు రప్పించామన్నారు. అరెస్టుల సెంటిమెంట్‌తో కేటీఆర్, హరీష్ రావు, కవిత పోటీ పడుతున్నారనీ, జైలుకు వెళ్లొస్తే మేమూ సీఎం అవుతామని భావిస్తున్నారని పేర్కొన్నారు. అధికారం ఉన్నంత సేపు కేసీఆర్ ఫ్యామిలీ కలిసే ఉందనీ, అధికారం కోల్పోయాక విడిపోయారన్నారు. అందరూ కలిసి ఉన్నప్పుడే వాళ్లని బొందపెట్టి సీఎం కుర్చీలోకి వచ్చానని చెప్పారు. నియోజకవర్గాల విభజన తరువాతనే 2029లో జమిలి ఎన్నికలు ఉంటాయనీ, జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువ ...మిగతా 2లో

ప్రచారాలకు బై.. ప్రలోభాలకు సై

### మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో

# పార్టీల హోరాహోరీ



- అభివృద్ధి నినాదంగా కాంగ్రెస్ కాన్వాసింగ్
- బీఆర్ఎస్, బీజేపీలను చీల్చి చెండాడిన సీఎం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన కారు, కాషాయ నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం బ్యూరో):** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రచార గడువు ముగిసింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అన్ని రకాల ప్రచారంపై రాష్ట్ర ఎన్నికల సంఘం నిషేధం విధించింది. దీంతో ర్యాలీలు, సభలు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదని ఈసీ స్పష్టం చేసింది. టీవీ, సినిమా, మ్యూజిక్ షోల ద్వారా కూడా ప్రచారం చేయకూడదని రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లలో ప్రచారాలపై కూడా ఆంక్షలు విధించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా ...మిగతా 2లో

# కారుకూతలు కూస్తే బొక్కలోకే

## చందాలు.. దందాలు చేస్తే ఊర్కోం

- 11వ తేదీ తర్వాత మీ సంగతి తేలుస్తా!
- అధికారం లేని మీరు అభివృద్ధి ఎలా చేసారంటూ ప్రశ్న
- ఏప్రిల్లో ‘ఇందిరమ్మ’ ఇండ్లిస్తామని స్పష్టం చేసిన పొంగులేటి
- మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సభలో మంత్రి వార్నింగ్



2

# డిజిటల్ క్రాప్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలె

### అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం

### పథకాల అమలుకు కీలకం డీజీఎస్



**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే(డీజీఎస్) ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షాసమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు రాజీవ్ చావ్లా (రిటైర్డ్ ఐఏఎస్) అధ్యక్షతన సమావేశం జరిగింది. రెవెన్యూ కార్యదర్శి లోకేశ్ కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరీ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర సీనియర్ అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మార్చి 15వ తేదీలోగా డిసిఎస్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎన్ఐసీ అధికారుల సహకారంతో సర్వేను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10, 877 గ్రామాల్లో డీజీఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వే వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జిఎస్‌డిపి) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ...మిగతా 2లో

## ముఖ్యమంత్రులే మా దగ్గరికొస్తరు

### రెడ్డి అయినా.. రావు అయినా రావాల్సిందే

### కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వ్యాఖ్య

**కరీంనగర్, ఫిబ్రవరి 9:** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. అంతకు ముందు కరీంనగర్‌లో ఎన్నికల ...మిగతా 2లో

## మేం ఎవరి వల్లో గెల్వలేదు

### అక్బరుద్దీన్ వ్యాఖ్యలకు శ్రీధర్ బాబు కౌంటర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** జూబ్లీహిల్స్‌లో ఎవరి వల్లో మేము గెలవలేదు.. కాంగ్రెస్ బలంతోనే గెలిచామని స్పష్టం చేశారు. మా పార్టీ నేతలు రేయింబవళ్లు కష్టపడితేనే విజయం సాధ్యమైందని చెప్పారు. ఈ ఉప ఎన్నికల్లో ఎంఐఎం మద్దతుతోనే కాంగ్రెస్ విజయం సాధించిందని.. తాము మద్దతు ఇవ్వకపోతే పరిస్థితి ఏందో కాంగ్రెస్ పెద్దలకు కూడా తెలుసని ఆ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. మా పాలనను చూసి ప్రజలు గెలిపించారు. తామే గెలిపించామని అనుకుంటే పొరపాటే అని అక్బరుద్దీన్కు మంత్రి శ్రీధర్ బాబు కౌంటర్ ఇచ్చారు.

# భారత వృద్ధి 6.4 శాతం




**హైదరాబాద్, ఫిబ్రవరి 9:** ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మొదలయ్యే 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.4 శాతం మేర పెరుగుతుందని ప్రముఖ రేటింగ్స్ సంస్థ మూడీస్ అభిప్రాయపడింది. దీనివల్ల జీ-20 దేశాల్లోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ నిలుస్తుంది. ప్రధానంగా దేశీయ వినియోగం పటిష్టంగా ఉండటంతో పాటు అందుకు మద్దతుగా విధానపరమైన చర్యలు, తక్కువ ద్రవ్యోల్బణం వంటి పరిణామాలు వృద్ధికి దోహదపడుతున్నాయి. మరీ ముఖ్యంగా దేశీయ వినియోగమే భారత వృద్ధికి కీలకమైన చోదకంగా ...మిగతా 2లో

## ఆన్‌లైన్ గేమింగ్ ఆటకట్టు

### రూ.5వేల కోట్ల నెట్‌వర్క్ ఛేదించిన జీఎస్‌టీ ఇంటెలిజెన్స్

- దుబాయ్ కేంద్రంగా రాకెట్
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపు
- రంగంలోకి దిగనున్న ఈడీ



2

# ‘సర్’కు అడ్డంకులు కల్పించొద్దు

### బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

### అన్ని రాష్ట్రాలూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ‘సూచనాత్మక హెచ్చరిక’



**ఢిల్లీ, ఫిబ్రవరి 9:** బెంగాల్లో నిర్వహిస్తోన్న ‘సర్’ ప్రక్రియను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ‘సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని ఈ సందర్భంగా బెంచ్ బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 300 మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, ...మిగతా 2లో

# స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాసం!

### ఓం బిర్లా తమను మాట్లాడనివ్వడం లేదని విపక్షాల ఆరోపణలు



**ఢిల్లీ, ఫిబ్రవరి 9:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలు నోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం ...మిగతా 2లో

### ఫీజులు పెంచినా విదేశీ టాలెంట్ కావాల్సిందే..

ఏఐతో ‘హెచ్-1బీ’కి డిమాండ్




9

# కారుకూతలు కూస్తే బొక్కలోకే



ఖమ్మం, ఫిబ్రవరి 9(మనం బ్యూరో): 'రాజకీయాల ముసుగులో అరాచకాలు చేస్తామన్నా... ఫోన్లలో బెదిరింపులకు దిగినా సహించేది లేదు. 11వ తేదీ ఎన్నికలు ముగియనివ్వండి.. హద్దులు దాటిన ప్రతి ఒక్కరి లెక్క తేలుస్తా. చందాలు, దందాలు చేస్తే కింద పడుద్ది జాగ్రత్త! తింగరి వేషాలు వేస్తే ఊరుకోం.. చట్టప్రకారం మీ అందరినీ బొక్కలో వేయించడం ఖాయం' అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యర్థులను హెచ్చరించారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రచార పర్వంలో ప్రత్యర్థుల తీరుపై మంత్రి నిప్పులు చెరిగారు.

### దందాలకు కాలం చెల్లింది..

'ఎవరైనా కారుకూతలు కూస్తే చట్టరీత్యా ఉక్కుపాదం మోపుతాం. మీ బెదిరింపులకు ఇక్కడ ఎవరూ భయపడరు. మీ దందాలకు, దౌర్జన్యాలకు ప్రజలు ఈ ఎన్నికలతో ఫుల్ స్టాప్ పెట్టబోతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరగాలి. అశాంతి సృష్టించాలని చూస్తే ఉక్కుపాదం మోపుతాం' అని హెచ్చరించారు.

### అధికారం లేని మీరు అభివృద్ధి ఎలా చేస్తారు?

'అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వ సాయం ఉండాలి. అధికారంలో ఉన్న మేమే పనులు చేయగలం. ఏ అధికారం ఉందని మీరు మేలు చేస్తామంటూ ప్రజల వద్దకు వస్తున్నారు? అంటూ రంగురంగుల కండువాలు వేసుకుని వస్తున్న నాయకులను మంత్రి సూటిగా ప్రశ్నించారు. పదేండ్లు అధికారంలో ఉన్న ఆ 'దొర'లకు పేదలకు ఇల్లు ఇవ్వాలనే జ్ఞానం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేండ్లలోనే కొత్త రేషన్ కార్డులు, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జీల పెంపు వంటి ఎన్నో సంక్షేమ ఫలాలను అందించామని గుర్తుచేశారు.

### ఏప్రిల్లో 'ఇందిరమ్మ' ఇండ్లు

వచ్చే ఏప్రిల్ నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేపడతామని మంత్రి ప్రకటించారు. 'ప్రభుత్వ భూముల్లో ఇండ్లు వేసుకున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే. ఏదులాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా' అని హామీ ఇచ్చారు. మున్నేరు వరద బాధితులకు అండగా ఉన్నామని, వచ్చే వర్షాకాలం నాటికి రిటైనింగ్ వాల్ పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. సభ అనంతరం వరంగల్ క్రాస్ రోడ్డు నుంచి నాయుడు పేట సర్కిల్ వరకు వేలాది మందితో జరిగిన భారీ ర్యాలీలో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పార్టీల హోరాహోరీ

(మొదటి పేజీ తరువాయి)

పడుతుందని హెచ్చరించింది. రాజకీయ పార్టీల అభ్యర్థులు నిబంధనలు పాటించాలని ఆదేశించింది. దీంతో పోలింగ్‌కు 48 గంటల ముందు మైకులు మూగపోయాయి. ఈనెల 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 12, 883 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన ఈ ఎన్నికల కోసం 2,996 వార్డులకు గాను 8,203 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11న పోలింగ్ జరిగి.. 13న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఈ ఎన్నికలలో అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలుచుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారు. బహిరంగ సభలలో పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన సీఎం పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనూ ప్రజలకు ఆ పార్టీ చేసిందేమీ లేదని విమర్శించారు. అధికార పార్టీ అభ్యర్థులను మున్సిపల్ చైర్మన్లు, మేయర్లుగా ఎన్నుకుంటే నిధులు భారీగా మంజూరయ్యే అవకాశం ఉంటుందనీ, తద్వారా అభివృద్ధి వేగంగా సాగుతుందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే ఒరిగేదేమీ ఉండదనీ, వారికి ఓటు వేస్తే మూసీలో వేసినట్టేనని పేర్కొన్నారు. అలాగే, కాంగ్రెస్ అభ్యర్థుల పక్షాన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే అభివృద్ధి సాఫీగా సాగుతుందని ప్రతిపక్ష అభ్యర్థులను గెలిపిస్తే ఆటంకం కలుగుతుందని స్పష్టం చేశారు. కాగా, మున్సిపల్ ఎన్నికల బరిలో ప్రధాన ప్రతిపక్షంగా దాదాపు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను బరిలో నిలిపింది. ఆ పార్టీ అభ్యర్థుల పక్షాన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బహిరంగ సభల్లో ఎండగడుతూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధిస్తారని అభివృద్ధి చేసి చూపిస్తారని స్పష్టం చేశారు.

ఇక బీజేపీ అభ్యర్థుల పక్షాన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

# 'సర్'కు అడ్డంకులు కల్పించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు చెప్పింది.

# ఇప్పటి వరకే రూ.11.83 కోట్లు

హైదరాబాద్, మనం ప్రతినిధి: మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. సోమవారంతో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. అయితే, ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఒక్కరోజే 163 హుండీలను లెక్కించగా మరో రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.

# రైళ్లలో ఇ-ప్యాంట్రీ సౌకర్యం

ఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కొత్త సదుపాయం తీసుకొచ్చింది. రైల్లో ఫుడ్ ఆర్డర్ చేసేందుకు ఇ-ప్యాంట్రీ సదుపాయాన్ని ఐఆర్సీటీసీ ప్రవేశపెట్టింది. తొలుత వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ సేవలను ప్రారంభించగా.. 25 మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్యాంట్రీ కారు కలిగిన ఎంపిక చేసిన రైళ్లలో ఈ సేవలను పొందొచ్చు.కన్ఫమ్ టికెట్, ఆర్ఏసీ, పాక్షికంగా టికెట్ కన్ఫమ్ అయిన ప్రయాణికులు ఇ-ప్యాంట్రీ ద్వారా ప్రీ ఆర్డర్ చేసుకోవచ్చు. ప్యాంట్రీ కార్ స్టాఫ్ సీటు దగ్గరకే ఆహారాన్ని డెలివరీ చేస్తారు. ఐఆర్సీటీసీ వెబ్సైట్ లేదా యాప్లో 'బుక్డ్ టికెట్ హిస్టరీ' సెక్షన్లో ఇ-ప్యాంట్రీ మీల్ ఆప్షన్ కనిపిస్తుంది. మీల్ బుక్ చేసుకున్నాక మీల్ వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దాన్ని డెలివరీ సమయంలో చూపించాలి. విశాఖ నుంచి వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ జాబితాలో ఉంది. దశలవారీగా మిగిలిన రైళ్లకూ విస్తరించనున్నారు.కీ ఫీచర్లు: ఇ- ప్యాంట్రీ ద్వారా స్టాండర్డ్ లేదా రైల్నీర్ను బుక్ చేసుకోవచ్చు. ట్రైన్ ఎక్కాక ఆహారం కోసం ఆలోచన చేయాల్సిన అవసరం తప్పుతుంది. డిజిటల్ మోడ్లో చెల్లింపులు చేయొచ్చు. ఆన్లైన్లో మీరు ఫుడ్ బుక్ చేసుకోగానే మీకు మీల్ వెరిఫికేషన్ కోడ్ అందుతుంది. మీల్ ఆర్డర్ నుంచి డెలివరీ వరకు ట్రాకింగ్ ఉంటుంది. ఏదైనా కారణంతో ఫుడ్ డెలివరీ అవ్వకపోతే ఆ సమాచారం కూడా ఎస్సెమ్మెస్/ ఇ-మెయిల్ ద్వారా సమాచారం వస్తుంది.

# డిజిటల్ క్రాప్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. దేశంలోని యుపి, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తి అయిందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా తెలిపారు. అదే తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఇప్పటి వరకు చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే వివరాలను ఉన్నతాధికారులకు వివరించారు.

# మోడీ మోరీ తీస్తెందుకొస్తడా?

(మొదటి పేజీ తరువాయి)

బండి సంజయ్ ఆ తరువాత మాట మార్చి ఇన్సూరెన్స్‌క్లెయిమ్ చేసుకోవాలని సలహా ఇచ్చారనీ, ఆయన తీరు సత్రం భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి రికమండేషన్ ఇచ్చినట్లు బండి సంజయ్ తీరు ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు రూ.లక్షల కోట్లు ఇచ్చామని బీజేపీ నేతలు చెబుతున్నారనీ, దీనిపై సీఎస్‌ను వివరణ కోరితే మనం కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి చెల్లిస్తే కేంద్రం కేవలం 42 పైసలు మాత్రమే ఇస్తోందనీ, బీహార్ ఒక్క రూపాయి చెల్లిస్తే రూ.6.16 ఇస్తోందన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగితే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏనాడైనా నోరు మెదిపారా ? అని ప్రశ్నించారు. తెలంగాణకు వచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన సెమీ కండక్టర్ ప్రాజెక్టును ఒత్తిడి చేసి మరీ మోడీ ఏపీకి తరలించారని ఆరోపించారు. అసలు మున్సిపల్ ఎన్నికలకు మోడీకి ఏం సంబంధం ? బీజేపీ నేతలకు దేవుడు అసదుద్దీన్ ఒవైసీ, ఆయన పేరు లేకుండా వారి ప్రచారం ఉండదని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్న సీఎం రాష్ట్రంలో దరిద్రానికి ఆ పార్టీనే కారణమని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని యాసిడ్ పోసి కడగాలనీ, 2014 నుంచి 2022 వరకు ఆ పార్టీ బీజేపీతో మైత్రీబంధం కొనసాగించిందనీ, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలకు ఆ పార్టీ సహకరించలేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు సోయి లేనోల్ల మాదిరి మాట్లాడుతున్నరనీ, కాళేశ్వరం అవినీతిపై కేసు సీబీఐకి ఇస్తే ఆరు నెలలైనా అతీగతీ లేదనీ, వారం రోజుల్లో కేసీఆర్‌ను అరెస్ట్ చేస్తామన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్కడ దాక్కున్నరని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# జెలుకుపోవాలని బావబామ్మర్దులు పోటీ పడ్తున్నరు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయమని అభిప్రాయపడ్డారు. మనిషి విక్రుతంగా మారినప్పుడు ప్రకృతి బ్యాలెన్స్ చేస్తుందనీ, ఎవరైనా కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదని పేర్కొన్నారు. రంజిత్ రెడ్డిని మంత్రిని చేస్తానని తానెక్కడా చెప్పలేదనీ, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి జిల్లాల కుదింపు, కొత్త జిల్లాల ఏర్పాటు ఆలోచన లేదనీ, దీనిపై కేంద్ర ప్రభుత్వం మార్చి 31, 2027 వరకు నిషేధం విధించిందని చెప్పారు.

# స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాసం!

(మొదటి పేజీ తరువాయి)

వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్ వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి. మరోవైపు, పార్లమెంట్లో సోమవారం కూడా సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్ సభ పలుమార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశారు.

# కొమురంభీం జిల్లాలో మావోల కదలికలు

## రంగంలోకి పోలీసులు



హైదరాబాద్, ఫిబ్రవరి 9: జిల్లాలోని తిర్యాణి మండలం పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. గ్రేహౌండ్స్ బలగాలు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి మావోయిస్టుల సామగ్రిని గుర్తించాయి. అయితే పోలీసుల సమాచారం ముందుగానే తెలుసుకున్న మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. ఘటనా స్థలిలో మావోలు ఉపయోగించిన వంటపాత్రలు, ఇతర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ప్రాంతంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. మావోయిస్టుల కదలికలతో జిల్లాలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

కాగా, గత ఏడాది డిసెంబర్లో జిల్లాలోని పెడల్దోబా గ్రామంలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా కొమురంభీం ఆసిఫాబాద్ - మంచిర్యాల డివిజనల్ కమిటీ సెక్రటరీ ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్ సహా 41 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు.

# విభేదాలు పక్కనబెట్టి

- అభ్యర్థులను గెలిపించడంపై దృష్టి పెట్టండి
- జూమ్ మీటింగ్ ద్వారా శ్రేణులకు సీఎం ఆదేశం
- పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా ఉండాలని మంత్రులకు దిశానిర్దేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (మనం బ్యూరో): మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు విభేదాలు పక్కనబెట్టి అభ్యర్థుల విజయంపై దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి చివరి రోజైన సోమవారం సీఎం తన నివాసం నుంచి 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, పార్టీకి చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఉన్న అనుకూలత, ప్రతిపక్షాల ఎత్తుగడలు, ఓటర్ల నాడిని అడిగి తెలుసుకున్నారు. ప్రచారం ముగిసిన తరువాత పోలింగ్ ముగిసే వరకు ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉండాలని, పోల్ మేనేజ్‌మెంట్ పకడ్బందీగా ఉండాలని మంత్రులకు సూచించారు. ఎక్కడైనా అసమ్మతి, రెబల్స్ సమస్య ఉంటే వెంటనే పరిష్కరించి కేడర్‌ను ఏకతాటిపైకి తీసుకు రావాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మంత్రులు ఈ విషయంపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. అత్యధిక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు.

# ఆన్‌లైన్ గేమింగ్ ఆటకట్టు

- రూ.5వేల కోట్ల నెట్‌వర్క్ ఛేదించిన జీఎస్‌టీ ఇంటెలిజెన్స్
- దుబాయ్ కేంద్రంగా రాకెట్
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- రంగంలోకి దిగనున్న ఈడీ





హైదరాబాద్,ఫిబ్రవరి 9(మనం,ప్రత్యేక ప్రతినిధి): దేశవ్యాప్తంగా విస్తరించిన సుమారు రూ.5 వేల కోట్ల విలువైన ఆన్‌లైన్ గేమింగ్ నెట్‌వర్క్‌ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) హైదరాబాద్ అధికారులు ఛేదించారు.ఈ నేపథ్యంలో అన్ లైన్ గేమింగ్ రాకెట్ పై దాడులు చేపట్టి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్, ఢిల్లీ, ముంబై నగరాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తనిఖీలలో కీలక ఆధారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాంక్ లావాదేవీల వివరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పన్ను ఎగవేత, అక్రమ లావాదేవీలు, హవాలా మార్గాల ద్వారా డబ్బు మార్పిడి వంటి ఆరోపణలపై విస్తృత స్థాయిలో దర్యాప్తు చేట్టిన అధికారులు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. కాగా నిందితులిద్దరూ ముంబైకి చెందిన వైఎస్ ప్రభు కుమార్, హైదరాబాద్‌కు చెందిన రాజ శేఖర్ రెడ్డిగా గుర్తించారు. వీగోఫిన్ డిజిటల్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్‌గా ప్రభు కుమార్ వ్యవహరిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది.

### బ్యాంకులకు టోకరా:

ఆన్‌లైన్ గేమింగ్ స్కాంలో రూ. 5 వేల కోట్ల రూపాయల పన్ను ఎగ్గొట్టిన నిందితులు నిధులను దుబాయ్‌కి మళ్లించినట్లు విచారణలో తేలిందితేలింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు బ్యాంకులకే టోకరా వేశారని, ఓటీపీ లేకుండానే 5 వేల కోట్లు నిధుల బదలాయింపు జరిపారని అధికారులు చెబుతున్నారు. దుబాయ్ కేంద్రంగా 'మాస్టర్ మైండ్' కొనసాగిందని, అయితే హైదరాబాద్‌లో తీగ లాగితే ఆన్‌లైన్ గేమింగ్ డొంక కదిలిందని వివరించారు.నిబంధనలకు విరుద్ధంగా రియల్ మనీ గేమింగ్.. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ఎస్క్రో ఖాతాల వినియోగించినట్లు డీజీజీఐ తెలిపింది.ఈ రాకెట్‌లో హైదరాబాద్ నగరానికి చెందిన రాజ శేఖర్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. విదేశీ సర్వర్లు, షెల్ కంపెనీలు, ఫేక్ అకౌంట్ల ద్వారా భారీ స్థాయిలో బెట్టింగ్ గేమింగ్ కార్యకలాపాలు నిర్వహించినట్లు ప్రాథమికం విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. జీఎస్టీ చట్టాల ఉల్లంఘనతో పాటు ఈ వ్యవహారంపై ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్కాంకు సంబంధించి కీలక వ్యక్తులపై నిఘా కొనసాగుతోందని, అన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు స్పష్టం చేశారు.

### దుబాయ్ కేంద్రంగా:

ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్ కేంద్రంగా నెట్‌వర్క్ నిర్వహించినట్లు డీజీజీఐ గుర్తించింది. ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల మళ్లింపు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఓషియానిక్ వెబ్ సొల్యూషన్స్, వెబ్విన్ సొల్యూషన్స్ అనే నకిలీ షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లించారని, అలాగే ఫన్‌ఇన్ మ్యాచ్ 360,రేస్‌జి-ఇటి 247 వెబ్‌సైట్‌ల ద్వారా అక్రమాలు చేసినట్లు విచారణలో వెలుగుచూసింది. అలాగే బ్యాంకింగ్ ఏపీఐలను దుర్వినియోగం చేసిన నిందితులు ఈ స్కాం ఆడిట్‌కు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తేలిందని అధికారులు వివరించారు.

# ఇది ఘోర అపచారం.. ధర్మ విరుద్ధం

## శ్రీవారి లడ్డూపై బాబుకు పెద్ద జీయర్ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి 9: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం.. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీసిందని శ్రీవారి ఆలయ పెద్ద జీయర్ స్వామిజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై పెద్ద జీయ్యర్ సోమవారం స్పందిస్తూ.. సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. శ్రీవారికి నివేదించే అన్న ప్రసాదాలు, లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇది ఘోర అపచారం.. ధర్మ విరుద్ధం.. అత్యంత బాధ్యతారహితమైన చర్య' అని పెద్ద జీయర్ స్వామి అభివర్ణించారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శ్రీవారి భక్తుడైన సీఎం చంద్రబాబుకు ఆయన సూచించారు. 'ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడే శక్తిని మీకు ఆ దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను' అని పెద్ద జీయర్ తన లేఖలో రాశారు.



# ముఖ్యమంత్రులే మా దగ్గరికొస్తరు

(మొదటి పేజీ తరువాయి)

ప్రచారంలో పాల్గొన్న ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీఎంల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ వద్దకు వస్తారని అన్నారు. ''రెడ్డి అయినా.. రావు అయినా మా దగ్గరికి రావాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మా మద్దతు లేనిదే కాంగ్రెస్ గెలిచిందా? ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం బ్రదర్స్ సత్తా ఏందో చూపిస్తం' అని అన్నారు.

# భారత వృద్ధి 6.4 శాతం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మూడీస్ పేర్కొంది. ఇదే సమయంలో ఈ గిరాకీ కొనసాగడంలో ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. గతేడాది ఆఖరులో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) పన్ను రేట్లను తగ్గించడం, అంతకుముందు యూనియన్ బడ్జెట్లో వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితులను పెంచడం, తద్వారా ప్రజలు ఖర్చు చేయడం వల్ల వృద్ధి మరింత వేగవంతంగా మారిందని మూడీస్ వివరించింది. ఇదే సమయంలో దేశ బ్యాంకింగ్ వ్యవస్థ గురించి ప్రస్తావించిన మూడీస్, దేశీయ బ్యాంకింగ్ రంగం స్థిరంగా, సమర్థవంతంగా కొనసాగుతోంది. ఎంఎస్ఎంఈ విభాగంలో కొంత ఒత్తిడి ఉన్నప్పటికీ, బ్యాంకింగ్ రంగ ఆస్తుల నాణ్యత బలంగా ఉంటుందని మూడీస్ అంచనా వేసింది. ఏదైనా రుణాల విభాగంలో నష్టాలు ఎదురైతే, తగినంత బఫర్, నిధులు బ్యాంకుల వద్ద ఉన్నాయని మూడీస్ పేర్కొంది.

# ప్రతి ఇంటి బాట-మా పాలనకు బాట

## చేస్తాం కాదు చేసి చూపిస్తామని కాసిరెడ్డి రాధా మోహన్ రెడ్డి



**కోరుట్ల ఫిబ్రవరి 9 (మనం న్యూస్):** వార్డ్ ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకుని స్థిరమైన పరిష్కారాలు అందించడమే లక్ష్యంగా సమగ్ర అభివృద్ధి కార్యాచరణను అమలు చేస్తున్నామని కాసిరెడ్డి రాధా మోహన్ రెడ్డి తెలిపారు. ప్రజలు చెప్పింది ముందుగా చేస్తాం. ఇంటింటి మాటే మా పాలనకు బాట అన్నారు. రాధ గురించి మాట్లాడుతూ - మా రాధ ఈ ఊరి అమ్మాయి, చిన్నప్పటి నుంచే అందరికీ తెలిసిన బిడ్డ. ప్రజలతో ఆ అనుబంధం బలంగా ఉంది అని చెప్పారు

### విద్యా రంగంలో కీలక చర్యలు...

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో డిజిటల్ క్లాసులు, ఇఇఖీగ భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి సాయంత్రం ట్యూషన్ సపోర్ట్, పేద పిల్లలకు ఉచిత కోచింగ్ స్కాలర్షిప్ సహాయం అందిస్తామని చెప్పారు. డ్రాప్ఔట్ పిల్లలను తిరిగి చదువులోకి తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. నిధులు సమయానికి రాకపోయినా స్కూల్ నిర్మాణాన్ని ఆపకుండా పూర్తి చేయించడం కూడా ఈ అభివృద్ధిలో భాగమే అని పేర్కొన్నారు.

### వైద్య సేవలు - గ్రామానికే అందుబాటులో

గ్రామంలోనే నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత మెడికల్ క్యాంప్, మహిళలు మరియు వృద్ధులకు ప్రత్యేక వైద్య సహాయం, కంటి పరీక్షలు మరియు అవసరమైన వారికి ఆపరేషన్ల సపోర్ట్ కల్పిస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి సపోర్ట్ అందించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

### యువత మహిళలకు ఉపాధి అవకాశాలు

యువతకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్, జాబ్ మేళాల్లో మార్గదర్శనం, స్థానిక ఉద్యోగ అవకాశాల సృష్టి పై దృష్టి పెట్టారు. స్వయం ఉపాధి కోసం బ్యాంక్ లింకేజ్ సపోర్ట్, మహిళలకు ఆర్థిక స్వావలంబన పథకాలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

### మౌలిక సదుపాయాల విస్తరణ...

వార్డులో ఓపెన్ జిమ్, లైబ్రరీ, ఫ్రీ గ్రౌండ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రజలకు అవసరమైన కమ్యూనిటీ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.

### స్థానిక అభివృద్ధి పనులు - ఇప్పటికే ప్రారంభం

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం, రోడ్లు-డ్రైనేజీ-వీధి దీపాల అభివృద్ధి, టైమ్ ఫ్రేమ్తో సమస్యల పరిష్కారం అమలు జరుగుతోందని తెలిపారు. ఇప్పటికే పలు వీధుల్లో ఇఇ రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి చేయడం జరిగిందని, బస్టాండ్ నుంచి మల్లన్న గుడి వరకు ఇఇ రోడ్డు, వడ్డేర కాలనీ, సబ్ స్టేషన్ వీధి, రైస్మిల్ వీధి తదితర ప్రాంతాల్లో పనులు చేపట్టినట్లు వివరించారు.

### నేత వ్యాఖ్య ....

వాళ్లు చేస్తాం అంటారు...మేము చేసి చూపిస్తామని ప్రతి ఇంటి మాట మా పాలనకు బాట. చేసి చూపిస్తామని కాసిరెడ్డి రాధా మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి

### తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి



**రంగారెడ్డి, ఫిబ్రవరి 9(మనంన్యూస్):** తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి కోరారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో ఆయన తెలంగాణ ఉద్యమకారులు దూసకంటి రవి,మునవాత్ ఠాకూర్,ఊరెడి ప్రకాశ్ ముదిరాజ్,కే గొవర్ధన్ చారీ,సలెకుల శ్రీశైలం యాదావ్,మాడ్గుల సాయిరాం,తడకల పరమేశ్,ఉండల్ల బాబురావుతో కలసి గోడ పత్రికను ఆవిస్కరించారు. ఈ సందర్బంగా కప్పాటి పాండురంగా రెడ్డి మాట్లడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి, అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటిచెప్పేందుకు తెలంగాణ ఉద్యమ సంఘాలతో కలసి తెలంగాణ జాగృతి సన్నద్ధమైంది. ఈ నెల 12వ తేదీ (గురువారం) ఉదయం 10 గంటలకు హైదరాబాద్, బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో 'ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లువెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమకారుల గొప్పతనాన్ని మరియు సభ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు.'తెలంగాణ గడ్డపై నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ వెనుక వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అమరవీరుల బలిదానాలు ఉన్నాయి. లాఠీ దెబ్బలకు వెరవక, జైలు శిక్షలకు భయపడక, ప్రాణాలకు తెగించి స్వరాష్ట్ర కాంక్షతో పోరాడిన ప్రతి ఒక్కరూ ఈ మట్టి బిడ్డలే. ఆనాడు ఉద్యమంలో చూపిన అదే ధైర్యాన్ని, నేడు మన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడంలోనూ చూపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప ఇచ్చిన హామీలను, ఉద్యమకారులకు జార్కాండ్ లాంటి రాష్ట్రలలో కల్పిస్తున్న రాయితీలను ఉద్యమ లక్ష్యాలు నెరవేరేలా ఐక్యత చాటడం తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి ఉద్యమకారులందరినీ ఒకే వేదికపైకి తెచ్చి, ఉద్యమకారుల అజేయమైన శక్తిని చాటిచెప్పడం.కోసం కల్వకుంట్ల కవితమ్మ కృషిచేస్తుంది అని అన్నారు. ఉద్యమకారుల ప్రస్తుత పరిస్థితులు, వారి ఆవేదనపై చర్చించిన కవితమ్మ, భవిష్యత్ కార్యాచరణను రూపొందించడం తెలంగాణ జాగృతి ఆద్వర్యంలో జరుగుతుందని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మరియు ఉద్యమ స్పూర్తిని భావి తరాలకు అందించేలా సభ నిర్వహణ ఉంటుంది అని పాండురంగారెడ్డి అన్నారు. ఈ ఆత్మగౌరవ సభకు తెలంగాణ నలుమూలల నుంచి ఉద్యమకారులు, జాగృతి శ్రేణులు, మేధావులు మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని పాండురంగారెడ్డి పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక సభ మాత్రమే కాదని, తెలంగాణ ఉద్యమ చరిత్రలో మరో కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు.

# ఐ.డి.పిఎస్ పాఠశాలలో ఘనంగా రెండవ వార్షికోత్సవం







**వనస్థలిపురం ఫిబ్రవరి 10 (మనం న్యూస్):** ఐ.డి.పి.ఎస్ పాఠశాలలో రెండవ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చూపిన ప్రతిభ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది.

ఈ వేడుకలో ప్రధాన ఆకర్షణగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రహ్లాద నాటకం నిలిచింది. సంభాషణలు, హావభావాలు, వేషధారణలతో ఆధ్యాత్మిక భావాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థులు చేసిన నటన అందరినీ ఆకట్టుకుంది. చిన్న వయసులోనే వారు చూపిన ఆత్మవిశ్వాసం ప్రశంసనీయం. అలాగే, జల్లియన్వాలా బాగ్ ఘటనపై చేసిన ప్రదర్శన హృదయాలను కదిలించింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులు అద్భుతమైన భావవ్యక్తీకరణతో ప్రదర్శించారు. వారి నటనలో దేశభక్తి స్పష్టంగా ప్రతిఫలించింది.పి.పి.టు విద్యార్థులు ప్రదర్శించిన మామ్ అండ్ డ్యాడ్ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తల్లిదండ్రులపై ప్రేమను చిన్నారులు చూపిన హావభావాలు ప్రేక్షకుల మనసులను తాకాయి.అదేవిధంగా, పాశ్చాత్య నృత్యాలు కూడా ఈ వేడుకకు ప్రత్యేక మెరుపు తెచ్చాయి. విద్యార్థుల గ్రేస్, శరీరభాష, స్టేజ్ ప్రెజెన్స్తో ప్రతి ప్రదర్శన మరింత రసవత్తరంగా మారింది. నిజంగా వారు షోను నెయిల్ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.వి.కె రావు, చైర్మన్ ఎస్.టి.మేరీ పాల్గొని, విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ ప్రోత్సాహకరమైన మాటలు చెప్పారు. అలాగే కార్పొరేటర్ శ్రీ నవజీవన్ రెడ్డి గారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఐ. డి.పి.ఎస్ వ్యవస్థాపకులు డా. ఆకాష్ సహ-వ్యవస్థాపకులు శ్రీ సాంబశివరావు గారు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. అదేవిధంగా, మా పాఠశాల ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ కలిసి ఈ వేడుకను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు.

**ముగింపు:**

ముగింపుగా, ఐ.డి.పి.ఎస్ పాఠశాల కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులను జీవితం కోసం తీర్చిదిద్దే విద్యను అందిస్తోందని ఈ వార్షికోత్సవం మరోసారి నిరూపించింది. ఇక్కడ విద్య అనేది మార్కుల కోసం మాత్రమే కాదు, వ్యక్తిత్వ వికాసం, విలువలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాల పెంపకమే లక్ష్యంగా సాగుతోంది. విద్య అనేది పరీక్షల కోసం కాదు జీవితం కోసం. అనే సందేశంతో ఈ కార్యక్రమం అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచింది.



# దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**రంగారెడ్డి, ఫిబ్రవరి 9(మనంన్యూస్):** ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని బి.ఆర్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న ఉదయం 10:30 గంటలకు బాగ్లింగంపల్లి బస్ భవన్ నుండి ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ ఇందిరాపార్క్ వద్ద సభ ఉంటుంది కనుక కార్మికులు ఉద్యోగ సంఘాలు సంఘటిత అసంఘటిత బ్యాంకింగ్ విద్యార్థి కార్మిక నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీ పాల్గొనాలని కోరారు. ఐ ఈ కార్యక్రమంలో రాష్ట్ర బి ఆర్.టి.యు కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కుడా రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తూ కేంద్ర కాంగ్రెస్ రాహుల్ గాంధీ ఈ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతుంటే,రాష్ట్ర రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిగ్గు లేకుండా చట్టాలను అమలు చేయడానికి సిద్ధమవుతున్నాయి ఈ తరుణంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపడానికి కార్మిక కర్షక ప్రజా సంఘాలను ఏకం చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చీకటి ఒప్పందాన్ని బట్ట బయలు చేసి ప్రజా కోర్టులో నిలబెట్టాలని కార్మిక,కర్షక ప్రజా సంఘాలకు పిలుపునిచ్చారు. ఐఈ కార్యక్రమంలో బి ఆర్ టి యు రాష్ట్ర కార్యదర్శిలు మహేష్ దేశ ఫక్, సిహెచ్ సాయికుమార్, కే మారుతి కిరణ్,ఆర్ నిరంజన్,ఎన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబానికిరూ.34 లక్షల బీమా





**హైదరాబాద్ :ఫిబ్రవరి 9(మనం,ప్రత్యేక ప్రతినిధి):** విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి అండగా నిలుస్తూ పోలీస్ శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా రూ. 34 లక్షల బీమా పరిహారాన్ని అందజేశాయి. వివరాల్లోకి వెళితే..రాచకొండ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా (నం. 1522) విధులు నిర్వహించిన ఎం. వెంకటేశ్ గతేడాది ఏప్రిల్ 27న జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. హోంగార్డు విభాగంతో యాక్సిస్ బ్యాంక్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, వేతనం అకౌంట్ కలిగిన సిబ్బందికి వర్తించే ప్రమాద బీమా సౌకర్యం కింద రూ. 34 లక్షల పరిహారం మంజూరైంది.ఈ క్రమంలో డీజీపీ కార్యాలయంలో సోమవారం నాడు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడిషనల్ డిజిపి (హోంగార్డ్స్ ) స్వాతి లక్రా చేతుల మీదుగా చెక్కును మృతుడి భార్య కొడిగంటి స్వాతికి అందజేశారు.

ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ.. మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీసు శాఖ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. విపత్కర సమయంలో బాధిత కుటుంబానికి సకాలంలో ఆర్థిక సాయం అందించిన యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. చెక్ పంపిణీ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, బ్యాంక్ ప్రతినిధులు, హోంగార్డ్ రీజియన్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, ఏవో సాయి కుమార్ పాల్గొన్నారు

# అశోక్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ విద్యార్థి సేన క్రికెట్ టోర్నమెంట్

- రెండవ రోజు ప్రారంభించిన అశోక్ నాయక్
- విద్యతో పాటు విజ్ఞానాన్ని సోదర భావాన్ని పెంపొందించుకోవాలి
- సేవాలాల్ విద్యార్థి సేన స్టేట్ వైస్ ప్రెసిడెంట్ వంకుడోత్ అశోక్ నాయక్



**హైదారాబాద్, ఫిబ్రవరి 9(మనంన్యూస్):** కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతిని పురస్కరించుకొని కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు, సేవాలాల్ సేన క్రికెట్ టోర్నమెంట్ మరియు అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా ప్రారంభించిన యూనివర్సిటీఅశోక్ నాయక్ . కాకతీయ యూనివర్సిటీ బంజారా గిరిజన విద్యార్థులందరూ విద్యతో పాటు శారీరక దృఢత్వం, వ్యాయామ విద్య ఆటలతో సోదర భావాన్ని పెంపొందించి సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క బంజారా విద్యార్థి పాటుపడాలని వీసి ఆకాంక్షించారు. ఇంత ఘనంగా కాకతీయ యూనివర్సిటీలో సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని క్రీడలను ఏర్పాటు చేయడంలో బంజారా విద్యార్థుల ఉత్సాహాన్ని కొనియాడారు. గిరిజన విద్యార్థులతో పాటు యూనివర్సిటీలో చదువుతున్న వివిధ డిపార్ట్మెంట్ల విద్యార్థులు ఈ సేవాలాల్ టోర్నమెంట్లో పాల్గొని క్రీడా పోటీలను విజయవంతం చేయాలని, విద్యతో పాటు విజ్ఞానాన్ని, సోదర భావాన్ని పెంపొందించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ దాదాపు 32 విభాగాలను చెందిన విద్యార్థులు, గిరిజన సంఘం నాయకులు, సేవాలాల్ సేన ఇతర వర్గాల విద్యార్థులు సేవాలాల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని కాకతీయ యూనివర్సిటీ బంజారా విద్యార్థులు ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని చాలా ఉత్సాహంగా పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్న సంగతి యావత్ రాష్ట్ర బంజారా యువకులకు ఎంతో ఆదర్శవంతంగా ఉంటుందని ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని క్రీడా పోటీలను చాలా ఉత్సాహంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ బంజారా విద్యార్థులను ముఖ్యంగా అశోక్ నాయక్ ను అతని మిత్రులను అభినందిస్తూ ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్. రమేష్ నాయక్ ,లైబ్రరీ ఇంచార్జ్ జవహర్, ప్రొఫెసర్ ఈసం నారాయణ ,హన్మకొండ సేవాలాల్ సేన అధ్యక్షుడు మురళి నాయక్ మరియు సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు పవన్ నాయక్, శ్రీను,వెంకన్న, సచిన్, శ్రీకాంత్,అశోక్, పాల్గొన్నారు.

# లెక్క.. తేల్చేపనిలో పోలీసులు

- రోహింగ్యాల కదలికలపై నిఘా
- ఎలా చొరబడ్డారనే అంశాలపై నజర్
- సహకరిస్తున్న స్థానికులపై కేసులు



**హైదరాబాద్,(మనం,ప్రత్యేక ప్రతినిధి): :** కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికలలో రాష్ట్రంలో రోహింగ్యాల,బంగ్లాదేశ్కు చెందిన చొరబాటు దారులపై నిఘా సారిస్తున్నారు. రాష్ట్రంలోని జహీరాబాద్, బైంసా, నిజామాబాద్ తదితర ప్రాంతాలలో రోహింగ్యాలు ఎంతమంది ఉన్నారన్న కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ పరిధిలోని మూడు పోలీసు కమిషన రేట్లలో రోహింగ్యాల వివరాలను ఎస్బీ పోలీసులు సేకరిస్తున్నారు. నగరంలోని మూడు కమిషనరేట్ పరిధిలో దాదాపు 6040 మంది రోహింగ్యాల ఉన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5 వేల మంది రోహింగ్యాలు, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1000, సైబ రాబాద్ కమిషనరేట్ పరిధిలో 40 మంది రోహింగ్యాలు ఉన్న ట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఇదే విషయాన్ని పోలీసులు కేంద్ర నిఘా వర్గాలకు నివేదిక సమర్పించినట్లు సమాచారం. గత 15 సంవత్సరాలుగా రోహింగ్యాలు దేశం లోని ఇతర నగరాలతో పాటు హైదరాబాద్కు పెద్ద సంఖ్యలో ఖ్యాలా వలసవచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ప్రధానంగా శివార్లతో పాటు పాతబస్తీలోని బహదూర్పురా, కంచన్బాగ్ , చాంద్రాయణగుట్ట పోలీస్టేషన్ల పరిధిలో వీరు నివసిస్తున్నారని పోలీసులు వివరిస్తున్నారు. అయితే రోహింగ్యా శరణార్థుల ముసుగులో అసాంఘిక శక్తులు, ఉగ్రవాదులు సైతం దేశంలోకి చొరబడతారని కేంద్ర నిఘా వర్గాలు పలుమార్లు హెచ్చరికలు చేసిన విషయం విదితమే.

**కేంద్రం హెచ్చరికలు:**

హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో తలచాదుకున్న రోహింగ్యాలు అదును చూసి పంజా విసురుతారని కేంద్ర నిఘా వర్గాలు పదేపదే హెచ్చరికలు జారీ చేయడంతో రాష్ట్ర పోలీ సులు వీరి కదలికలపై నిఘా సారిస్తున్నారు. ముఖ్యంగా మయన్మార్, బంగ్లదేశ్ నుంచి వలస వస్తున్న రోహింగ్యా లతో దేశ భద్రతకు ముప్పు ఉందని కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో నివాముంటున్న రోహింగ్యాల లెక్క మరోసారి తేల్చేందుకు నగర నగర పోలీసుల సిద్ధమయ్యారు. ఈక్రమంలో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు నగరంలో నివసిస్తున్న రోహింగ్యాలు ఎంతమందో లెక్కించాలని మూడు కమిష నరేట్ల పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఈ ప్రక్రియ ప్రారంభించి అనతికాలంలో నివేదిక ఇవ్వాలని కోరినట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా అయితే నగరంలో నివసిస్తున్న రోహింగ్యాల్లో కొందరు అనుమతి పొందిన శరణార్థులూ ఉన్నారని, వీరికి ఐక్య రాజ్య సమితి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివసిస్తున్న వారితోనే ముప్పు ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

**గుర్తింపు కార్డులు:**

హైదరాబాద్ నగరంలో ఉంటున్న రోహిం గ్యాల్లో గుర్తింపు కార్డులు ఉన్న వారు ఎంతమంది ఉన్నారు? ఎలాంటి అనుమతుల లేకుండా ఎంతమంది ఉన్నారన్న విష యాలను నిగ్గు తేల్చేందుకు పోలీసులు సన్నద్ధమౌతున్నారు. రోహింగ్యాల ఆడిటింగ్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలనిపోలీసుశాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటురోహింగ్యాలను లెక్కింపు తక్షణం చేపట్టాలని నిర్ణయిం చడంతో పాటు ఆ బాధ్యతలను ఎస్బీ అధికారులకు అప్పగించినట్లు తెలియవచ్చింది. ఈక్రమంలో ఎస్బీ స్పెషల్ టీమ్స్ ప్రతి ఒక్క రోహింగ్యాకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. రాష్ట్రంలో రోహింగ్యాల లెక్కతేల్చేందుకు స్థానిక పోలీసుల సహకారంతో ఎస్బీ పోలీసులు మూడు కమిషనరేట్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నారు. రోహింగ్యాల పేర్లు, శాశ్వత, తాత్కాలిక చిరునామాలు, ఫొటో లతో పాటు బయోమెట్రిక్ వివరాలు సేకరించనున్నట్లు సమాచారం.

**డేటా సేకరణ :**

అక్రమంగా చొరబడిన రోహింగ్యాల వివరాలన్నింటినీ క్రోడీకరిస్తూ స్పెషల్ బ్రాంచ్లో ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు.ఆధార్, రేషన్ కార్డులుహైదరాబాద్ నగరంలోకి అక్రమంగా చొరబడుతున్న రోహింగ్యాలకు సహకరిస్తున్న ఏజెంట్లపైనా ఎస్బీ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 6040 మంది రోహింగ్యాల వద్ద ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్లు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గతంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల లో రోహింగ్యాల వద్ద ఇండియన్ పాస్ పోర్టులు, రేషన్ కార్డులు, బ్యాంకు అకౌంట్లు లభ్యమైన విషయం విదితమే. ఇది లావుండగా కొందరు రోహింగ్యాలు ఇళ్లకు, వాహనాలకు సంబంధించి బ్యాంకు రుణాలు సైతం తీసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కూడా పొందుతున్నట్లు పోలీసులు నిర్ధారిం చార్నది సమాచారం. ఈమేరకు రోహి రోహింగ్యాల లెక్కలు తేల్చి వారి కదలికలపై నిఘా సారించేందుకు పోలీసులు సమాయత్తమౌతున్నారు.

## మాటల సునామీ..!

మైకు ఊపిరి ఆగిపోయేంత
బూతు పురణాల గందరగోళం
చెవులు రెక్కలు విరిగి పడిపోయేలా
మాటకు మాటతో సమాధానం
ఎద్దేవాలతోనే పొద్దు పుడుతోంది
సర్దుకోడాలకే ఐదేళ్ళు గడిచిపోతోంది

నాలికలు నాగుపాములై లేస్తూ
విషపు మాటలు చిమ్ముకుంటూ
తర్వాత రాతలు రాసుకునే
ఎబ్బెట్టు కాలం వచ్చేసింది
సమన్వయానికి ఆయువు తీరిపోయి
సమస్యలకు దీర్ఘాయువు పట్టింది

నోటికొచ్చిన కూతతో తెల్లారిపోతుంటే
రోజులు మాత్రం పరుగుదీస్తున్నాయి
ప్రారంభోత్సవాలకే కాలం సరిపోలేదని
సామాన్య జనం నవ్వుల్ని రాజేసుకుంది
బూతులు బాబోయ్ బూతులంటూ
దూదెట్టుకున్న చెవులతో
మూతికి మైకు అనించే స్థితి వచ్చేసింది

గాలి కొట్లాటల తోపులాట్లకే సమయం
కళ్లెం ఊడిన గుర్రమై పరుగులు పెడుతుంటే
ప్రజల బాధల్ని మోయలేని ఖాళీ బండిలా
నేటి ఏలిక వెనక్కి చూడని ఉరుకుడైంది
కసురుకోడాలు విసురుకోడాలతోనే
సంవత్సరాల కాలం ఆవిరైపోతోంది

వల్లించే ఆవేశాల బూతు పొంగులతో
మాట విలువకు ఎప్పుడో గండి పడింది
వ్యక్తిత్వ దూషణలతోనే కాలం కరుగుతుంటే
సమసమాజ స్థాపన సేద తీరడం మొదలైంది
హద్దు చెరిపేసి మాటల అగ్గి రాజేస్తూ
రోజుల్ని తోచుకుంటూ వెళ్ళిపోతే
అజెండా కన్నీరు కారుస్తూ కూర్చుంటుంది
జెండా సిగ్గుతో ముడుచుకుపోతుంది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు **manamlekhalu@gmail.com** మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

– ఎడిటర్

# పట్టణ పీఠాల కోసం త్రిముఖ సమరం



ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టణ,నగర పాలక(స్థానిక సంస్థల)ఎన్నికలు ప్రజల జీవన ప్రమాణాలను నేరుగా ప్రభావితం చేసేఅత్యంత కీలక ఘట్టాలు. ఈ పాలకవర్గాలు ప్రజల దైనందిన అవసరాలు-తాగునీరు, పారిశుధ్యం, రహ దారులు,విద్యుత్,కాలుష్య రహిత పట్టణ,నగరాల అభివృద్ధి- తదితరాలన్నీ స్థానిక పాలనతోనే ముడిపడి ఉంటాయి.

ఇలాంటి నేపథ్యంలో మన రాష్ట్రంలో ఫిబ్రవరి 11న జరగనున్న పుర(నగర)పాలక ఎన్నికలు రాజకీయంగానే కాదు, సామాజికంగా కూడా విశేష ప్రాధాన్యం సంతరించు కున్నాయి.ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక సంస్థలకు,116 పుర పాలక సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల తేదీ సమీ పిస్తున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. విమర్శలు-ప్రతివిమర్శలతో పట్టణ రాజకీయ వాతా వరణం వేడెక్కుతోంది. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగుతున్నం దున,అన్ని రాజకీయ పార్టీలు ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆధిపత్యం కోసం పోటీపడు తున్నాయి. అగ్రనేతలను రంగంలోకి దించి,బహిరంగ సభలు, రోడ్షోలు, సమావేశాలతో పట్టణాలన్నీ రాజకీయ-ఎన్నికల రంగస్థలాలుగా మారాయి.

**ప్రతిష్టాత్మక పోరులో అధికార-ప్రతిపక్షాల వ్యూహాలు**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అన్ని నగరపాలక సంస్థలు, అధిక శాతం పురపాలక సంఘాలను దక్కించు కోవడ మే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ప్రజల ముందుకెళ్తుంది. లోక్ సభ నియోజకవర్గాల వారీగా మంత్రులకు ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించి, పార్టీని సంఘటితంగా ముందుకు నడిపిస్తున్నారు.

గత రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అలాగే వచ్చే మూడేళ్లలో అమలు చేయ బోయే ప్రణాళికలను ప్రజలకు వివరించడం కాంగ్రెస్ ప్రచా రంలో ప్రధాన అస్త్రంగా మారింది.అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన నిధులు అందక పోవడాన్ని ప్రస్తావిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ ప్రచారం కొనసాగిస్తోంది. అభివృద్ధి కావాలంటే స్థానిక సంస్థలలోనూ కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలి అన్న నినాదంతో ముందుకు వెళ్తోంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, తెలంగాణలో జరుగుతున్న ఈ అర్బన్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏడు నగరపాలక సంస్థలలో మూడు చోట్ల బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహించడం ఈ పార్టీకి అదనపు బలంగా మారింది. నిజామాబాద్‌లో ఎంపీతో పాటు ఎమ్మెల్యే ఉండగా, కరీంనగర్ నుంచి కేంద్రమంత్రి, మహబూబ్‌నగర్‌లో జాతీయ అధ్యక్షుడితో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకత్వం ప్రచా రంలో పాల్గొంటూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనే ప్రధాన అస్త్రంగా చేసుకున్నారు. నెరవేరని హామీలు, మోసపూరిత వాగ్దానాలంటూ కాంగ్రెస్పై విమర్శలు ఎక్కుపెట్టడంతో పాటు, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను చీల్చే ప్రయత్నాలు కూడా సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గత పదేళ్ల పాలనలో తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రధాన ఆయుధంగా ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలు నిరాశ చెందుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. నగరపాలక,పురపాలక సంఘాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయ కులు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ ప్రధాన నేతలు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తూ,ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల మధ్య ఉన్న విభేదాలు, అలాగే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన పనులు ప్రజలకు ఇంకా గుర్తున్నా యన్న నమ్మకంతో ఈ ప్రభావం ఫలితాలపై పడుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

ఇదిలా వుండగా గణాంకాలు,ధనం-యువత-మహిళల ప్రభావం రాష్ట్రంలో ఏడు నగరపాలక సంస్థలు, 116 పుర పాలక సంఘాల ఎన్నికల్లో మొత్తం-12,944 (ఏకగ్రీవలతోకలిపి) మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎన్నికల్లో పార్టీల వారీగా పోటీ చేస్తున్న స్థానాలు గమనిస్తే రాజకీయ ఉత్సాహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కాంగ్రెస్:2,948 స్థానాలు (98.3%), బీఆర్ఎస్:2,878 స్థానాల(96%), బీజేపీ: 2,634 స్థానాలు (87.3%), స్వతంత్రులు: 2,786 స్థానాలు (94%), జనసేన:332(11.1%),మజ్లిస్:282(9.4%),ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్:288(11.1%),బీఎస్పీ:213(7.1%), సీపీఐ: 168 (5.6%),సీపీఎం:108(4.2%),: ఐయూ ఎంఎల్:9 (0.3%). 7 ఏడు కార్పొరేషన్ల పరిధిలో 414 డివిజన్ ఉండగా2,225 మంది పోటీలో ఉన్నారు. పురపాలికల వారీగా చూస్తే 116లో-10,719 మంది పోటీ చేస్తున్నారు.

ఈ గణాంకాలు పట్టణ,నగర రాజకీయాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల ప్రభావం కూడా గణనీయంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి.శ్రీమంతుల ఆధిపత్యం-ఖర్చుతో కూడిన రాజకీ యాలు పుర(నగర)పాలక పోరులో మరో ముఖ్యమైన అంశం-ధనం ప్రభావం. గతంలో ప్రజాసేవ చేయాలన్న భావనతో సామాన్యులు, సామాజిక కార్యకర్తలు రాజకీయాల్లోకి వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఎన్నికలు ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారడంతో, సమాజంపై అవగాహన, సేవాభావన ఉన్న చాలా మంది పోటీకి వెనుకడుగు వేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రధాన పార్టీలు ఆర్థికంగా బలమైన శ్రీమంతులకు, వ్యాపారవేత్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నా యన్నది నిర్వివాదాంశం. వ్యాపారాలు, మైనింగ్, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఉన్నవారు పెద్ద సంఖ్యలో రాజకీయా ల్లోకి వస్తున్నారు. కొన్నిచోట్ల పార్టీ టికెట్లు దక్కకపోయినా, స్వతంత్రులుగా బరిలోకి దిగినరు.

వార్డు కౌన్సిలర్ పదవికన్నా, భవిష్యత్తులో చైర్మన్,అధ్యక్ష స్థానా లపై కన్నేసిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.ఈ పోటీతో ఎన్నికల ఖర్చు క్రమంగా పెరుగుతూ,సామాన్యులకు అందని స్థాయికి చేరుతోంది.

యువత,మహిళల పాల్గొనడం- ఆశాజనక సంకేతం ఈసారి పుర(నగర)పాలక ఎన్నికల్లో యువ రక్తం పెద్ద ఎత్తున ముందుకొచ్చింది. మొత్తం12,944 మంది అభ్యర్థుల్లో 56.1 శాతం మంది 40 ఏళ్ల లోపు యువత ఉండటం విశేషం.వీరిలో దాదాపు70 శాతం మంది గ్రాడ్యుయేట్లు,అండర్ గ్రాడ్యుయేట్లు కావడం పట్టణ పాలనపై చదువుకున్న యువత ఆసక్తి పెరుగుతున్నదానికి నిదర్శనం.అలాగే మహిళల భాగస్వామ్యం కూడాగణనీయంగా ఉంది. మొత్తం పోటీదారుల్లో 6,508 మంది..(50.27%) మహిళా అభ్యర్థులు, 6,436 మంది (49.73%) పురుష అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు చూస్తే - 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 2,903 మంది గ్రాడ్యుయేట్లు, 7,917 అండర్ గ్రాడ్యుయేట్లు, 1,291 మంది నిరక్షరాశులు, 58 మంది విద్యార్హతలు వెల్లడించని వారు ఉన్నారు.

పట్టణ భవిష్యత్తు ఓటర్ల బాధ్యతే ఈ ఎన్నికల్లో యువకులు, మహిళలు, శ్రీమంతులు,పోటీ చేసిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు.కానీ అసలు కీలక పాత్ర మాత్రం ఓటర్లదే.ప్రచార ఆర్భాటాలు, హామీల వర్షం, వ్యక్తిగత ప్రలో భాలకు లోనుకాకుండా,తమ నగరాల-పట్టణాల అభివృద్ధికి నిజంగా పని చేసే వారిని ఎంపిక చేయాల్సిన బాధ్యత ఓటర్ల పై ఉంది.నేటి ఓటు రేపటి ఐదేళ్ల పట్టణాల (నగరాల) అభివృద్ధికి తోడ్పడుతూ ప్రజలకు-సేవకులుగా,పాలకుల ఒప్పందం లాంటిదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.మంచి నాయకత్వాన్ని ఎంచుకున్నప్పుడే పట్టణాలు,నగరాలు అభివృద్ధి చెందుతాయి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.అందుకే విచక్షణతో, స్వేచ్ఛగా మీ ఓటును వినియోగించండి.ప్రజా గెలుపే ప్రజాస్వామ్యానికి నిజమైన గెలుపు.

- మేకిరి దామోదర్
9573666650



# జంపు జిలానీలు



'గురువింద తన కింద మసివట్టిన' సంగతి మర్సినట్టు, గా దానం నాగేందర్ ముచ్చ ట్లింటే, పాపం గాయినకేం ముచ్చట జెప్పాల్నో సమఝైతున్నట్టు లేదు. పనుగడదీత్తె పసులు మందల్లెక్క ఉరికి ఉరికి యేరే దొడ్లె దుంకినట్లైంది కత. గా దుంకిన్దాంట్ల గీ దహనం ఒక లు. గీనే మొదటోడు గాడు సివ రాక రోడు సుత గాడు. మరి గిదేడ సురువైందంటే పాల్టీలు ఒగల కొగలు తూర్పార బట్టుడే. ఇగ గిది గుడ్డు ముందా!కోడి ముందా!! అన్నట్టు గుంట ది. మునుపొకాయన మావోల్లను పది మందిని గుంజుకున్నడు, ఉపుడు మాకు మోకా దొరికింది,సెల్ గంపగుత్తగా మేంపాల్టి పాల్టీలనే బొంద వెడ్తం అనుకోని ఇరవై మందిని గుంజె.



మల్ల సచ్చెదాంక నాదే రాజిర్కం అన్నట్టుజేసే. యెప్పుడూ ఒక్కలెక్కనే ఉంటదా?

ఓడలు బండ్లెతయి,బండ్లు ఓడలైతయిగదా! బస్ గంతే. ఓట్ల అంగట్ల రాజిర్కంబోయినంక నువ్వుజేసిందే నీకెదురైతే లబోదిబోమనుడు దప్ప యింకేమన్నుంటదా?దుర్బిని వెట్టి ఎన్కులాడినా నీతీ,నియ్యతి మచ్చుకైనా అవుపించని దినాల్లదా! సిగ్గు,శరం అన్నీ యిడ్సిపెట్టిన మగానుబావులు గదా! ఇచ్చంత్రమేందంటే రాజిర్కం యెల్లబెట్టిన పుడు పున్నమి సెంద్రుల్లెక్క ఎలిగినోల్లు,పత్తరాలు కూకుండి తిన్నా ఒడువనంత సంపాదించినోల్లు, పెద్ద పెద్ద కుర్సీల్ల కూకొని సుకపడ్డోల్లు, మంతురులైనోల్లు, పానంబోయినా పాల్టీ ఇడ్సిపెట్టనని పెగ్గలు గొట్టినోల్లు, బెల్లం సుట్టు ఈగలు ముసిరినట్టు జనాలు ఓడగొట్టంగనే జంపుజిలానీల్లెక్క గోడ దూకిండ్లు. ఇండ్ల గా అసెంబ్లీల పెద్దమనిసిగ (స్పీకర్) జేసినాయిన సుత దూకుడు సాన యిసిత్రం.

గీఆయారాం గయారాంల కత ఇయ్యాల్టది గాదు.2004 లోనే తెలుగు దేసంల గెలిసి, గమండితోని ఇస్తిఫా ఇచ్చి, మల్ల కాంగిరేసు నిషానతో పోటిజేస్తే జనాలు మస్త్ బుద్ధి జెప్పి ఓడగొట్టి ఇంట్లకుకూకోవెట్టిండ్లు దానం నాగేందర్‌ని. ఇగ తెలంగాణ కోసం లడాయి మొదలైనంక ఉద్దెమ ఈరుల మీన కట్టెసాముజేసుకుంట మనోల్లను పొట్టుపొట్టు గొట్టినోల్లు ఎమ్మెల్యేలై,మంతురులై తెలంగాణ రోషంతోని పరాసికాలాడిండ్లు.పచ్చని సెట్టుమీన పచ్చులాలినట్టు ఇయ్యాల్ల మల్ల కాంగిరేసులజొచ్చిండ్రు. గిదెట్లున్నదంటే లగ్గం ఒకలతోని,సంసారం ఇంకొకలతోని జేసినట్లని పిత్త లేదా? గంతేగాక అండ్లగా నాగేందరైతే బి.ఆర్.ఎస్. ఎమ్మెల్లె అనె సోయి లేకుండా 2024లో 'సెయ్యి' నిషాన మీన ఎం.పి గా సుత పోటీ జేసిండు.ఐనా గీనా పాల్టీ మారలేదని.బి.ఆర్.ఎస్.లనే ఉన్ననని, బి.ఆర్.ఎస్సోల్లే నన్ను అల్ల పాల్టీ అనుకుంటే లేరేమో! అనే లండు ముచ్చట్లన్ని జెప్పవట్టె 'సెప్పటోనికి సోయి లేకున్నా ఇనోటోనికైనా ఉండా లే గదా!' ఐనా ఓట్ల అంగట్ల పదెక్కువైనా ఇచ్చి కొంటామనే దైర్నం ఇచ్చింది ఓట్లేసేటోల్లేగదా!

యెవ్వడైనా పాల్టీ మారినట్లైతే సెప్పులు మెడకేసి,రాల్లతో కొట్టి సంపుర్రని పచారం జేసిన ముక్య మంతిరి యేరే పాల్టీల గెల్సినోల్ల ఇండ్లల్లకువోయి గంట(కండువ)కట్టస్తె యెవల్ని రాల్లతో కొట్టాలే. నిత్తెం పజాసామ్యం, జన సర్కారు అని మొత్తుకునే పెద్దమనుషులు ఉపుడేంజెపుతరు. సేతుల అంబేడ్కర్ రాజ్జెంగంను సూపెడుతూ,దగాజేత్తర్రని జెప్పే రావుల్ గాంది కీ గిపుడు రాజ్జెంగం యాదికత లేదా!గిసొంటి జంపు జిలానీల తోటి సర్కార్లు ఊకూకే కూసైతున్నయనే గదా ఆల్ల నాయిన 1985లో పాల్టీ గోడ దుంకితే అల్ల పదవి పోతదనే సట్టం తెచ్చింది.కంసేకం మీ నాయిన మీన ఈసమెత్తు గౌరవం ఉన్న గిసొంటియి సైసద్దుగదా!

ఇగ'తాడిసెట్టు ఎందుకెక్కినవురా?అంటె దుడ్డె గడ్డి కోసం యెక్కిన అన్నడంట' యెన్కటికొకలు. పతోడు నా ఇలాకాలో సౌలతుల కోసం,మా జనాలు మంచి కోసం,మా జనాలకి యెండి గిన్నెల బువ్వవెట్టనీకీ అనే బవురూపుల ముచ్చట్లు చెప్తరు.అసలు కత యేరే,అది అందరికెరుకున్నదే. పనులు గుత్తవట్టనీకీ, పైసలు పోగెయ్య నీకీ,ఉన్నది జారకుండ జూసుకోనీకేనని తెల్సున్నదేగదా!

కలుపుకునేటోల్ల ముచ్చటసుత బలే గమ్మత్తుగా ఉంటాయ్.మా సర్కారు ఐదేం డ్లు ఉండాలే గందుకనే,యెదుటోల్లు తక్వైతే మేం కొంచెం గట్టిగుంటం అంటారు. గందుకనే మా మందలకు తెచ్చుకున్న మంటరు. మరి మైకుల ముంగిట ఊకె పజాసామ్యం, మన్ను మసానమని సోది చెప్తారు గదా దాని సంగతేందంటే సప్పుడు జెయ్యరు.ఇంక జనాలు యెవ్వలను యెక్కడ కూకోవెట్టిన్రో అక్కడ కూసోవాలే గాని మందల్లెక్క కొంటే జనాల 'ఫైస్లా'ను నారాజు జేసినట్టుగాదా?

ఇగ ఇంకొన్ని పాల్టీలైతే మొదలే మాట్లాడుకొని, అల్లు ఓడిపోయిన తక్లీబ్ గాకుండా ముందుగానే సంచులు ముట్టజెప్పి గుండుగుత్తగా ఇస్తిఫా ఇప్పిచ్చి, మల్ల ఆల్ల పాల్టీ మీన పోటీజేపిత్తరు. గందుకనీ ఈల్లు రాజ్జెంగ రచ్చకులమని ఫోజులు గొడ్తరు. నీతి,నియ్యతి లేని గిసొంటి మనుసుల రాజిర్కంల రాజ్జెం యెట్లుంటది? ఇస్పీకర్లు సుత తాపతాపకు వాయిదాలేసుకుంట ఐదేండ్లు లాగిత్తరు. బస్.ఆల్ల కాలం ఒడ్సిపోతది.ఇగ బయమెట్లుంటది.యెవ్వలైతే జంపైతరో,యెంటనే అవు తలికి దొబ్బేత్తే జరంత బుగులువడి గోడ దూకుడు ఆగుతయి.గిట్ల కాకపోతే జంపైన ఆల్లమీన గా పెద్ద అదాలత్ ఆల్లకాల్లె (సుమోటొగా) కేసులు వెట్టి పదవి ఊడగొట్టాలే, లేకుంటే యెన్కకు(రికాల్) గుంజె తరీక జనాలకియ్యాలే.గట్లయితే జంపు జిలానీలు కట్టడైతరు.లేపోతే అంతే సంగతులు. అవునంటరా! కాదంటరా........!!

- మీస రాజమల్లయ్య
8491319904

# కార్యకర్తలు కరివేపాకులా!



రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆపార్టీ కార్య కర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయ నేది నిర్వివాదఅంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తల పట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈవిషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్థమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వై.యస్.ఆర్. కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణాలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణా(భారత)రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 17 నెలల నుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ పలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుధీర్ఘకాలం నుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబందిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సి.ఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగా మారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసులలో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాధుడేలేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంత మంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబందిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్ల పాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు. కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్దంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరాని వారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసినవారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు అనుగుణంగా డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎం.ఎల్.ఏ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు. మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్థి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కొరకు కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్థి విజయానికి కష్ట పడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరం లేని శాసన సభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసన మండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి.

క్షేత్ర స్థాయిలో పార్టీ కొరకు కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీ లకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వ వచ్చు. కానీ ఇప్పటి వరకు ఏపార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎం.ఎల్.ఏ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్య సభలో స్థానం కల్పించాయా? కార్యకర్తల చేత జీవితాంతం జెండా మోపిస్తారు. వారికి అత్యున్నత పదవులిచ్చి వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు మాత్రం ఈ పార్టీలకు మనసొప్పడం లేదు. కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఏపార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగ చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామ స్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎం.ఎల్.ఏ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న,చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది. ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత మరియు సలహాదారుల పై ఎక్కువగా ఆధార పడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్ర స్థాయిలో పార్టీకి చిత్తశుద్దితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటు పాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒక వేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తి చూపితే ఆ కార్యకర్త బ్రతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తి చూపిన కార్యకర్త దశాబ్దాలు పాటూ పార్టీ కొరకు కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్ బిన్ లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదేవిధంగా క్షేత్ర స్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్థులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్థి పార్టీల నేతలను తిట్టే వారికి, భజన పరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియచేసేది మరియు అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ అవసరాల కొరకు చేసే విమర్శలకు క్షేత్ర స్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందువలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుధీర్ఘ కాలం పాటూ వరుసగా అధికారం లో ఉండలేకున్నాయి అనేది నిర్వివాద అంశం.

- కైలసాని శివప్రసాద్
9440203999

# రష్యా, ఉక్రెయిన్ మంకు పట్టు వీడాల్సిందే

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఫిబ్రవరి 22, 2022 లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22 కు నాలుగేళ్లు పూర్తి అవుతాయి. ఈ మధ్య కాలం లో రెండు దేశాలు తీవ్రంగానే నష్టపోయాయి. రష్యా కంటే ఉక్రెయిన్ భారీగా నష్టపోయింది. ఉక్రెయిన్ లోని కొన్ని ప్రధానమైన నగరాలు రష్యా ధాటికి భారీగా నష్టపోయాయి. ఉక్రెయిన్ కు యుద్ధం మీదనే ఆసక్తి ఉంది. అభివృద్ధి, పౌరుల సంక్షేమ, అభ్యున్నతి ఏ మాత్రం లేదన్నది తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా అవి ఒక కొలిక్కి రాలేదు.యుద్ధం ఆగాలని తాజాగా అబుదాభి లో ట్రంప్ నేతృత్వంలో సాగే చర్చలు రెండిటికి ఒక శాంతి సందేశం ఉండే అవకాశం ఉంది.ఈ యుద్ధం ఆగాలని ట్రంప్ రెండు దేశాల పట్ల చర్చలు నడిపిన సందర్భాలు ఉన్నాయి. రెండు దేశాల మధ్య ప్రధాన అవరోధం 'డాన్ బాస్' వీడాలని రష్యా అంటోంది. అయితే అందుకు ఉక్రెయిన్ ససేమిరా అనట్లుగా ఉంది. 'డాన్ బాస్' ఒక పారిశ్రామిక నగరం అది ఎంతో అభివృద్ధి కూడా చెందింది. ఇది మా పరం చేయాలి అప్పుడే యుద్ధం ఆపుతామని రష్యా చెబుతోంది. అయితే ఉక్రెయిన్ అందుకు సుముఖంగా లేదు. మరి ట్రంప్ రాయభారం ఎలా ఫలిస్తుందో అంతు చిక్కడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి చుస్తే యుద్ధం ఎంత మాత్రం ఏ దేశానికి తగదు. పోయిన ఏడాది డిసెంబర్ 25 న కూడా ఉక్రెయిన్ డ్రోన్‌ల దాడికి గురయింది.. కనుక ఉక్రెయిన్ ప్రజల కోసమైనా మంకు పట్టు వీడాలి. ట్రంప్ కూడా డాన్ బాస్ ను వదులు కొమ్మని చెప్పవచ్చు. దానికి ఉక్రెయిన్ సమ్మతించాలి. ఉక్రెయిన్‌లో భస్మి పటలమైనా నగరాలకు రష్యా సహా యం చేయాలి. అందులోను ఐక్యరాజ్య సమితి లోని భద్రతా మండలిలో అమెరికా, రష్యా శాశ్వత సభ్య దేశాలు. ముఖ్య సమాచారం పై రెండు దేశాలుపదే, పదే కలుస్తు వుంటాయి కూడా. ట్రంప్ ఇద్దరికీ ఆమోదయోగ్యమైన శాంతి చర్చలు జరుపు తాడని భావించవచ్చు. కనీసం అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యంగా పౌరుల కోసం ఇవి రెండు కలసి పోయి శాంతిని పూయిస్తే విశ్వం సంతోషిస్తుంది. ఈ ఏడాది జూన్ లోగా యుద్ధం పరిసమాప్తి కావాలని ట్రంప్ ఆలో చన గా ఉంది. అదే నిజమైతే ఈ రెండు దేశాలను ఐక్యం చేయడంలో నిజంగా డోనాల్ ట్రంప్ కృషి ఫలిస్తే ఆయన పేరు మారు మో గుతుంది. నిజమైన శాంతి నేతగా నిలుస్తాడు.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

# నియోజకవర్గంలో నీళ్లు పారించినట్లు నిధులను పారిస్తా



- 50 కోట్ల రూపాయలతో సుల్తానాబాద్ మున్సిపల్ కు నూతన శోభ
- 4 కోట్ల రూపాయలతో నూతన బస్టాండు నిర్మాణ
- నాలుగు కోట్లతో నూతన ఐబి నిర్మాణానికి కృషి
- అంబేద్కర్ కాంసా విగ్రహం సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తా
- 65 లక్షల రూపాయలతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తాం
- సెంటర్ లైటింగ్ తో మున్సిపల్ ను అద్భుత పట్టణంగా తీర్చి దిద్దుతా
- గత పాలకులు తరలించిన కార్యాలయాలను తిరిగి తెచ్చా
- 15 కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**సుల్తానాబాద్, ఫిబ్రవరి 09 (మనం న్యూస్):** మున్సిపల్ ను మరో 50 కోట్లాది రూపాయలతో అద్భుత నగరంగా తీర్చిదిదెందుకు కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. సోమవారం చివరి రోజు మున్సిపల్ పరిధిలోని 15 వార్డు ల అభ్యర్థులతో కలిసి మున్సిపాలిటీలో పూసాల ఆరెపల్లి నుండి భారీ బైక్ ర్యాలీ ని అన్ని వార్డుల మీదుగా నిర్వహించారు. అనంతరం స్థానిక తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై ఓటు వేసి15 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఉన్న సాన్నిత్యంతో పెద్దపల్లి నియోజకవర్గంలో నీళ్లు పారినట్లు నిధులను పారించానని 1000 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నారని అన్నారు. 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఈ ప్రాంతం నుంచి అన్ని కార్యాలను తరలించకపోయినా అసమర్ధ పాలనను సాగించిన పార్టీ అని అన్నారు. గత పాలకులు ప్రజలకు చేసింది శూన్యమని పెద్దపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో భ్రష్టు పట్టించారని సుల్తానాబాద్ మండలం పై సమితి తల్లి ప్రేమను చూపారని పేర్కొన్నారు. తాను అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలోనే ప్రజల కోరిక మేరకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నానని సుల్తానాబాద్ లో నాలుగు కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. సుల్తానాబాద్ చెరువు తోపాటు కుంటాలను బతుకమ్మ ఘాటుగా తీర్చిదిద్దామని హామీ ఇచ్చారు. చెరువును అద్భుతంగా మలచి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసి ప్రజలు సాయంత్రం వేళల్లో ఉల్లాసంగా గడిపే విధంగా అద్భుతంగా నగరంగా మారుస్తామని అన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా ముందుకు సాగుతామని సుల్తానాబాద్ పట్టణం నిరంతర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఇప్పటికే సుల్తానాబాద్ పట్టణాన్ని రెండు సంవత్సరాల కాలంలో 20 కోట్లతో అభివృద్ధి చేశామని 15 కోట్లు టెండర్లు పిలిచి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పెద్ద చెరువును ఎనిమిది కోట్ల 50 లక్షలతో మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు చేస్తామని ఐబి పాత భవనాన్ని కూల్చివేసి 4 కోట్లతో నూతన భవనాన్ని నిర్మాణం చేస్తామని ప్రకటించారు. తెలంగాణ చౌరస్తా నుండి గట్టేపల్లి క్రాసింగ్ వరకు 7 కోట్ల 50 లక్షలు తో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులకు 65 లక్షల రూపాయలతో నూతన షెటర్ల నిర్మాణం చేపట్టి అందించామన్నారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నూతన అంబేద్కర్ కాంసా విగ్రహం. తన సొంత ఖర్చులు 8 లక్షలు అయినా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతన ఐలాండ్ నిర్మాణం చేపడతానని అలాగే మజీద్ చౌరస్తా నుండి గట్టేపల్లి చౌరస్తా వరకు డబుల్ రోడ్డు నిర్మాణం సెంటర్ లైటింగ్ నిర్మాణం చేపడతానని తెలిపారు. ముఖ్యమంత్రి తో తనకున్న సాహిత్యం ద్వారా డైనింగ్ టేబుల్ పై కూర్చుని సంతకం చేపించి మరీ నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 15 వార్డ్ కౌన్సిలర్ల ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభివృద్ధికి బాటలు వేయాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పాత భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణం చేపట్టి మైదానాన్ని అద్భుతంగా మలచి వర్షపు నీరును బయటికి వెళ్లేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఉగాది అనంతరం శ్రీరాంపూర్ చౌరస్తా పూర్తిగా వెలుగులతో అద్భుతంగా మలుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్రకాశరావు, ఆయిల రమేష్, శ్రీగిరి శ్రీనివాస్, 15 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థుల తోపాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# సినిమా, నిర్మాణ రంగాలలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు



- ఆసక్తిగల అభ్యర్థులు ఫిబ్రవరి 20 లోపు దరఖాస్తు సమర్పించాలి
- 3 నెలల పాటు ఉచిత నైపుణ్య శిక్షణ
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** సినిమా , నిర్మాణ రంగాలలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు అందిస్తున్నామని ఆసక్తి గల వారు జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో 3 నెలల పాటు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్, డిజిటల్ డిజైన్ సోషల్ మీడియా మేనేజ్మెంట్ , కన్స్ట్రక్షన్ సేఫ్టీ, మెకానికల్, కన్స్ట్రక్షన్ ఎలక్ట్రిషన్ ఎన్విరాన్మెంటల్, సర్వేయర్, సూపర్వైజర్, మెకానికల్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్, ఫినిషింగ్ స్కూల్ ప్రోగ్రాం వివిధ కోర్సులలో నైపుణ్య శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. సినిమా కోర్సు కు 10వ తరగతి, నిర్మాణరంగ కోర్సులకు డిప్లమా, ఐటిఐ, బీటెక్ ఉత్తీర్ణత ఉండాలని, హైదరాబాద్ కొండాపూర్ లోని న్యాక్ అకాడమీలో శిక్షణ ఉంటుందని అన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, కోర్సు పట్ల ఆసక్తి గలవారు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మొదటి అంతస్తులో రూమ్ నెంబర్ 225 లో గల జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో సంబంధిత ధృవ పత్రాలతో తమ పేర్లు ఫిబ్రవరి 20 లోపు నమోదు చేసుకోవాలని , ఇతర వివరాలకు 9963313318, 9000294176 నెంబర్ల నందు సంప్రదించాలని ఆ కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆన్లైన్ లో ఓటర్ స్లిప్ డౌన్ లోడ్ సౌకర్యం



**గోదావరిఖని, ఫిబ్రవరి 09 (మనం న్యూస్):** ఫిబ్రవరి 11న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఆన్ లైన్ లో కూడా ఓటర్ స్లిప్పులను డౌన్ లోడ్ చేసుకునే సౌకర్యం ఉందని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె అరుణ శ్రీ తెలిపారు. పోలింగ్ కేంద్రం చిరునామా, ఓటర్ క్రమ సంఖ్య తెలుసుకోవడానికి ఉపకరించే ఈ ఓటర్ స్లిప్పులను రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఆద్వర్యంలో ఇప్పటికే ఇంటింటికి పంపిణీ చేశామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్సైట్ ద్వారా ౌరీుజూ్ాచీ గ్ెటి ఖిజూజీఇ'ఛ ఉ్కఐఇ ఐ్ఖటఛ్ట 2025 విండోలో వివరాలు నమోదు చేసి స్లిప్ పొందవచ్చని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఒరిజినల్ గుర్తింపు కార్డుతో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కమీషనర్ కోరారు.

# కాంగ్రెస్‌లోకి శ్రీమాత డెవలపర్స్ చైర్మన్ కాసర్ల రాజు



- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ వంశీ

**పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** పట్టణానికి చెందిన శ్రీ మాత డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కాసర్ల రాజు సోమవారం న్యూ డిల్లీలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ మాత డెవలపర్స్ చైర్మన్ కాసర్ల రాజు కాంగ్రెస్ పార్టీ లో చేరుతున్నట్లు ప్రకటించగా ఆయన కోరిక మేరకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆహ్వానించారు. ఈ సందర్భం గా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కాసర్ల రాజు కృషి చేయాలని కోరారు. అనంతరం కాసర్ల రాజు మాట్లాడుతూ తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి పూర్తి విధేయుడుగా ఉంటూ పలు కార్యక్రమాల్లో చురుకుగా ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో శ్రీమత డెవలపర్స్ డైరెక్టర్లు కోట మల్లేష్, బొడ్డు సుమన్, బొడ్డుపల్లి రవి, బండ రాజయ్య, వేల్పుల రమేష్, ఓ శ్రీధర్. సంపత్, సురేష్, శ్రీనివాస్, మల్లేష్, సతీష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మునిసిపాలిటీలు ఉండాలి

- జగిత్యాల, రాయికల్‌లలో గులాబీ జెండా ఎగరవేస్తాం
- ఊహించని మెజార్టీ సీట్లు సాధిస్తాం
- ఎమ్మెల్సీ ఎల్. రమణ




**జగిత్యాల, ఫిబ్రవరి 09(మనం న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ జగిత్యాల కార్యాలయంలో ( నివాసంలో) మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడుతూ మునిసిపాలిటీలు ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా రాజ్యాంగం ప్రకారం ప్రధానంగా బల్దియలో అవకతవకలకు అవకాశం లేకుండా ఉండాలని అన్నారు.మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుంచామని,అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టామన్నారు.ప్రజాక్షేత్రంలో బీఆర్ ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభించిందని, జగిత్యాల నియోజకవర్గంలోని రాయికల్ మరియు జగిత్యాల పట్టణంలో గులాబీ జెండా ఎగరవేస్తున్నామని,జగిత్యాల మునిసిపాలిటిలోను ఊహించని తీర్పును ప్రజలు ఇవ్వబోతున్నారని అన్నారు ఎమ్మెల్సీ ఎల్.రమణ. ప్రధాన పార్టీలు ఇచ్చిన హామీలు విస్మరించాయని,గులాభి సైనికులకే ప్రజలు పట్టం కట్టబోతున్నారని అన్నారు.నిఖార్సయిన గులాభి సైనికులకు,నిబద్ధత కలిగిన నిజాయితిపరులకే సీట్లు ఇచ్చామని అన్నారు ఎమ్మెల్సీ ఎల్.రమణ. జగిత్యాలలో గులాబి జెండా హవా నడుస్తోందని, ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభ పెట్టినా వారు స్పష్టంగా ఉన్నారు. జగిత్యాల అభివృద్ధి పై వైరల్ అవుతున్న వీడియోలు బీ.ఆర్.ఎస్ హయాంలో చేసినవే రెండేళ్లలో అక్కడక్కడ సీసీ రోడ్లు తప్ప చేసిందేమీ లేదు ప్రశ్నించే గొంతుకలకు ఓటేయబోతున్నారు ప్రజలుఈ ఎన్నికల్లో ఎలక్షన్ మిరాకిల్ జరగబోతోంది. మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల,మాత శిశు కేంద్రం,చింతకుంట చెరువు అభివృద్ధి ఘనత బి.ఆర్ ఎస్ దే 4520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేసీఆర్ ఇచ్చినవే.. అప్పుడే స్వయంగా కేటీఆర్ గారు లబ్ధిదారులకు అందించారు అని ఎల్ రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు దావ సురేష్, ఎల్ కార్తికేయ, పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్ రావు,మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ,శీలం ప్రవీణ్, ఆసీఫ్,అనంతుల గంగారెడ్డి, పడిగేల గంగారెడ్డి,ఎండబెట్ల ప్రసాద్,వొళ్ళాల గంగాధర్,వనమాల నిరంజన్,కుడిక్యాల సర్వేశ్వర్, అజ్జర్ ఖాన్,వసీం,గంగిపెల్లి శేఖర్ పాల్గొన్నారు.

# సీఎం కప్ రాష్ట్రస్థాయి చదరంగ పోటీకి ఎంపికైన క్రీడాకారులు




**పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలలో జరిగినటువంటి సీఎం కప్ జిల్లాస్థాయి చదరంగం పోటీ బాలికల విభాగంలో సుల్తానాబాద్ పట్టణానికి చెందిన దాసోహం ఆరాధ్య ప్రథమస్థానం సాధించగా, ద్వితీయ స్థానం గెలుపొందిన చిప్ప విజ్ఞస, బాలుర విభాగంలో మంగళపల్లి విద్యాధర్ ప్రథమ స్థానం సాధించగా,ద్వితీయ స్థానంలో ముత్యాల వసుదేవ్ హైదరాబాదులో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ చదరంగ పోటీకి ఎంపికైనట్లు డి వై ఎస్ ఓ అక్కపాక సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాకారులు చదరంగం ఆడటం వల్ల విద్యార్థులకు మేధాశక్తి పెరిగి, సెల్ ఫోన్లకు ఆకర్షితులు కాకుండా ఉంటారని, క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ అక్కపాక సురేష్, పెద్దపల్లి జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బొబ్బిలి శ్యామ్, ఓదెల మండల అధ్యక్షుడు ముత్యాల నాగరాజు, పెద్దపల్లి చెస్ అకాడమీ ఆర్గనైజ్ సెక్రెటరీ కే యం సూరజ్ బాన్ సింగ్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉండాలి

- మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష




**జగిత్యాల, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 11 రోజున జరుగనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్లు మరియు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు. ఓటరు స్లిప్ల పంపిణీ, బ్యాలెట్ బాక్స్ నిల్వ కోసం స్ట్రాంగ్ రూమ్ ల ఏర్పాటు, బ్యాలెట్ బాక్స్ ల ధ్రువీకరణ మరియు అందుకు సంమబందించిన కార్యకలాపాలు, మార్క్ చేయబడిన కాపీ రోల్ తయారీ గురించి, ఎన్నికల సామగ్రి పంపిణీ నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి తగిన విధంగా సమయానికి అనుగుణంగా ఆహార ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈరోజు అన్ని పోలింగ్ స్టేషన్లను మున్సిపల్ సిబ్బంది సందర్శించి పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ మరియు ఇతర వసతులను ఎన్నికల సిబ్బందికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పోలింగ్ రోజున వృద్ధులు మరియు దివ్యాంగ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వీల్‌చైర్‌లు అందుబాటులో ఉంచాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఏ ఎన్ ఏం, ఆశ వర్కర్లు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల భద్రత చర్యలు తీసుకొని పూర్తి స్థాయిలో బందోబస్త్ ఏర్పాటు చేసే విధంగా పోలీసు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలింగ్ అధికారులు డైరీను కచ్చితంగా నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియలో జరిగే ప్రతి అంశాన్ని స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు అయ్యేలా సరైన ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి సంబంధించి డిఏ, టిఏ చెల్లింపులు నిబంధనల ప్రకారం, ఎలాంటి ఆలస్యం లేకుండా చేపట్టాలని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటీలో ఒక పోలింగ్ స్టేషన్ ను మోడల్ పోలింగ్ స్టేషన్ గా ఏర్పాటు చేసే విధంగా మెప్మా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 5 మున్సిపాలిటీలో జరగబోయే ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి స్పెషల్ ఆఫీసర్లు మరియు మున్సిపల్ కమిషనర్ ల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

# 11న వేతనంతో కూడిన సెలవు మంజూరు



- జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికల ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి వాణిజ్య, దుకాణం, వ్యాపార సంస్థలలో పని చేసే కార్మికులకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పనిచేసే ఉద్యోగులు సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని దుకాణ, వాణిజ్యసంస్థల యజమానులకు, వ్యాపార సంస్థల యజమానులు ఫిబ్రవరి 11 బుధవారం మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తమ దుకాణ, వ్యాపార, వాణిజ్య సంస్థల్లో పని చేయుచున్న కార్మికులకు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా వేతనం తో కూడిన సెలవు మంజూరు చేయాలని అన్నారు.

ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ జరిగే సమయంలో షిఫ్ట్ లో ఉన్న ఉద్యోగులకు, ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు సిబ్బందికి కూడా తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1988 చట్ట ప్రకారము యజమానులు తప్పనిసరిగా మూసివేసి కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకొబడతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎన్నికల సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ పూర్తి

- జనరల్ అబ్సర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్
- ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులతో సమీక్ష

**జగిత్యాల, ఫిబ్రవరి 09(మనం ప్రతినిధి):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు మూడవ ర్యాండమైజేషన్ విధానంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా అధికారులతో, కలెక్టరేట్ ఏవో, ఈ డి ఎం తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా రాండమైజేషన్లో పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ర్యాండమైజేషన్ లో పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులను కేటాయించినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల కొరకు నియమించిన ఎన్నికల సిబ్బంది ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించే 5 మున్సిపాలిటీలలో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారులు, కలెక్టరేట్ ఏవో, ఈడిఏం పాల్గొన్నారు.



# క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు ముందుకు సాగండి

- క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి
- క్రీడారంగంలో గెలుపు ఓటములు సహజమే
- క్రీడాకారులతో వాలీబాల్ ఆడిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా ఫిబ్రవరి 9 (మనం బ్యూరో):** క్రీడల్లో గెలుపోటములు సహజం, క్రీడాకారులందరూ మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకునప్పుడే క్రీడల్లో మంచి ఫలితాలు రాణించగలుగుతాని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం నాగర్కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాగర్కర్నూల్ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ క్రీడా జెండాను ఆవిష్కరించిన తధానంతరం క్రీడల పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి క్రీడలకు ఉత్తేజపరుస్తూ శ్రీకారం చుట్టారు. స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడటం ద్వారా క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. కలెక్టర్ ఆటలో పాల్గొనడాన్ని చూసి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ,.. జిల్లా స్థాయిలో క్రీడల్లో మంచి ప్రతిభను ప్రదర్శించలన్నారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభతో రాణించి నాగర్కర్నూల్ జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ప్రతి క్రీడాకారుడు అంకితభావంతో కృషి చేసి రాష్ట్ర స్థాయి సీఎం కప్ నాగర్కర్నూల్ జిల్లాకు వచ్చేలా లక్ష్యంగా పెట్టుకుని పోటీల్లో పాల్గొనాలని ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడాకాలకు సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సమానంగా ప్రావీణ్యం సాధించాలని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక బలాన్నికి ఎంతో దోహదపడుతుందన్నారు. క్రీడలు క్రమశిక్షణను అలవాటు చేస్తాయన్నారు. నాగర్కర్నూల్ జిల్లా నుంచి ఇప్పటికే ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపుతూ జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నారని ఈ సందర్భంగా క్రీడాకారులను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. సీఎం కప్లో భాగంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పోటీలను ఘనంగా నిర్వహించామన్నారు. ఆ దశల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో ఇప్పుడు జిల్లా స్థాయి పోటీలను నిర్వహించగలుగుతున్నామని తెలిపారు. తదుపరి దశలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.అనంతరం నాగర్కర్నూల్, అచ్చంపేట జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీలను జిల్లా కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. అనంతరం వాలీబాల్ పోటీలను కూడా ప్రారంభించి, వాలీబాల్ క్రీడాకారులతో కలిసి జిల్లా కలెక్టర్ స్వయంగా మైదానంలోకి దిగి వాలీబాల్ ఆడారు. ఈ జిల్లా స్థాయి సీఎం క్రీడా పోటీల్లో వివిధ మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సామ రమేష్, సుభాషిని, నరేందర్, నిరంజన్ యాదవ్, వెంకటయ్య జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పరుగులు



**చేవెళ్ల, ఫిబ్రవరి 09 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించి సంక్షేమ పథకాల అమలులో కేసీఆర్ చరిత్ర సృష్టించారని రాజేంద్ర నగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పి.కార్తీక్ రెడ్డి తెలిపారు. సోమవారం పుర కేంద్రంలోని 9, 14, 15, 16 ,17,18 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్లో ఆయన మాట్లాడుతూ... ఆంధ్ర పాలకుల వెక్కిలి చేష్టలు, అవమానాలు భరించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు రూ.2,500, తులం బంగారం, నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు, యువతులకు స్కూటీలు, వరి ధాన్యానికి బోనస్, రాయితీపై వంట గ్యాస్, రైతు భరోసా, పంట రుణమాఫీ, రైతుబీమా పెంచుతామని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. చేవెళ్లలో నీతివంతమైన పాలన అందించామని, రహదారి విస్తరణ, అంతర్గత రహదారులు, క్రీడా మైదానం, నిరంతరం విద్యుత్ సరఫరా, శుద్ధజలం అందించామని చెప్పారు. సుపరిపాలన కావాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలి



- చేవెళ్లలో న్యాయవాదుల ధర్నా

**చేవెళ్ల, ఫిబ్రవరి 09 (మనం న్యూస్):** అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలని హైకోర్టు న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్లలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలని చేవెళ్లలోని ప్రధాన చౌరస్తాలో న్యాయవాదులు రోడ్డుపై భైఠాయించి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాక్ట్ అమల్లోకి వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తు కార్యాచరణ మొదలు పెడతామన్నారు. న్యాయవాదుల భద్రత కోసం కఠిన చట్టం అవసరమని, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొడంగల్, పరిగి, వికారాబాద్, షాద్ నగర్, సంగారెడ్డి, రంగారెడ్డి, రాజేంద్రనగర్ ప్రాంతాల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు మరియు పలువురు న్యాయవాదులు హాజరై చేవెళ్ల బార్ సోసియేషన్ సభ్యులకు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్ర మంలో హైకోర్టు న్యాయవాదులు శ్రీ సునీల్ , అనంత సేన్ రెడ్డి , శంషుద్దీన్ , ఆకుల మహేష్ కు మార్ , అనిల్ కిరణ్ కుమార్ , కొండల్ రెడ్డి , విష్ణు వర్ధన్ రెడ్డి , రంగనాథ్ , పులిగారి గోవర్ధన్ రెడ్డి, పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**ములుగు, ఫిబ్రవరి 9(మనంన్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రఘుపతి తెలిపారు. మద్యం తాగి వాహనంనడిపిన ఒక వ్యక్తికి పదివేల రూపాయల జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ న్యాయాధిపతి మన్వీర్, ఎవరు కూడా మద్యం తాగి వాహనాలు నడుపరాదని తెలిపినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై కేసులు చేసి కోర్ట్ లో హాజరు పర్చడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

# అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి
- సీఎంతో మాట్లాడి 208 తీసుకువస్తా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి, ఫిబ్రవరి 9 మనం ప్రతినిధి:** రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 26 మంది అభ్యర్థులను గెలిపించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు సోమవారం నాడు సదాశివపేట లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సదాశివపేట లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన 26 మంది గెలిపించినట్లయితే వార్డుకు 8 కోట్ల రూపాయల చొప్పున 208 కోట్ల రూపాయలతో సదాశివపేట మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని నాది మాటంటే మాట అని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. 150 కోట్లు ఖర్చు చేసి రెండేళ్లలో సదాశివపేట మున్సిపాలిటీకి మంజీరా నీళ్ళు అందిస్తానని అన్నారు పట్టణం మధ్యలో అందరికీ అందుబాటులో ఉండేలా పాత ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కొత్త భవన నిర్మాణం చేపడతామని అన్నారు మహిళల కోరిక మేరకు సదాశివపేట పట్టణంలో పిల్లలు యువత కోసం స్విమ్మింగ్ పూల్ స్టేడియం కట్టిస్తానని పేర్కొన్నారు కష్టాల్లో ఎవరైనా ఉన్న నా ఇంటి తలుపులు తట్టాలని మీకు నేను అండగా ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు మహాత్మా గాంధీ సాక్షిగా హామీ ఇస్తున్నానని చెప్పిన ప్రతి మాట నిలబెట్టుకుంటానని అన్నారు. పదేళ్ల కెసిఆర్ సీఎంగా హరీష్ రావు ఆర్థిక వైద్యశాఖ వనరుల శాఖ మంత్రిగా పనిచేశారని ఆయన అడిగితే అధికారులు ఆగమే మీద పనులు చేసి పెట్టే పరిస్థితి ఉండేదని అన్నారు ఆయన సదాశివపేట మున్సిపాలిటీలో ఏ ఒక్క పని చేయలేదని అన్నారు 2014 కంటే ముందు తాను చేసిన పనులే ఇప్పటికీ గుర్తున్నాయని అన్నారు 2023 ఎన్నికలు తనను ఓడించినందుకు హరీష్ రావు సంగారెడ్డికి 27 కోట్లు పంపించారా అని జగ్గారెడ్డి గుర్తు చేశారు తాను ఎమ్మెల్యేగా గెలిచిన గెలవకపోయినా ప్రజలకు పనులు చేసి పెడతానే ఉంటానని తెలిపారు.

# సేవ చేసే అవకాశం కల్పించడి



**చేవెళ్ల, ఫిబ్రవరి 09( మనం న్యూస్):** మున్సిపాలిటీ ఎన్నికల్లో తనను ఓటర్లు ఆశీర్వదించి గెలిపిస్తే 1వ వార్డును అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని 1వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి కర్నే శివప్రసాద్ అన్నారు. ఎన్నికల్లో భాగంగా చివరి రోజున 1వ వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ మీ అమూల్యమైన ఓటు హస్తం గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డు అభివృద్ధి కోసం డ్రైనేజీ విద్యుత్ మంచినీటి సిసి రోడ్లు తో పాటు వార్డ్ లో ఉన్న మౌలిక వస్తువులు కల్పిస్తానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోసం అబద్ధపు హామీలు ఇస్తున్నాడు



- జగ్గారెడ్డికి ఎన్నికలు రాగానే సదాశివపేట సంగారెడ్డి ప్రజలు గుర్తుకొస్తారు
- దమ్ముంటే మంత్రి ,కలెక్టర్ తో కలిసి అధికారికంగా ఇండ్ల స్థలాలు ప్రకటించాలి
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, ఫిబ్రవరి 9 మనం ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి ఎన్నికలు రాగానే సదాశివపేట సంగారెడ్డి ప్రజలు ఒక్కసారిగా గుర్తుకు వస్తారని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సోమవారం నాడు సంగారెడ్డి పట్టణ కేంద్రంలో.నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఎన్నికలు రాగానే సంగారెడ్డి ప్రజలు ఒక్కసారిగా గుర్తుకు వస్తారని ఎన్నికలు అయిపోయిన తర్వాత ఎవరికి అందుబాటులో ఉండడని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సమావేశాల్లో మాట్లాడే మాటలని అబద్ధపు పూట మాటలని ప్రజలు ఇక ఆ మాటలను నమ్మే స్థితిలో లేరని అన్నారు సదాశివపేటలో ప్లాట్లు ఇప్పిస్తామని గాలి మాటలు చెబుతున్నారని నిజంగా దమ్ముంటే మంత్రి కలెక్టర్ తో కలిసి అధికారికంగా ఇండ్ల స్థలాల పట్టాలు ప్రకటించాలని పేర్కొన్నారు లేదంటే ఇవన్నీ ఎన్నికల గ్రామాలే అని ప్రజలు నమ్ముతారని అన్నారు సర్టిఫికెట్లు ఫేక్ అని అధికారులే చెప్తుంటే మళ్ళీ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటుగా ఉందని అన్న పేదల బడుగు బలహీన వర్గాలకే నిజమైన లాభం చేకూర్తే మేము కూడా ముందుకు వచ్చి సంతోషిస్తామని అన్నారు మూర్ఖంగా మాట్లాడే నేతలను నోటికొచ్చినట్లు మాట్లాడే నాయకత్వానికి ప్రజలు ఎప్పుడు తిరస్కరిస్తారని. జగ్గారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్లాట్లు ఎందుకు అడగలేదు చెప్పాలని ప్రశ్నించారు ఎన్నికల వచ్చినప్పుడే సదాశివపేట సంగారెడ్డి ప్రజలు గుర్తుకు రావడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శమని అన్నారు రెండు మున్సిపాలిటీలో గెలవలేమని ముందే అర్థమై ఇప్పుడు కుటుంబాన్ని ముందుకు పెట్టి తిరుగుతున్నాడని ప్రజలను మభ్యపెట్టి చివరి ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు ముఖ్యమంత్రి జిల్లా మంత్రి ఇన్చార్జి మంత్రి కూడా రెండు మున్సిపాలిటీలపై నోరు విప్ప లేకపోవడం ఇక్కడి పరిస్థితులను తెలుసుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఇన్చార్జి మంత్రి ప్లాట్లు గురించి ప్రకటన చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని సూచించారు నీతి నిజాయితీని లేని నాయకత్వాన్ని పక్కనపెట్టి నిజంగా ప్రజల కోసం నిలబడే నాయకులను గెలిపించాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ టీఎన్జీవో స్ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్ మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి ఇన్చార్జి రాజనర్స సోమిరెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ప్రారంభం




**సంగారెడ్డి, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** సీఎం కప్-2025 జిల్లా స్థాయి క్రీడా పోటీలను సోమవారం సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్లో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడలు, సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ, సీఎం కప్ క్రీడా పోటీలను గ్రామ స్థాయి నుంచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి, మండలస్థాయి , అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీలలో విజయం సాధించిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ జిల్లాస్థాయి పోటీలు నేడు మరియు రేపు మొత్తం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ స్థాయిలలో ప్రతిభ చాటిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు ఈ నెల 20వ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు అఖిలేష్ రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభను చాటి సంగారెడ్డి జిల్లాను మొదటి స్థానంలో నిలిపి సంగారెడ్డి జెండా ఎగురవేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాస్కెట్బాల్, హ్యాండ్బాల్, కరాటే, వుషు కిక్ బాక్సింగ్, ఫుట్బాల్, ప్రెస్లింగ్, జూడో, బాక్సింగ్ నందు క్రీడాకారులకు క్రీడలు నిర్వహించడం జరిగిందనీ ,ఈ క్రీడలలో 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ క్రీడలలో మొదటి , రెండవ స్థానంలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.జి.యఫ్. సెక్రెటరి శ్రీనివాస్ , టి.ఎన్.జి.ఓ మరియు అథ్లెటిక్ సెక్రెటరీ జావిద్ అలీ , హ్యాండ్బాల్ సెక్రెటరి విజయ్ , స్విమ్మింగ్ సెక్రెటరి శశ్వంత్ , బాల్ బ్యాడ్మింటన్ విజయ్ బాస్కర్, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# భారీ ఎత్తున బైక్ ర్యాలీ

**చేవెళ్ల, ఫిబ్రవరి 09 (మనం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గం లోని చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో, భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు భారతీయ జనతా పార్టీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ పట్టణమంతా బైకు ర్యాలీ తో పాటు ఎలక్షన్ చివరి రోజున గల్లి గల్లి ప్రచారం నిర్వహించడం జరిగింది.బైక్ ర్యాలీ శాంతియుతంగా,క్రమ శిక్షణతో,ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేయబడింది.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డాక్టర్ వైభవ్ రెడ్డి. మున్సిపల్ అధ్యక్షులు అనంతరెడ్డి. యువమోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నా మాట - అభివృద్ధికి బాట



**చేవెళ్ల, ఫిబ్రవరి 09 ( మనం న్యూస్):** ప్రజా సంక్షేమం, వార్డు అభివృద్ధే తన లక్ష్యమని బండారి శైలజా ఆగి రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేయడమే తన నిబద్ధత అని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బండారి శైలజా ఆగిరెడ్డి మాట్లాడుతూ.... ప్రజల మాటే నా మార్గదర్శకం. ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతూ అభివృద్ధి వైపు వార్డును నడిపించడమే నా ఆశయం. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెడతాను అని అన్నారు. మహిళలు, యువత, వృద్ధుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక పాలన అందిస్తామని శైలజమ్మ స్పష్టం చేశారు. కావున ఈ నెల 11వ తేదీన జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు.

# ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 9 మనం న్యూస్:** గ్రామంలోని ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా గట్ల నర్సింగాపూర్ సర్పంచ్ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం రోజున పంచాయతీ కార్యదర్శి గుడికందుల మధు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు మాట్లాడుతూ గ్రామాన్ని మండలంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం అవసరం ఉందని అన్నారు.గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామప్రజలతో చర్చించి ప్రభుత్వ నిధులు రాగానే ప్రతి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. గ్రామ పరిశుభ్రత కోసం అందరి సహకారం అవసరం ఉందని పారిశుద్ధ కార్మికులకు సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యులు టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లంపల్లి సుకుమార్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దమయిన హరికృష్ణ యాదవ్ బొల్లంపల్లి రాజు అంబాల శ్రీనివాస్ సీతంపేట శ్రీనివాస్ అంగన్వాడి కార్యకర్తలు ఆశా కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించాలి

- జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్
- అడిషనల్ కలెక్టర్ పాండు



**సంగారెడ్డి, ఫిబ్రవరి 09 మనం ప్రతినిధి:** ఎన్నికలలో అత్యంత కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆయన హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు సోమవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. మైక్రో అబ్జర్వర్లు తమ విధులు, బాధ్యతల పరిధిలోనే పనిచేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరించి ఆయా మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లకు బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. పోలింగ్కు సంబంధించిన ప్రతి అంశంపై మైక్రో అబ్జర్వర్లు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను సమర్థవంతంగా పరిశీలించ గలుగుతారని అన్నారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశితంగా పరిశీలించాలని, గమనించిన అంశాలను వెంటనే జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అన్ని అంశాలను జాగ్రత్తగా గమనిస్తూ, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైక్రో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు , తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి రామాచారి, డీఈఓ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నర్సింగ్, మాస్టర్ ట్రైనర్ కృష్ణ కుమార్, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి, సంక్షేమానికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి



- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలోచన చేసే ప్రభుత్వం మాది
- అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణను తీసుకువచ్చాం
- ప్రజా ప్రభుత్వంలో పట్టణాల్లో ప్రశాంత వాతావరణం
- మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

మధిర, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు ఒడి ఒడిగా ముందుకు సాగడానికి, సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు చేరడానికి ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మధిర పట్టణంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్, విద్యా రెండు శాఖలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్ద ఉన్నాయని, వారు రెండింటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి ముందుకు తీసుకు వెళ్తున్నారని తెలిపారు. మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఎస్టీపీలు మంజూరు చేశారని, పట్టణాల్లో ఆసుపత్రులు, విద్యావ్యవస్థ, ఎలక్ట్రిసిటీ ఈ రంగాల్లో ప్రపంచంలో వస్తున్న పరిణామాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ప్రతినెలా 15వ తారీకు తర్వాతే వచ్చేవని, తాము అధికారంలోకి రాగానే ప్రతి నెల మొదటి తారీకునే ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కోటి రూపాయల ప్రమాద బీమా కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నామన్నారు. ఇవన్నీ నిరంతరం కొనసాగాలి, ఉద్యోగులు ప్రభుత్వంతో కలిసి నడవాలి ఉద్యోగ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని డిప్యూటీ సీఎం కోరారు.

2047 విజన్ డాక్యుమెంట్‌ను ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌లో విడుదల చేశాం. మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాం ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తెలంగాణ రాష్ట్రం చేరుకుందని తెలిపారు. రాష్ట్రాన్ని 10 సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టణాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు అన్ని రంగాలను గాలికి వదిలేసారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచాలన్న ఆలోచనలను గత ప్రభుత్వం చేయలేదన్నారు. అటువంటి వారికి ఓట్లు వేస్తే సన్న బియ్యం పోయి తిరిగి మొద్దు బియ్యం వస్తాయన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు, ఉద్యోగుల జీతాలు ప్రతినెలా 15వ తారీకు తర్వాతే పడతాయి అన్నారు. గతంలో అధికారంలో ఉన్నవారు పట్టణాల్లో వాళ్లను ఇబ్బందులకు గురి చేశారు శాంతి భద్రతలు లేకుండా పోయాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు జవాబుదారీగా ఉండాలని శాంతియుత వాతావరణం లో పట్టణాలు అభివృద్ధి చెందాలని అధికారులను ఆదేశించామని, ఇప్పుడు అంతటా ప్రశాంత వాతావరణం నెలకు ఉందని అన్నారు. నగరాలు పట్టణాలన్నిటిలో సాధ్యమైనంత మేరకు మౌలిక సదుపాయాలను, మెరుగైన వసతులు కల్పిస్తూ ముందుకు పోతామన్నారు. అర్హత కలిగిన పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చామని, బహిరంగ మార్కెట్లో 55 రూపాయలు కిలో పలికే మేలు రకం బియ్యాన్ని ప్రతి కుటుంబ సభ్యునికి ఆరు కిలోల చొప్పున లెక్కగట్టి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. డబ్బులు ఆదా అయితే కుటుంబంలో సభ్యుల అవసరాలు తీరుతాయన్న ఆలోచనతో 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని, లబ్ధిదారుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ప్రతినెల ఆ విధులు చెల్లిస్తుందని వివరించారు. వడ్డీ లేని రుణాల కింద రాష్ట్రంలోని మహిళలకు 27 వేల కోట్ల విలువైన చెక్కులను ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. ఎన్ని సంఘాలు ఏర్పాటు చేసుకున్న, ఎన్ని వేల కోట్లయినా వడ్డీ లేని రుణాలు పంపిణీ చేసేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారితో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, పెట్రోల్ బంకుల నిర్వహణ, కుటీర పరిశ్రమలు పెట్టించడం, బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ రుణాలు ఇప్పించడం వంటి పనులు చేపట్టామన్నారు.

నగరంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించాము మహిళల పక్షాన ప్రతి నెల ఆర్టీసీకి ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. ఉత్పత్తి రంగానికి కావలసింది నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు ఇందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని ముందుకు పోతుందని ఫలితంగా రాష్ట్రంలో కుటుంబ జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. మన బిడ్డలకు ఉద్యోగాలు రావాలంటే స్కిల్స్ ఉన్న కోర్సులు నేర్పించాలి అందుకే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఐటిఐ లను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని, ఇవన్నీ కార్పొరేషన్లు, మున్సిపల్ కేంద్రాల్లోనే ఉన్నాయని తెలిపారు. రాబోయే 50 సంవత్సరాలకు మధిర పట్టణ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీ అభివృద్ధికి రాజకీయాలు వద్దు.. అభివృద్ధి మాత్రమే ప్రధానం అన్నారు. వరద నీరు మధిర పట్టణంలోకి రాకుండా భారీ రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నామని, వైరా నదినీ టూరిజం ప్రాజెక్టుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్క్, ఫుడ్ కోర్ట్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక స్మశాన వాటిక, మురుగునీరు కనబడకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, భారీ వర్షాలు వరదలు వచ్చిన విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మురుగునీరు, వరద నీరు కలిసి పారకుండా శుద్ధి చేసి బయటకి వదిలేందుకు ఎస్టిపి నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. మధిర పట్టణానికి ప్రవేశించే మార్గాల్లో ఆహ్లాదకర వాతావరణ ఉండేందుకు పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు. మై మధిర క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# తొలి ప్రాధాన్యత సత్తుపల్లికే..

- తొలకరి నాటికి గోదావరి జలాలు
- 23 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందాలి
- బిఆర్ఎస్ నేతలవి బ్రోకర్ మాటలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కల్లూరు, సత్తుపల్లిలో ఎంఎల్ఏ మట్టా రాగమయితో కలిసి రోడ్‌షో





సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః నేను ఎక్కడ ఉన్నా మీ వాడిని. నా తొలి ప్రాధాన్యత సత్తుపల్లికే. 40 ఏళ్లుగా నన్ను ఆదరించి ఆశీర్వదిస్తున్న మిమ్మలను నా ఊపిరి ఉన్నంత వరకు మర్చిపోనని, ఈ ఎన్నికల్లో సత్తుపల్లిలో 23 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన కల్లూరు, సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో జరిగిన రోడ్‌షోలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సత్తుపల్లి నియోజకవర్గానికి ఘన కీర్తి ఉందన్నారు. ఒక స్పెషల్ బ్రాండ్ ఉందన్నారు. రాబోయే తొలకరి నాటికి గోదావరి జలాలు సత్తుపల్లి కొస్తాయన్నారు. యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి బేతుపల్లి చెరువు ద్వారా వేంసూరు మండలానికి గోదావరి జలాలను పారిస్తానన్నారు. సత్తుపల్లి మీదుగా అశ్వారావుపేట వరకు వెళ్లే రహదారి నాలుగు లైన్ల రహదారి కాబోతోందని, గ్రీన్ ఫీల్ హైవే సత్తుపల్లి నియోజకవర్గంలో నుంచి వెళుతుందన్నారు. రైతాంగం కోసం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి రైతులకి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రతి గ్రామం ప్రతి ప్రాంతం అభివృద్ధి చేసే అవకాశం నాకు దక్కిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఆర్థిక, వ్యవస్థల విధ్వంసం జరిగిందన్నారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అయినప్పటికీ రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. నాకు గోదావరి జలాలు కావాలి, రైల్వే లైన్లు కావాలి, జాతీయ రహదారులు కావాలి, విమానాశ్రయాలు కావాలని అడిగాను తప్ప నాకు ఇది కావాలని ఏనాడూ ఎవరిని అడగలేదన్నారు. ఆనాటి ఎన్టీఆర్ దగ్గర నుంచి నేటి రేవంత్ రెడ్డి వరకు ఏ ఒక్క ముఖ్యమంత్రి దగ్గర నాకు నా సొంతానికి ఈ పని కావాలని అడగలేదన్నారు. నేను మిమ్మల్ని నమ్ముకుని, ఈ ప్రజల్ని నమ్ముకుని, అభివృద్ధిని నమ్ముకుని రాజకీయం చేస్తున్నానన్నారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్ ని త్వరలోనే అత్యాధునిక వసతులతో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని, 3,000 మంది కార్మికులకు అక్కడ ఉపాధి దొరుకుతుందని తెలిపారు. పూజ్యులు జలగం వెంగళరావు ఏదైతే సత్కార్యాలను అభివృద్ధిని చూపించారో, అంతకుమిన్నగా అభివృద్ధి చేసి చూపించారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్థికపరమైన విసులుబాటు లేకపోయినా ముఖ్యమంత్రిని ఒప్పించి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. బిఆర్ఎస్ నాయకులు ఇంకా బ్రోకర్ మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికీ ప్రజలను మోసం చేసింది చాలదా అని ప్రశ్నించారు. వ్యవస్థను విధ్వంసం చేసి దుర్మార్గపు మాటలు మాట్లాడుతున్నారు సిగ్గు అనిపించడం లేదా ప్రశ్నించారు. 40 ఏళ్ల ప్రజా జీవితంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి మండలానికి ప్రతి గ్రామానికి ఏది కావాలంటే అది చేశాను, సత్తుపల్లి 23 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందాలని కోరారు. 13 వేల కోట్లు సన్న బియ్యం పండించిన రైతులకు బోనస్ ఇస్తున్నాం ఇది చరిత్రలో ఎక్కడా లేదని అన్నారు. ఈరోజు ప్రతి ఒక్క కుటుంబం సన్న బియ్యంతో భోజనం చేస్తుందని, ప్రతి పేదవాడికి సన్న బియ్యం అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమే నన్నారు. మీరు అడిగినా, అడగకపోయినా సత్తుపల్లికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చి శభాష్ అనిపిస్తానన్నారు. ఈ ఎన్నికల్లో సత్తుపల్లిలో 23 వార్డులోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

కొణిజర్ల, ఫిబ్రవరి 09 (మనం న్యూస్): ఎన్ఎస్పీ పరిధిలో సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. ఈ ఘటన కొణిజర్ల మండల పరిధిలోని గుబ్బగుర్తి గ్రామంలో పల్లిపాడు-ఏన్కూరు రహదారిపై సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ప్రస్తుతం సాగర్ ఆయకట్టు పరిధిలో ప్రభుత్వం వారబందీ పద్ధతిలో సాగునీటిని విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రబీ సీజన్లో రైతులు మొక్కజొన్న, వరి పంటలను సాగు చేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పంటలకు ఎక్కువగా నీటి అవసరం ఏర్పడిందని రైతులు తెలిపారు. ప్రస్తుతం మొక్కజొన్న పంట కంకి దశలో ఉండటంతో ఈ సమయంలో నీరు అందకపోతే దిగుబడి భారీగా తగ్గే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలకు వారం రోజులుగా నీటిని నిలిపివేయడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామ సర్పంచ్ భవిత, గ్రామంలో ప్రజల నివాసాలకు దగ్గరలో ప్రజలకు హాని కలిగించే విధంగా బాయిలర్ రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తున్నారని, దీనిని నిలిపి వేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈఈ పీసీబీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కూసుమంచి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వి. శంకర్ నకిలీ, కల్తీ కలుపు మందు వల్ల పంట నష్టం వచ్చిందని, కల్తి కలుపు మందు అమ్మిన వారిపై చర్యలు తీసుకోవా లని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం అర్బన్ మండలం 14వ డివిజన్ కు చెందిన మహ్మద్ మహబూబ్ అలీ వెలుగు మట్ల రెవెన్యూ సర్వే నెంబర్ 95 లో అక్రమంగా ఆక్రమించిన భూమి, దానికి సంబంధించి పొందిన ఫేక్ పట్టా పాస్ పుస్తకంపై దర్యాప్తు చేసి రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరం శ్రీరామ్ నగర్ కు చెందిన కే. చక్రపాణి తనకు 2016 నుంచి 2019 వరకు దివ్యాంగుల పెన్షన్ వచ్చిందని, తనకు ఆగిపోయిన దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఆర్డిఏ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి జూనియర్ కళాశాలలో వీడ్కోలు దినోత్సవం




భద్రాచలం, జనవరి 9 (మనం న్యూస్): భద్రాచలం పట్టణంలోని త్రివేణి జూనియర్ కళాశాలలో సోమవారం నాడు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రథమ సంవత్స విద్యార్థులు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోడూరు సత్యనారాయణ మాట్లాడుతూ ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ అత్యున్నత స్థాయిలోకి చేరుకొని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, విద్యా ర్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థు లు ఆటపాటలతో అలరించారు. ఈ కార్య క్రమంలో కళాశాల కరస్పాండెంట్ ప్రశాంతి, ప్రిన్సిపాల్ తమ్మళ్ల శ్రీకాంత్, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారం

- జిల్లాలో 48 గంటల సైలెన్స్ పీరియడ్ అమలు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 09 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికల ప్రచారం ఫిబ్రవరి 09 సాయంత్రం 5.00 గంటలతో పూర్తిగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్కు ముందు 48 గంటల (నిశ్శబ్ద వ్యవధి) సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం, 2019లోని సెక్షన్ 209 ప్రకారం, నిశ్శబ్ద వ్యవధి సమయంలో ఎవరూ కూడా ఎన్నికలతో సంబంధం ఉన్న ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలను ఉద్దేశించి ఎన్నికల ప్రచార ప్రసంగాలు చేయడం, సినిమా, టెలివిజన్, ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు మరియు సోషల్ మీడియా ద్వారా ఎన్నికల ప్రచారం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. అలాగే రాజకీయపరమైన ఎస్ఎంఎస్లు, బల్క్ ఎస్ఎంఎస్లు పంపడం లేదా ఇతర వినోద కార్యక్రమాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తూ ఎన్నికల ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నిశ్శబ్ద వ్యవధి సమయంలో సోషల్ మీడియాలో ప్రసారం అయ్యే సందేశాలను నిశితంగా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. నిశ్శబ్ద వ్యవధి నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం జారీ చేసిన సూచనలు, ఆదేశాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఎంసీసీ బృందాలు మరియు పోలీస్ అధికారులు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, కళ్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఒపీనియన్ పోల్స్, ఎగ్జిట్ పోల్స్ నిర్వహణ పూర్తిగా నిషేధమని తెలిపారు.

ఎన్నికల నిర్వహణలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మరియు ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు.

# కౌంటింగ్ ప్రక్రియను సజావుగా ప్రశాంతంగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 09 (మనంప్రతినిధి): 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాను మైక్రో అబ్జర్వర్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీరామ్ పాల్గొని కౌంటింగ్ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేస్తూ, చిన్న తప్పిదానికైనా అవకాశం లేకుండా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, తమ బాధ్యతలను అత్యంత జాగ్రత్తగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, చట్టబద్ధంగా, సమర్థవంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత కౌంటింగ్ సిబ్బందిపై ఉందని తెలిపారు.

అలాగే ఓట్ల లెక్కింపు సమయంలో పూర్తి నిష్పక్షపాతత్వం, పారదర్శకతతో పాటు ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా పాటించడం అత్యంత అవసరమని జిల్లా ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, తమ విధులను నిబద్ధతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. శిక్షణ సందర్భంగా ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పాల్గొని, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన నిబంధనలు, విధి విధానాలు, చెక్ లిస్టులు, వివిధ ఫారాలు, లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లోపాలు తలెత్తకుండా పాటించాల్సిన అంశాలను సవివరంగా వివరించి కౌంటింగ్ సిబ్బందికి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత కౌంటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరి కాదు




- ప్రజా సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు
- తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, ఫిబ్రవరి 9(మనం న్యూస్):** కేంద్ర మంత్రి బండి సంజయ్కుమార్ కాంగ్రెస్పై తప్పుడు ఆరోపణలు చేయడం సరి కాదని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఖండించారు. సోమవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయం ఇందిరా భవన్ లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ, పడాల రాహుల్, ఆర్టీఏ మెంబర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ , అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ఇతర ముఖ్య నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆశీర్వదించాలన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ నుండి దివంగత నేత సత్యనారాయణ రావు దీనిని కార్పొరేషన్ గా చేశారన్నారు.. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటున్నామన్నారు. కరీంనగర్ లో ఏ అభివృద్ధి జరిగిన అది కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే జరిగిందన్నారు. ఇటీవల బీఆర్ఎస్ 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మానేరు రివర్ ఫ్రంట్ ,కుంగిపోయిన తీగల వంతెన ,స్మార్ట్ సిటీ మెయిన్ రోడ్డులకే పరిమితం అవడం..కేంద్ర నిధులు అయిన అవినీతి జరిగింది అని చెప్పిన చర్యలు తీసుకోవడం లో కేంద్ర మంత్రి విఫలమయ్యారన్నారు. అవినీతిమయం అయిందన్న మేయర్ నే పార్టీలో చేర్చుకున్నారన్నారు. కరీంనగర్ నియోవర్గం శాసన సభ్యుడి గా ఉన్న నాడు మంత్రి గా ఉండి కూడా ఒక్కరికి కూడా డబుల్ బెడ్ రూం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు చొప్పున ఇస్తూ పేద ప్రజలకు గూడు కల్పించిందన్నారు. చెప్పులు అరిగేలా తిరిగిన ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదని, మేం అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ లో మాత్రమే తినడానికి యోగ్యంగా ఉండే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కరీంనగర్ లో శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూడా గత ప్రభుత్వం నియమించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే లా కాలేజీ తెచ్చి ఎల్ ఎల్బి, ఎల్ ఎల్ ఎం కోర్సులు తెచ్చామన్నారు. మెడికల్ కాలేజీ కరీంనగర్ కి ఇవ్వకుండా సిద్దిపేట కి తీసుకెళ్తే పోరాటాలు చేశామన్నారు. చివర లో మెడికల్ కాలేజీ ఇచ్చిన నిధులు ఇవ్వలేదన్నారు. మేం మెడికల్ కాలేజీ కి నిధులు కేటాయించి వేగంగా నిర్మిస్తున్నామన్నారు. ఎక్కడ అవినీతి కి ఆస్కారం లేకుండా కరీంనగర్ మేయర్ పాలన ఉంటుందన్నారు. అభివృధి ప్రధాన రోడ్లకు పరిమితంగా కాకుండా వికేంద్రీకరణ చేసి అన్ని గల్లీలో అభివృద్ధి చేస్తామన్నారు. కరీంనగర్ లో కూడా ప్రతి డివిజన్ వారిగా ఆఫీస్ లు పెట్టీ పరిపాలన వికేంద్రీకరణ చేస్తామని, ఎక్కడ అవినీతి లేకుండా ఏఐ ఉపయోగించి సేవలు అందిస్తామన్నారు. మున్సిపల్లో అవినీతి లేకుండా పనులు చేస్తామన్నారు. భవిష్యత్లో తాగు నీటి సమస్య లేకుండా ,రోడ్లు ,డ్రైనేజీ , పార్క్ లు ,విద్యుత్ సమగ్ర ప్రణాళిక ద్వారా ముందుకు పోతామన్నారు. నగరం పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు పెదగడానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా స్కీమ్స్ తీసుకొస్తామని, ఇన్క్లూజివ్ గ్రోత్ ద్వారా అభివృధి చేస్తామన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు జోడెద్దుల్లా పని చేస్తామన్నారు. మేం ఎంఐఎం తో కుమ్మక్కయ్యామని మాట్లాడు తున్నారన్నారు. అర్థరహితమైన ఆరోపణలు మంచిది కాదన్నారు. కాంగ్రెస్ 66 స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. బీఆర్ ఎస్, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారన్నారు.. అభ్యర్థుల ఎంపిక లో మీరు అలయ్ బలాయ్ తీసుకొని ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు.. జిల్లా కేంద్రం లో మా ముగ్గురు మంత్రులము బాధ్యతగా అందుకే కలిసి పని చేస్తున్నామన్నారు. జిల్లా అభివృధి మాదే బాధ్యత అని అన్నారు. వేములవాడ కి 100 కోట్లు ఇస్తామన్నారని అన్నారు..ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. మేం నిధులు కేటాయించి వేములవాడ అభివృద్ధి చేస్తున్నామన్నారు.. కొండగట్టు కి నిధులు కేటాయిస్తామని చెప్పారు.. చేశారా.., కరీంనగర్ తీగల వంతెన అవినీతి జరిగిందని,ఆ బ్రిడ్జి పై నడిచే పరిస్థితి లేదన్నారు. ఒక్కో జంక్షన్ కి కోట్ల రూపాయలు ఖర్చు అవినీతి చేశారన్నారు.. కరీంనగర్ అవినీతికి అడ్డగా మారిందని..దానిని కాపాడాలన్నారు. ఒక జెండా పెట్టడానికి మూడు దఫాలుగా కోట్లు ఖర్చు చేశారన్నారు.. మేయర్ అభ్యర్థి కోట్లు ఖర్చు పెడుతున్నాడన్నారు. భూములు కబ్జా పెట్టారని, మేం వచ్చిన తర్వాత దానిని కంట్రోల్ చేశామన్నారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికలు అవినీతి కి నిజాయితీ పారదర్శక పాలన కి పోటీ..కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. జిల్లా కేంద్రాన్ని ముక్కలు చేసి కళావిహీనం చేసి రాజకీయ అస్థిరత్వం చేశారన్నారు.. మతం పేరు మీద రాజకీయం చేస్తూ అభివృద్ధికి ఆమడ దూరం చేశారన్నారు.. మేం తెచ్చిన శాతవాహన యూనివర్సిటీ,రైలు , పాస్ పోర్టు కేంద్రం , మాత శిశు హాస్పిటల్ , కేంద్రీయ విద్యాలయాలు ,మోడల్ స్కూల్ ఇవి మేము తెచ్చినవే.. మీరు కరీంనగర్ కి ఏం తెచ్చారు చెప్పాలన్నారు. మేం మున్సిపల్ కార్పొరేషన్ చేయడం వల్లే కరీంనగర్ స్మార్ట్ సిటీ వచ్చిందన్నారు. మేం నీతివంతమైన పాలన అందిస్తామని మాకు అవకాశాలు ఇవ్వండి ముఖ్యమంత్రి పక్షాన ,పార్టీ అధ్యక్షుడు పక్షాన ముగ్గురు మంత్రుల పక్షాన విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ లో అవినీతి జరిగిందని మీరే చెప్పారు..ఆ మేయర్ మీ పార్టీలో చేరగానే ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్ర అభివృధి కోసం మేము చాలసార్లు ప్రధాని ,కేంద్ర మంత్రులను కలిశామని, అయిన బడ్జెట్ లో తెలంగాణ కు కేటాయించింది సున్నా అని తెలిపారు. సరిహద్దుల మార్పులు చేర్పులు అన్నప్పుడే హుస్నాబాద్ ను కరీంనగర్ లో కలుపుతామని చెప్పామని.. సిద్దిపేట లో బలవంతంగా కలిపారన్నారు.. గంగుల కమలాకర్ ఏం చేశారో ... మేము ఏం చేశారో ప్రజలకు తెలుసునని అన్నారు.. మంత్రిగా రెండు సంవత్సరాలుగా దూరమైన ఈ శాసన సభ్యులు కరీంనగర్ ను ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. మీరు చేసిన అవినీతి ఉందని, భూకబ్జాలు ఉన్నాయని అవినీతి పరులను అరెస్ట్ చేసి జైల్లో పెట్టామన్నారు. కరీంనగర్ కి ఏ అభివృధి చేసిన అది కాంగ్రెస్ ప్రభుత్వందన్నారు. కరీంనగర్ కి నిధులు నిరంతర ప్రక్రియ.. గంగుల కమలాకర్ మేం రోడ్లు వేసామని చెప్తున్న ఆ బిల్లులు కట్టడానికి పైసలు సరిపోతున్నాయన్నారు. రెండు పార్టీలు అధికారంలో ఉన్నపుడు అవినీతి జరిగాయన్నారు. కబ్జాల,అవినీతి పై విచారణ జరుగుతుందన్నారు. మా ముగ్గురు మంత్రులం విచారణ పై సమీక్షిస్తామన్నారు. కరీంనగర్ గెస్ట్ హౌస్ కి సంబంధించి ఇప్పటికి ఆ పైసలు కోసం తిరుగుతున్నారన్నారు.. అనుమతి లేకుండా టెండర్ లేకుండా నిర్మిస్తే ఇలాంటి ఇబ్బందులు వస్తాయన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో 10 ఏళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, మాజీ ఎమ్మెల్యేలు ఆరేపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ, పడాల రాహుల్, ఆర్టీఏ మెంబర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ , అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల తీర్పు....
# కాంగ్రెస్‌కు కావాలి గుణపాఠం

- కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది
- కరీంనగర్ కార్పొరేషన్ సహా మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత మాదే
- పొరపాటు చేస్తే మళ్లీ ఐదేళ్లపాటు నరక యాతన తప్పదు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి



**కరీంనగర్, ఫిబ్రవరి 9(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు కాంగ్రెస్ అవినీతి, అరాచక పాలనకు చెంప పెట్టు కావాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలిచ్చే తీర్పు ద్వారా అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. ''సేవ్ తెలంగాణ...ఓట్ ఫర్ బీజేపీ''అనే బీజేపీ నినాదానికి అనుగుణంగా కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేసారు ప్రజలారా! రేపు జరగబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల తీర్పు తెలంగాణలో మార్పుకు సంకేతం కావాలి. అవినీతి, అరాచకాలు, మోసపూరిత హామీలతో అడ్డగోలు పాలన చేస్తున్న కాంగ్రెస్ పాలకులకు చెంప పెట్టు కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పాలనలో ఏం చేసారో, గెలిస్తే ఏం చేస్తారో చెప్పకుండా, తిట్ల దండకాలు, తప్పుడు హామీలు, కుమ్మక్కు రాజకీయాలతో ప్రజలను మోసపెట్టడానికి ప్రయత్నించారు. బీజేపీ మాత్రమే స్పష్టమైన ఎజెండాతో, స్పష్టమైన అభివృద్ధి కార్యాచరణతో ఎన్నికల్లో పాల్గొంటోంది. కేంద్రం నుండి నిధులు వస్తున్నాయి. కార్పొరేషన్, మున్సిపాలిటీలల్లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతుందంటే కేంద్ర నిధులవల్లేనని గుర్తుంచుకోండి. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మున్సిపాలిటీలకు నయాపైసా ఇయ్యలేదు. ఇప్పుడు ప్రజల ముందున్న దారి ఒక్కటే. అవినీతిలో మునిగిన కాంగ్రెస్ పార్టీకి బలమైన హెచ్చరిక జారీ చేయాలి. తెలంగాణను దోచుకుతిన్న బీఆర్ఎస్ పార్టీని మళ్లీ మొలవకుండా బొందపెట్టాలి. ప్రజలారా.... తస్మాత్ జాగ్రత్త..! బీఆర్ఎస్, కాంగ్రెస్ను నమ్మితే అధో:గతే. తెలంగాణ అభివృద్ధి కావాలంటే, మున్సిపాలిటీల్లో నిజమైన పాలన రావాలంటే కోరుతున్నారు.

# క్రీడలతో ఒత్తిళ్లను అధిగమించవచ్చు

- టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి
- ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీల ప్రారంభం




**తిరుపతి, ఫిబ్రవరి 09, మనం న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం లక్షలాది భక్తులకు నిత్యం విశేష సేవలు అందిస్తున్న టిటిడి ఉద్యోగులు ఎదుర్కొనే మానసిక మరియు పనిఒత్తిడులను క్రీడల ద్వారా సమర్థంగా అధిగమించవచ్చని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. టిటిడి ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు సోమవారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని పరేడ్ మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఈవో, ఉద్యోగులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉన్నతాధికారులతో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు మరియు శాంతి కపోతాలను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిటిడి ఉద్యోగులు రోజువారీ జీవితంలో ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకుంటే ఒత్తిళ్లను అధిగమించడంతో పాటు మరింత ఉత్సాహంతో, బాధ్యతతో విధులు నిర్వర్తించగలరని తెలిపారు. క్రీడలు జీవితం యొక్క భాగమైతే శారీరక ఆరోగ్యంతో పాటు ఉల్లాసం, సమయపాలన, ప్రణాళికా దృక్పథం, సానుకూల ఆలోచన, మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, కార్యనిర్వహణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సంక్షోభ నిర్వహణ సామర్థ్యం మరియు అందరిని కలుపుకుని ముందుకు సాగే తత్వం అలవడతాయని చెప్పారు.

మన ఆలోచనలకు అనుగుణంగానే మన ప్రవర్తన ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, మానసిక వికాసం దృష్ట్యా 1977 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ఉద్యోగుల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి రోజూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

అదనపు ఈవో వాలీబాల్ మ్యాచ్తో క్రీడాపోటీలను ప్రారంభించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక ప్రతిభావంతులు, సీనియర్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడల్లో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర అంశాలు ఉన్నాయి.

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పీఆర్వో కుమారి నీలిమ వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. ఆనంద రాజు, డిప్యూటీ ఈవోలు శ్రీమతి వి.ఆర్. శాంతి,సెల్వం,రాజేంద్ర కుమార్, సీపీఆర్వో డా. టి. రవి,గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్,ఇతర ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ మీటర్లు

- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి, ఫిబ్రవరి 9 మనం న్యూస్ :** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ఇప్పటికే ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లకు ప్రీ-పెయిడ్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతికతతో మరింత మెరుగైన సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు స్మార్ట్ మీటర్లను ఆమర్చడం జరుగుతోందన్నారు. సంస్థ పరిధిలో కార్పొరేషన్/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్స్, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఇప్పటివరకు నెల్లూరు జిల్లాలో 16,802, తిరుపతి 19,460, చిత్తూరు 13,871, అన్నమయ్య 13,311, కడప 16,829, అనంతపురం 8,136, శ్రీసత్యసాయి 6,717, కర్నూలు 10,457, నంద్యాల జిల్లాలో 9,836 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఆమర్చినట్లు తెలిపారు. ఈ సర్వీసులన్నింటినీ ప్రస్తుతం ప్రీ-పెయిడ్ మీటర్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రీ-పెయిడ్ మీటర్లకు రీఛార్జ్ చేసేందుకు వీలుగా ఈ-వాలెట్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్తు వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, తదనుగుణంగా విద్యుత్తును ఆదా చేయడం ద్వారా బిల్లును కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ వినియోగంపై వినియోగదారుల్లో జవాబుదారీతనం పెంపొందుతుందని తెలియజేశారు.

దశలవారీగా మిగిలిన కేగిరీల వినియోగదారులకు కూడా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. కాగా సోమవారం ఉదయం సంస్థ కార్పొరేట్ ఆఫీసులో నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 39 వినతులు అందాయని సంస్థ సీఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్డి) కే. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, ఆర్ పద్మ, జె రమణాదేవి, ఎం. ఉమాపతి, ఎం. మురళి కుమార్, ఎం. కృష్ణారెడ్డి, కే. సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, జగదీష్ చక్రపాణి, లత తదితరులు పాల్గొన్నారు.



## వాలెంటైన్ వీక్ సర్‌ప్రైజ్‌తో జర జాగ్రత్త

**వాలెంటెన్స్ స్పెషల్ అనగానే మెసేజ్‌లతో భద్రం**

**పత్తికొండ రూలర్ సీఐ పులి శేఖర్ గౌడ్**

**పత్తికొండ, ఫిబ్రవరి 09(మనం న్యూస్) :** వాలెంటైన్ వీక్ సర్ ప్రైజ్ తో మొబైల్ కి వచ్చే మెసేజ్ లతో జాగ్రత్తగా ఉండాలని పత్తికొండ రూలర్ సీఐ పులి శేఖర్ గౌడ్ అన్నారు. యువత వాలెంటెన్స్ మెసేజ్ లతో జాగ్రత్తగా ఉండండని స్పెషల్ గిఫ్ట్స్, గ్రీటింగ్స్ అంటూ సందేశాలలోని క్లిక్ చేయొద్దు అని అయన సూచించారు. ఎవరైనా సడన్ గా సర్ప్రైజ్ అంటూ పంపించే క్యూఆర్ కోడ్స్ స్కాన్ చేయవద్దన్నారు. సైబర్ మోసగాళ్ల వలలో పడకుండగా యువత జాగ్రత్తగా ఉండాలని సీఐ పేర్కొన్నారు.ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 టోల్-ఫ్రీ నంబర్కు కాల్ చేయండియని సూచించారు.

# వీధి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి: గట్ల రవీంద్ర




**రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):** రోడ్లు ఆక్రమించుకొని వీధి వ్యాపారాలు చేస్తున్నడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర నాయకుడు గట్ల రవీంద్ర (హైటెక్ రామ్) ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట చౌరస్తా ఓమిని ఆసుపత్రి నుంచి సరూర్నగర్ రైతు బజార్ వరకు సర్వీసు రోడ్డును ఆక్రమించుకుని వీధి వ్యాపారాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డును ఆక్రమించుకుని విధి వ్యాపారాలు చేయడం వల్ల పాదాచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్య గురించి చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన చర్యలు చేపట్టలేదు అన్నారు. రోడ్డు ఆక్రమణ వల్ల అనేక ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. సర్వీస్ రోడ్లను ఆక్రమించుకొని వీధి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. లక్ష్మీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్ రాజ్ ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

# డివిజన్‌లో సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దుతా

- కార్పొరేటర్ సుజాత నాయక్



**రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):** హస్తినాపురం డివిజన్ పరిధిలో ని కాలనీలను సమస్యలు లేని డివిజన్ గా తీర్చిదిద్దామని డివిజన్ కార్పొరేటర్ భానోతు సుజాతా నాయక్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలో ని వందనపురి కాలనీ లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా హాజరై రూ. 5.57 కోట్ల నిధుల తో చేపట్టనున్న 50 ఫీట్ల సి సి రోడ్డు,అంతర్గత సిసి రోడ్లుకు ఆమె శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గత 5 సంవత్సరాలలో 230కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చెపట్టామని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రజా పాలన లో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు.

అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, కాలనీ వాసులకు అందు బాటులో వుంటూ సమస్య లను ఎప్పటికపుడు పరిస్కారం చేస్తామని అన్నారు.హస్తినాపురం జెడ్ పి రోడ్ లో లో ఎల్ బి నగర్ సర్కిల్ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ పార్టీ లీడర్ గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , వందనపురి కాలనీ అధ్యక్షులు నల్లవెల్లి మనోహర్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి మునగాల స్వామి రావు , ట్రెజరరీ చల్లా వేణుగోపాల్ రెడ్డి , గౌరవ అధ్యక్షులు కర్నాటి చండీశ్వర్, కమిటీ మెంబర్స్, కాలనీ పెద్దలు ధర్మా రెడ్డి, సంతోష్, లక్ష్మా రెడ్డి, పత్య నాయక్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ జరిగిందని కరుణాకర్ రెడ్డే ఒప్పుకున్నారు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి, ఫిబ్రవరి 9 మనం న్యూస్ :** కల్తీ నెయ్యికి పాల్పడిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులకు శ్రీవారు త్వరగా శిక్ష వేయాలని కోరుతూ ఆదివారం ర్యాలీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి జరిగిందని ఎన్ డిడిబి, సిట్ నిర్ధారించాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పునరుద్ఘాటించారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. శ్రీవారి లడ్డు ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే కరుణాకర్ రెడ్డి జరగలేదని బొక్కుతున్నాడని ఆయన తెలిపారు. వీరిద్దరి అభిప్రాయాలను బేరీజు వేస్తూ నేను మాట్లాడిన మాటలను వైసీపీ నాయకులు, కొన్ని పత్రికలు వక్రీకరించారని ఆయన ఆరోపించారు. కల్తీ నెయ్యి పాపాత్ములకు మంచి బుద్ధి కలిగించాలని అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొట్టి శ్రీవారిని మొక్కామని ఆయన గుర్తు చేశారు. కరుణాకర్ రెడ్డి చెంచాలు పసుపు నీళ్లు చల్లినా, పొర్లు దండాలు పెట్టినా చేసిన పాతకం పోదని ఆయన అన్నారు. అయోధ్య కు పంపిన లడ్డూల తయారీకి హైదరాబాద్, పలమనేరు డైరీల నుంచి నెయ్యి తెప్పించినట్లు కరుణాకర్ రెడ్డి, పేర్ని నానీలు చెప్పారని ఆయా న గుర్తు చేశారు. అంటే మిగిలిన లడ్డూల్ని కల్తీ నెయ్యి తో చేసినట్లు కరుణాకర్ అంగీకరించారని ఆయన చెప్పారు. కరుణాకర్ రెడ్డి ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకుని నిజం ఒప్పుకుని హిందువులకు ముఖ్యంగా శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా కరుణాకర్ రెడ్డి గోబెల్స్ తరహాలో

పదే పదే అబద్ధాలు చెబితే నిజమవుతుందనే భ్రమలో ఉన్నారని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఎన్ డిడిబి, సిట్ నెయ్యి కల్తీ జరిగిందని నివేదికలు ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఆదివారం జనసేన నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను

వైసీపీ పాంఫ్లెట్ సాక్షి వక్రీకరించిందని ఆయన తెలిపారు. సాక్షిపై న్యాయ పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్ లో జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లా జైలులో రమేశ్ చంద్రసేన్ మృతి



**ఢాకా,ఫిబ్రవరి 9:** బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పూర్ సెంట్రల్ జైలులో అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ చంద్రసేన్ (85) మృతి చెందారు. ఐదు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన సేన్.. 2024 ఆగస్టు 16 నుంచి జైలులోనే ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం రద్దైన వెంటనే ఆయనపై జమాత్-ఎ-ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. హత్య సహా పలు నేరాలను ఆయనపై మోపి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఎలాంటి విచారణ లేకుండా కటకటాలకే పరిమితమయ్యారు. ఇటీవల జైలులో సేన్ ఆరోగ్యం క్షీణించింది. సరైన వైద్యం ఆయనకు అందలేదు. దీంతో జైలులోనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సేన్ మృతి కలకలం సృష్టిస్తోంది. అవామీ లీగ్ పార్టీలో రమేశ్ క్రియాశీలంగా ఉండేవారు. షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చేశాక అవామీ లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వం నడుపుతున్న మహమ్మద్ యూనస్ సలహామండలికి లక్ష్యంగా మారారు. ఒక్క 2025 సంవత్సరంలోనే బంగ్లాదేశ్ జైళ్లలో దాదాపు 107 మంది చనిపోయారని, ఇందులో ఎక్కువ మంది అవామీ లీగ్ పార్టీ నేతలేనని ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొంది.

# ఫీజులు పెంచినా విదేశీ టాలెంట్ కావాల్సిందే..

## ఏఐతో 'హెచ్-1బీ'కి డిమాండ్..!




**న్యూయార్క్ ,ఫిబ్రవరి 9:** టెక్ కంపెనీల విదేశీ నియామకాలను తగ్గించేందుకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ను ట్రంప్ సర్కారు కఠిన తరం చేసింది. ఈ వీసాలకు ఏకంగా లక్ష డాలర్ల ఫీజును నిర్ణయించింది. అయినప్పటికీ.. టెక్ కంపెనీలు మాత్రం ఈ వీసాదారుల వైపే మొగ్గుచూపుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై భారీగా పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు.. ఆ లక్ష్యాల సాధన కోసం పెద్ద సంఖ్యలో విదేశీ టాలెంట్‌ను నమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే 'హెచ్-1బీ' వీసాలకు డిమాండ్ పెరుగుతున్నట్లు నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ నివేదిక వెల్లడించింది.

ఇమిగ్రేషన్ డేటాను అధ్యయనం చేసి ఎన్‌ఎఫ్‌ఏపీ ఈ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో కొత్త హెచ్-1బీ వీసాల జారీ కోసం టెక్ కంపెనీలు సమర్పించిన లేబర్ కండీషన్స్ అప్లికేషన్స్‌లో 80శాతానికి పైగా ఏఐ సంబంధిత నియామకాలవేనని నివేదిక తెలిపింది. అత్యధికంగా అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీలు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో అమెజాన్ అత్యధికంగా 4,644 మంది హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంది. సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సైంటిస్టులు, డేటా సైంటిస్టుల విధుల కోసం కంపెనీలు ఈ వీసాదారులను ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

అధునాతన ఏఐ సాంకేతికతలో అమెరికన్లకు నైపుణ్యాల కొరత వల్లే కంపెనీలు విదేశీ టాలెం ఆధారపడుతున్నట్లు ఎన్‌ఎఫ్‌ఏపీ నివేదిక తెలిపింది. అమెరికా వర్సిటీల్లో కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ చదువుతున్న విద్యార్థుల్లో 80శాతం మంది విదేశీయులే. ఇక, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో 75శాతం మంది విదేశీ విద్యార్థులున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఈ గ్రాడ్యుయేట్లు కొంత కాలం పాటు ఓపీటీ కింద పనిచేయవచ్చు. ఆ వ్యవధి తరువాత వారిని కంపెనీలు తీసుకోవాలంటే హెచ్-1బీ వీసా ఒక్కటే మార్గం. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ కంపెనీలు ప్రస్తుతం కృత్రిమ మేధపై భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. 2025లో ఈ ఐదు కంపెనీలు 380 బిలియన్ డాలర్లకు పైగా ఏఐపై వెచ్చించాయి. రానున్న కాలంలోనూ ఈ రంగంపై భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాల లక్ష్యాల కోసం హెచ్-1బీ వీసా ఫీజులను భరించి నియామకాలు చేపట్టేందుకు కంపెనీలు మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# ఎప్‌స్టీన్ మరణ ప్రకటన

## ఒక రోజు ముందే తయారు చేశారా..?



**వాషింగ్టన్,ఫిబ్రవరి 9:** ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి ఎప్‌స్టీన్ 2019 ఆగస్టు 10వ తేదీన అనుమానాస్పద స్థితిలో మాన్‌హట్టన్ జైల్లో మృతి చెందాడు. అయితే అతడి మరణ ప్రకటన ఒకరోజు ముందే తయారు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా న్యాయశాఖ తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ఆ తేదీ ఆగస్టు తొమ్మిదిగా ఉండటం సంచలనంగా మారింది.

ఎప్‌స్టీన్ తన జైలు గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని అప్పట్లో అధికారులు ధ్రువీకరించారు. అయితే అతడి మరణంపై అప్పటినుంచే అనుమానాలు ఉన్నాయి. ఆగస్టు 9 రాత్రి 10.30 గంటల సమయంలో ఆరెంజ్ రంగు దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి ఎప్‌స్టీన్ జైలు గదివైపు కదులుతున్నట్టుగా కొన్ని సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా విడుదలైన రికార్డుల్లో ఆ కదులుతున్న వ్యక్తిని ఖైదీకావొచ్చని పేర్కొనగా.. న్యాయశాఖ మాత్రం అతడు జైలు అధికారి అని చెప్తోంది. కాగా.. ఎప్‌స్టీన్ చనిపోయాడని గుర్తించిన తర్వాత తీసిన ఫొటోలను తాజాగా బహిర్గతం చేశారు. ఎప్‌స్టీన్ మరణించాడని గుర్తించిన 16 నిమిషాల తర్వాత స్ట్రెచర్‌పై ఉన్న అతడిని బతికించేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నట్టుగా ఓ చిత్రంలో కనిపించింది. ఆసుపత్రిలో అతడి మృతి ధ్రువీకరించిన తర్వాత తీసిన ఫొటోల్లో పేరును తప్పుగా రాయడం అనుమానాలకు తావిస్తోంది.

# 'మమ్మల్ని భయపెట్టలేరు'..

## యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదన్న ఇరాన్



**టెహరాన్ ,ఫిబ్రవరి 9:** అమెరికాతో అణు చర్చలు జరుగుతోన్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరంటూ అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వ్యాఖ్యలు చేశారు.

''అమెరికాపై మాకు పెద్దగా నమ్మకం లేదు. యురేనియం శుద్ధిపై మేమెందుకు వెనక్కి తగ్గాలి. ఒకవేళ మాపై యుద్ధం ప్రకటించినా మేం దాన్ని వదిలేయబోం. ఎందుకంటే మమ్మల్ని శాసించే హక్కు ఎవరికీ లేదు. ఈ ప్రాంతంలో అమెరికా సైనిక మోహరింపు మమ్మల్ని భయపెట్టలేదు'' అని అరాఘ్చి వ్యాఖ్యానించారు. ఇక, అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు ఇరాన్ మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి.

# హిమంత వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకెళ్తాం

## కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్



**డిస్‌పూర్,ఫిబ్రవరి 9:** తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ స్పందించారు. 2013లో తన పాక్ పర్యటనపై సిట్ అధికారులు తనను ఎన్నడూ ప్రశ్నించలేదన్నారు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమంత బిశ్వశర్మ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

గతంలో తన భార్య పాకిస్థాన్‌కు వెళ్లడం నిజమేనని..కానీ వృత్తి సంబంధమైన పనిలో భాగంగా అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. ఆమెతో పాటు తాను కూడా 10 రోజుల పాటు పాకిస్థాన్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ పర్యటన సమయంలో తాను అక్కడ ఎవరినీ కలవలేదన్నారు. ఆ విషయంపై హిమంత బిశ్వశర్మ అర్థం లేని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# ట్రంప్ బెదిరింపులు..

## 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్..!



**టెహరాన్ ,ఫిబ్రవరి 9:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరాన్‌కు చేరువలో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 37 ఏళ్ల సంప్రదాయానికి బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 8న ఎయిర్‌ఫోర్స్ కమాండర్లతో ఏటా ఆయన భేటీ అవుతుంటారు. ఈసారి ఆ సమావేశంలో ఆయన పాల్గొనలేదని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 1989లో సుప్రీంలీడర్‌గా బాధ్యతలు అందుకున్న దగ్గరినుంచి చివరకు కరోనా సమయంలో కూడా ఈ వార్షిక సమావేశాన్ని ఆయన మిస్ చేయకపోవడం గమనార్హం.

1979లో ఫిబ్రవరి 8న పహ్లవీ పాలకులకు వ్యతిరేకంగా రుహొల్లా ఖొమేనీకి వాయుసేన అధికారులు విధేయత ప్రకటించారు. దాంతో గత నాలుగు దశాబ్దాలుగా ఆ రోజుకు గుర్తుగా ఎయిర్‌ఫోర్స్ అధికారులు సుప్రీం లీడర్‌తో సమావేశం అవుతుంటారు. ఇదిలాఉంటే.. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపులు పెంచుతోంది. ఆ దేశం వైపు తమ నౌకాదళం కదులుతోందని, అది అక్కడికి చేరుకున్న తర్వాత ఎలా పనిచేస్తుందో చూద్దామంటూ ట్రంప్ హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఒకవైపు రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండగా.. మరోవైపు ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

# రూ.54వేల కోట్లు కొల్లగొట్టారు

## ఇది భారీ దోపిడీ

## డిజిటల్ మోసాలపై సుప్రీం



**ఢిల్లీ ,ఫిబ్రవరి 9:** దేశంలో డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుల్లో సైబర్ నేరగాళ్లు రూ.54వేల కోట్లు కొల్లగొట్టారని, ఇది భారీ దోపిడీ అంటూ ఆందోళన వ్యక్తంచేసింది. దోచుకున్న సొమ్ము చిన్నరాష్ట్రాల బడ్జెట్ కంటే ఎక్కువగా ఉందని పేర్కొంది. ఈ మోసాలపై అత్యున్నత న్యాయస్థానంలో తాజాగా విచారణ జరిగింది. వాటికి చెక్ పెట్టేందుకు ఆర్బీఐ, బ్యాంకులు, టెలికమ్యూనికేషన్ విభాగం సంప్రదింపులతో నిర్ణీత ప్రమాణాల కార్యాచరణను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అందుకు నాలుగువారాల గడువు ఇచ్చింది. ఈ నేరాలకు కొందరు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం, కుట్ర కూడా కారణం కావొచ్చని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఆర్బీఐ, బ్యాంకుల నుంచి సకాలంలో చర్యలు ఉండాలని ఆదేశించింది.

డిజిటల్ అరెస్టు కేసుల్లో పరిహారం విషయమై ఆర్బీఐ, టెలికమ్యూనికేషన్ విభాగం, ఇతర విభాగాలు సంయుక్తంగా సమావేశంకావాలని సూచించింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే.. డిజిటల్ ఆర్థిక మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ వినియోగదార్లకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపశమనాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఒక మోసపూరిత లావాదేవీకి రూ.25,000 వరకు పరిహారాన్ని అందివ్వనుంది. మోసగాళ్లకు వన్ టైం పాస్‌వర్డ్ (ఓటీపీ) ఇవ్వడం ద్వారా, డబ్బులు పోగొట్టుకున్న వారికీ ఈ పరిహారం అందుతుందని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. అయితే ఆ లావాదేవీలు దురుద్దేశంతో కూడుకున్నవి కాకుండా ఉండాలన్నారు.

# ఓటుకు నోటు సాక్ష్యాలు కాల్చేసిండ్రు?

## ఫోరెన్సిక్ ల్యాబ్‌లో అగ్ని ప్రమాదంపై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓటుకు నోటు సాక్ష్యాలను కాల్చివేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రజలు ఓట్లేసిన గెలిపించి, పాలన చేయమంటే?, పనికిమాలిన మాటలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. సింగరేణిని గందరగోళపరచాలని చూస్తున్నారని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కదానిని కూడా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పథకాలు తీసుకున్నవారు బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పొరపాటు చేశారన్నారు. మరోసారి భస్మాసుర హస్తం వంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దని సూచించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. అయితే, గడచిన ఈ 12 ఏళ్లలో కేంద్ర బీజేపీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.

# చంద్రుడి మట్టిని భూమికి తెస్తున్నారు

## చంద్రయాన్-4 ల్యాండింగ్ సైట్ ఖరారు చేసిన ఇస్రో



**హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 ప్రయోగం విజయం భారత దేశానికి ఎంతో పేరును సంపాదించి పెట్టిన విషయం తెలిసిందే. ఈ భారీ ప్రయోగం 2023, జూలై 14న మధ్యాహ్నం 2:35 గంటలకు ఆంధ్రప్రదేశ్లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంనుండి రాకెట్ ద్వారా ఈ నౌకను నింగిలోకి పంపారు. దాదాపు 40 రోజుల సుదీర్ఘ ప్రయాణం తర్వాత, ఆగస్టు 23, 2023 న సాయంత్రం 6:04 గంటలకు చంద్రయాన్-3 ల్యాండర్ (విక్రమ్) చంద్రుడి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా అడుగుపెట్టింది. ఈ అద్భుత విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ను విజయవంతంగా దించిన ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా భారత్ సరికొత్త చరిత్రను లిఖించింది. కాగా ఈ భారీ విజయం తర్వాత మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి ఇస్రో సిద్ధం అయింది. చంద్రుడి మట్టిని భూమికి తెచ్చేందుకు ఇస్రో మాస్టర్ ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా.. క్లిష్టమైన 'చంద్రయాన్-4' మిషన్‌పై దృష్టి పెట్టింది. ఈ ప్రయోగానికి సంబంధించిన అత్యంత కీలకమైన అడుగు పడింది. చంద్రుడిపై ల్యాండర్ ఎక్కడ దిగాలో ఆ ప్రాంతాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు.

# కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేదే లేదు?

## రెండేళ్ల తర్వాత పాతాళంలో ఉన్నా ఈడ్చుకొస్తం : కేటీఆర్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** పెద్ద చిన్న తేడా లేదు? ఏమో అనుకుంటుండ్రు? ఎదేదో మాట్లాడుతుండ్రు? ఏడ దాక్కున్నా పట్టుకొస్తాం.. ఎన్టీఆర్‌ను, చంద్రబాబును చూశాం.. ఏ ముఖ్యమంత్రి ఇలా మాట్లాడలే(దు)?.. రేవంత్ రెడ్డిలాగా ఇప్పటి వరకు ఇలా ఎవరూ మాట్లాడలేదు?.. కేటీఆర్

కేసీఆర్‌ను, కార్యకర్తలను తిడితే ఊరుకునేదే లేదు?.. రెండేళ్ల తర్వాత బొ(పా)తాళంలో ఉన్న ఇడ్చుకొస్తం.. గొౌ్ర గొౌ్ర గుంజుకొస్తం.. అంటూ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణలో హట్ టాపిక్‌గా మారాయి.

ఇప్పటివరకు రాజకీయాల్లో అనేకమందిని చూసినం.. ఎన్టీఆర్‌ను ఆ తర్వాత చంద్రబాబు, వైఎస్ఆర్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్‌లను చూసినం.., కానీ, రేవంత్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని మనం ఎక్కడా చూడలేదని మాజీ మంత్రి కేటీఆర్ అత్యంత ఘాటుగా వ్యాఖ్యానించారు. హామీల గురించి అడిగితే 'లాగులో తొండలు విడిచిపెడుతా', 'గుడ్లు పీకి గోటీలు ఆడుతా', 'పేగులు తీసుకుని మెడలో వేసుకుంటా' అని అంటున్నారని, కానీ, ఇంతమంది ముఖ్యమంత్రుల్లో సీఎం రేవంత్ రెడ్డి తప్పా? ఎవ్వరూ ఇలా మాట్లాడలేదని ఆయన దుయ్యబట్టారు. చివరిరోజు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేటీఆర్ తనదైన శైలీలో కౌంటర్ ఏటాక్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాను రద్దు చేయనని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అసలు ఆయన రద్దు చేయడానికి, జిల్లాను ఆయన చేశాడా? అని ప్రశ్నించారు. జిల్లాను రద్దు చేస్తే భూపాలపల్లి ప్రజలు వీపు చింతపండు చేస్తారని అన్నారు.

ఇకమీదట, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను తిడితే ఊరుకునేది లేనేలేదని, సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. 'నీ టైమ్ అంతా రెండేళ్లే.. ఆ తర్వాత గులాబీ జెండా ఎగురుతుందన్నారు. తిడితే తనను, ఇతర నాయకులను తిట్టుకోవచ్చని, కానీ, కేసీఆర్‌ను గానీ, మా బీఆర్‌ఎస్ కార్యకర్తలను తిడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరేయ్ పొట్టోడా. ఆ తర్వాత నువ్వు పాతాళంలో దాక్కున్నా వదిలి పెట్టం అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎంతమంది దేవుళ్లు ఉంటే అంతమంది దేవుళ్లను మొక్కుకున్నా.. అధికారంలోకి వచ్చాక వదిలి పెట్టేది లేదన్నారు. ఆయన పేరు అనుముల రేవంత్ రెడ్డి కాదని, లాగుల తొండల్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన పక్కకు పెట్టి కుంభకోణాలకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు.

అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన సింగరేణిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన బావమరిది ఇద్దరు కలిసి దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే ప్రజలను ఆ పార్టీ నాయకులు ముంచుతారని హెచ్చరించారు. రూ.4 వేల పెన్షన్, తులం బంగారం, రైతుబంధు పెంపు ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని కేటీఆర్ మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే హామీలు అమలవుతాయని ఓటర్లకు ఆయన సూచించారు.

# తిరుమలగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ కైవసం

- తిరుమలగిరి అభివృద్ధికి ఎన్ని నిధులైన మంజూరు చేయిస్తాం
- అందరికీ సన్నబియ్యం అందిస్తున్నాం
- అర్హులైన అందరికీ రేషన్ కార్డులు ఇచ్చాం
- 1100 కోట్లతో దేవాదుల నీళ్ళు తెప్పిస్తా
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి హామీ



**తిరుమలగిరి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):** తిరుమలగిరి మున్సిపాలిటీ కాంగ్రెస్ కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎన్ని కోట్ల నిధులైనా మంజూరు చేయిస్తానని రాష్ట్ర పౌరసరఫరాల, భారీ నీటి పారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం తిరుమలగిరి మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా వారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మూడు కోట్ల 17 లక్షల మందికి 13,600 కోట్ల ఖర్చుతో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించామని చెప్పారు. తిరుమల మండలంలోని కొన్ని గ్రామాలకు సాగు నీరు అందని గ్రామాలకు సాగులూరు అందిస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలలో ఒక సానుకూల వాతావరణం ఉన్నదని దానిని పోగేసుకుని తిరుమలగిరి అభివృద్ధి కోసం ప్రజలకు హామీ ఇచ్చి ఓట్లు వేయించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పరిపాలన 24 గంటల అందుబాటులో ఉండి పాలన సాగిస్తుంది గతంలో కుటుంబ పరిపాలనలో ప్రజలు నలిగిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగనే స్వతంత్ర భారతదేశంలో 29 రాష్ట్రాలలో ఎక్కడా లేనిది మొట్టమొదటిసారిగా మంచి క్వాలిటీ సన్న బియ్యం ప్రజలకు అందిస్తున్నా తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మా ప్రభుత్వం ఏర్పడగానే అర్హులైన ప్రతి ఒక్కరికి న్యూ రేషన్ కార్డు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందించామని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలలో ఒక సానుకూలత ఉందని అన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీగా తీర్చిదిద్ద డానికి మూల ఉదయశ్రీని చైర్మన్గా గెలిపించాలని, విజయోత్సవ ర్యాలీకి మేము ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నరసయ్య, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, తిరుమలగిరి మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జి రాష్ట్ర పిసిసి సభ్యులు రవలి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు అనురాధ, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వై.నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సుంకరి జనార్ధన్, మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అల్లుడు హరీషూ

- నేను గిల్లుడు మొదలెట్టితే నువ్వు తట్టుకోలేవు
- మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఎద్దేవా



**గజ్వేల్ ఫిబ్రవరి 9 మనం న్యూస్** అల్లుడు హరీషూ... నన్ను గిల్లడం మొదలెట్టితే నువ్వు తట్టుకోలేవని స్పష్టం చేస్తూ పరిస్థితి ఇలాగే కొనసాగితే నిన్ను సిద్దిపేట పొలిమేరలు దాటిస్తామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్ లో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార సభకు హాజరై ఆయన ప్రసంగించారు. గజ్వేల్, సిద్దిపేటలో పెత్తనం చేస్తున్న హరీష్ రావుకు 610 జీవో ఎందుకు వర్తించదని నిలదీశారు. పేదల ఇండ్లను కూల్చి ఫౌాహౌజ్ కు దారి వేసుకోగా, మరి ఈ నిరుపేదల కష్టాలు ఎవరు తీరుస్తారని ప్రశ్నించారు.13 ఏళ్లుగా ఫౌాహౌజ్ లో పండుకున్న కెసిఆర్ ఏ ఒక్కరోజు గజ్వేల్ ప్రజలకు కనిపించలేదని గుర్తు చేశారు. కాగా పరిశ్రమల ఏర్పాటు పేరుతో భూములు లాక్కుంటారనే భయంతో కామారెడ్డి ప్రజలు తగిన బుద్ధి చెప్పగా, నమ్మి ఓట్లేసిన పాపానికి గజ్వేల్ ప్రజలు ఆవేదన అనుభవిస్తున్నట్లు స్పష్టం చేశారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామాల ప్రజలు బిఆర్ఎస్ నేతలకు శాంపిల్ మాత్రమే చూపించారని, ముంపు బాధితులకు న్యాయం చేయాల్సిన కెసిఆర్ అవేమీ పట్టించుకోకపోవడం సిగ్గుచేటని నిలదీశారు. నమ్మి నాన్న పోస్తే పుచ్చి బుర్రలైనట్లు వారి వైఖరి ఉండగా, బిఆర్ఎస్ ప్రభుత్వ అసలు నిజ స్వరూపాన్ని కవిత బయట పెడుతున్నట్లు తెలిపారు. అయితే దుబ్బాకలో నన్ను బూతులు తిట్టడం కాకుండా, మీ మరదలు సంధిస్తున్న ప్రశ్నలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ రాక కోసం ఎదురుచూసిన క్యాంప్ ఆఫీస్ ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అడ్డాగా మారిందని అన్నారు. గజ్వేల్ ప్రజల కష్టాలు పోవాలంటే బిజెపికి అండగా నిలిచి ఆశీర్వదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గాడిపల్లి కళ్యాణి, మాజీ చైర్మన్ భాస్కర్, జిల్లా పార్టీ అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సింగం సత్తయ్య, జిల్లా అధికార ప్రతినిధి నందన్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# మద్యం సేవించి వాహనం చట్టరీత్య

**సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 09, మనం న్యూస్:** మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్య నేరమని, వాహన తనిఖీల్లో పట్టుబడితే జరిమానా, జైలుశిక్ష పడుతుందని ట్రాఫిక్ ఎస్సై ఎస్ఐ సాయిరాం అన్నారు. సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరిచారు. వారిలో ఐదుగురిని ఇద్దరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2,500/- జరిమానా, మరో ముగ్గురికి కలిపి రూ. 2,500/- జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపు రజిత తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే



- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమా అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి):** జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో ముందు రోజు (ఈ నెల 10 వ తేదీన మంగళ వారం) అలాగే పోలింగ్ రోజున (ఈ నెల 11 వ తేదీన బుధవారం) సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన బుధవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యా సంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కార్పొరేషన్లు, సంస్థల ఉద్యోగులు, సిబ్బంది ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోలింగ్ రోజున ఈ నెల 11వ తేదీన సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

# ఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి అంకితభావంతో కృషి



- కౌన్సిలర్ అభ్యర్థి బేగరి అనిల్ కుమార్

**చేవెళ్ల, ఫిబ్రవరి 09 ( మనం న్యూస్) :** వార్డు ప్రజలు తననుఆదరించి గెలిపిస్తే వార్డు అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి బేగరి అనిల్ కుమార్ అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధి కోసం , సహాయ సహకారాలతో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉండి తమ వంతు నిస్వార్థసేవలు అందిస్తానని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి తప్పక పాటించాలి

- ఎన్నికల కోసం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్






**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** జిల్లాలో ఈ నెల 11న జరుగు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రతి మున్సిపాలిటీ కేంద్రంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని వి.సి. హాల్ నందు జిల్లా ఎస్పీ, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వెబ్ ఎక్స్ ద్వారా వీడియో కాన్ఫిరెన్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల సంబంధించి ప్రతి మున్సిపల్ కేంద్రంలో జోనల్ ఆఫీసర్, ఆర్వో ల వారిగా డి.ఆర్.సి.కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఇట్టి కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు మంచినీటి సౌకర్యం, భోజన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.అలాగే పోలింగ్ రోజు కూడ సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బ్యాలెట్ బాక్స్ లు, బ్యాలెట్ పేపర్, సిబ్బంది పోలింగ్ కేంద్రానికి ఎస్కార్ట్ వాహనంతో మాత్రమే వెళ్లాలని, ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి టీం సభ్యులు చురుకుగా ఉండి డబ్బు, మద్యం పంపిణీ జరిగితే చర్యలు తీసుకోవాలని, ఈరోజు సాయంత్రం 5 గంటల నుండి ప్రచారం బంద్ చేయాలని అదే విధంగా మున్సిపల్ ఏరియాలో సాయంత్రం 5 గంటల నుండి 11 తారీకు పోలింగ్ ముగిసే వరకు మద్యం షాపులు బంద్ చేయించాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ లను డి జి టి వాహనంలో ముందు, వెనుక ఎస్కార్ట్ వాహనాలతో మాత్రమే స్ట్రాంగ్ రూములకు తరలించాలని తెలిపారు. మిగిలిన బ్యాలెట్ పేపర్లను జాగ్రత్తగా కవర్లో పెట్టి సీల్ వేయాలని, పోస్టల్ బ్యాలెట్ పేపర్లను వార్డుల వారిగా విభజించి కౌంటింగ్ కేంద్రాలకు తరలించాలని జోనల్ ఆఫీసర్లు, ఆర్వోలు, ఎన్నికల సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పని చేయాలని, నిబంధనలు అతిక్రమించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధన ప్రకారం చర్యలు తీసుకోబడతాయి అని హెచ్చరించారు.ఎన్నికల సిబ్బంది అందరూ బాధ్యతగా పనిచేసి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను దిగ్విజయంగా, విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కె సీతా రామా రావు, డిప్యూటీ సీఈవో శిరీష, డిపిఓ నారాయణరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, బీసీ సంక్షేమ అధికారి నరసింహ, సి సెక్షన్ సూపర్డెంట్ సంతోష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా తప్పనిసరి
- జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**జగిత్యాల, ఫిబ్రవరి 9(మనంప్రతినిధి):** జగిత్యాల జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 11 తేదీన ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో ఓటర్ స్లిప్పుతో పాటు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా వెంట తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ అనుమతించిన గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. అనుమతించిన 18 రకాల గుర్తింపు కార్డులు ఇవి:1) ఓటర్ గుర్తింపు కార్డు,2) ఆధార్ కార్డు, 3) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, 4) ఫోటోతో కూడిన పోస్టాఫీస్ / బ్యాంక్ పాసుబుక్, 5) కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, 6) డ్రైవింగ్ లైసెన్స్, 7) పాన్ కార్డు, 8) ఫోటోతో కూడిన ఎస్సీ / ఎస్టీ / బీసీ, 9) కుల ధృవీకరణ పత్రాలు, 10) భారతీయ పాస్పోర్టు,11) ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్,12) కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు, 13) ఎంపీ / ఎమ్మెల్యే / ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డు,14) దివ్యాంగుల గుర్తింపు కార్డు,15) పట్టాదార్ పాస్ పుస్తకం,16) రేషన్ కార్డు 17) ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్, 18) స్వాతంత్ర్య సమరయోధుల ఐడీ కార్డు, ఆర్జీఐ ద్వారా జారీ చేయబడిన ఎన్పీఆర్ స్మార్ట్ కార్డులలో ఏదైనా ఒకటి చూపించి ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కోరారు.

# స్వాతివంశీని... వదులుకోం...!

- 33 వ వార్డు ప్రజల అభివృద్ధికి కృషి
- వార్డు ప్రజలతో సంబంధాలు ఏర్పాటు అదనపు బలం
- సమస్య ఏదైనా పరిష్కరించేందుకు ముందుండే వ్యక్తి గా స్థానికుల కితాబు



**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** స్థానిక సమస్యలపై గత ఐదు సంవత్సరాల నుండి వార్డు సభ్యులకు నోట్లో నాలుకల మెలుగుతున్న... మీలా స్వాతి వంశీని వదులుకోమని 33 వ వార్డు మెజార్టీ ప్రజలు తమ మనసులో మాటని బహిరంగంగానే ఎన్నికల ముందు వ్యక్తపరుస్తుండటం గమనార్ధం. ఇప్పటికే వార్డులో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుల.. ఈ సమస్య వచ్చినా తన చరవానికి సమాచారం ఇస్తే చాలు ఇట్టే ఆ సమస్యను పరిష్కరించేంతవరకు వదిలి పెట్టని వ్యక్తిగా.. 33వ వార్డు ప్రజలు నమ్మకం బలంగా ఏర్పడింది...ఇదే గులాబీ పార్టీ అభ్యర్థి.. మీలా స్వాతి వంశీకి గెలుపుకు తొలిమెట్టు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇప్పటికే వార్డులో వృద్ధులు వికలాంగులు యువత వార్డు ప్రజలకు తనదైన శైలిలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం... అర్హులకు సంక్షేమ పథకాలు అందించడం ఇతర పనులు సైతం ప్రభుత్వ అధికారులతో కొట్లాడి మరి అమలు చేయడం అతని నైజం.. పదవిలో ఉన్న.. లేకున్నా.. వార్డు ప్రజలు ఎప్పుడు తన కుటుంబ సభ్యులుగా భావించి... ఎన్నో కార్యక్రమాలు.. చేస్తూ ఉండడం... దీనికి నిదర్శనం, వార్డు ప్రజల మెప్పు పొందుతూ... ఉండటమే కాకుండా.. మహిళలకు సంబంధించి సాంస్కృతిక వేడుకలు ముగ్గుల పోటీ తెలంగాణ ఆడపడుచులకు ప్రతిష్టాత్మకంగా జరుపుకునే బతుకమ్మను ఘనంగా నిర్వహించడం.. అన్నిటికంటే.. యువకునిగా..దూసుకుపోవడం అదనపు బలంగా కనిపిస్తుంది.. వార్డుల్లో పేరుకు పోయిన.. డ్రైనేజ్ రోడ్ల మరమ్మతులు. వినోదమైన విషాదమైన.. నేనున్నానట్టు ముందుండే.. స్వాతివంశీ దంపతులకు కితబిస్తూ మెజార్టీ వార్డు ఓటర్లు ప్రచారంలో. చెబుతుండడం.. తమ వాస్తవ అభిప్రాయాన్ని చూస్తుంటే గులాబీ పార్టీ 33 వార్డు కైవసం చేసుకోవడం ఖాయమనే రాజకీయాల విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

# డబుల్ బెడ్రూంలు పూర్తి చేయాలి



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల, పిబ్రవరి 9(మనం ప్రతినిధి):** జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూంలను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదా యంలో హౌసింగ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్ శాఖల అధికారులతో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేములవాడ, కొండాపూర్, మద్దికుంట, బద్దెనపల్లి, తంగళ్ళపల్లిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా వాటిపై సమీక్షించారు. ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో ఆరా తీశారు. ఆయా ఇండ్ల పనులను గృహ నిర్మాణ శాఖ ఆద్వర్యంలో చేపట్టి ..త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ సాజిద్, ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ వారసుల బాధ్యత

- జిల్లా ఎస్పీ కె నరసింహ



**సూర్యాపేట, ఫిబ్రవరి 09 (మనం ప్రతినిధి):** పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పి నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయం నందు సోమవారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తక్షణ ఆదేశాలు, సూచనలు చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ, పోషణ పిల్లలపై వారసుల బాధ్యత అని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించునట్లు పిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య కీలకం

- సరంపేట అంగన్వాడీ కేంద్రంను ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్



**మర్రిగూడ,ఫిబ్రవరి 09(మనం న్యూస్ ):** పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య కీలకమని నల్గొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.సోమవారం రోజు మర్రిగూడ మండలం సరంపేట గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.అంగన్వాడి స్కూలును సందర్శించి పిల్లలతో మాట్లాడి చదువు పౌష్టికాహారం వివరాలు అడిగి తెలుసుకొని, అక్షరాలు-సంఖ్యలు చెప్పిస్తూ ప్రోత్సహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, పోషణాహార వివరాలు, హాజరు పరిస్థితి తదితర అంశాలపై అక్కడ ఉన్న అంగన్వాడి ఆయాలతో వివరాలు తెలుసుకున్నారు.పిల్లల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని , వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దానికి పిల్లలు సమాధానం చెప్పు పప్పు పెట్టారు అని చెప్పారు. ఏ ఫర్ ఆపిల్, బి ఫర్ బాల్, సి ఫర్ క్యాట్ ,డి ఫర్ డాగ్ అని 1 నుండి 20 వరకు అంకెలు అడిగారు.అనంతరం గర్భిణీ స్త్రీలు, బాలింతలతో మాట్లాడడం ఆయన మాట్లాడారు.పోషణ ట్రాకర్ యాప్ లో ఎఫ్ఆర్ఎస్ చూసి అంగన్వాడి పనితీరుపై ఆయన సంతోషం వ్యక్తం చేసినారు.కలెక్టర్ వెంట చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి,మునుగోడు సీడీపీఓ లావణ్య కుమారి,మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు,ఎంపిడిఓ మున్నయ్య,ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్వైజర్ వైష్ణవి,అంగన్వాడీ టీచర్ కళమ్మ,గ్రామ కార్యదర్శి రాకేష్, సర్పంచ్ నక్క రాములమ్మ రవి, వర్కాల వెంకటేష్, నక్క వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి



**ములుగు, ఫిబ్రవరి 9(మనం ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జనరల్ అబ్జర్వర్ గంగాధర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ చాంబర్లో నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అనుసరిస్తూ ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టగా, అదనపు కలెక్టర్, జనరల్ అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించారు. ములుగు మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ విధులు నిర్వర్తించేందుకు మూడవ ర్యాండమైజేషన్ ద్వారా మొత్తం 20 మంది ప్రిసైడింగ్ అధికారులు, 20 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 60 మంది ఇతర పోలింగ్ అధికారులను కేటాయించారు. ఈ సందర్భంగా 06 మంది సూక్ష్మ సూక్ష్మ పరిశీలకులను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. అదేవిధంగా 20 శాతం రిజర్వ్ సిబ్బందిని కూడా ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. పోలింగ్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, ఈడీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు
# వంగ సుమలత రవి యాదవ్

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**ములుగు,ఫిబ్రవరి 9మనం ప్రతినిధి :** ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడు వంగ సుమలత రవి అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని మాధవరావు పల్లె గ్రామంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 7వ వార్డు అభ్యర్థి వంగ సుమలత - రవి యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ నీటి పారుదల, స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క ఎన్నికల ప్రచారం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని తమ అమూల్యమైన ఓటును చేతి గుర్తుకు వేసి, వారిని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అభివృద్ధి అని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే ములుగు గ్రామ పంచాయతీని మున్సిపల్ చేశా అని, గిరిజన విశ్వ విద్యాలయానికి స్థలాన్ని కేటాయించి గిరిజన విద్యాలయ తరగతులు ప్రారంభించిన అని, ములుగు పట్టణంలో అంతర్గత రోడ్లు, పత్తిపల్లి రోడ్డుకు సెంట్రల్ లైటింగ్, డబుల్ రోడ్డును మంజూరు చేశానని, ములుగు పట్టణ కేంద్రంలో అధునాతన బస్టాండ్ ఏర్పాటు చేస్తున్న అని, అలాగే నిరుద్యోగ వ్యవస్థను రూపుమాపడానికి ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ కర్మాగారం ఏర్పాటు చేశానని, టాస్క్ ద్వారా గ్రామంలో పేద విద్యార్థులకు శిక్షణ అందించి, ఐటీ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తున్నానని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే ములుగు పట్టణ కేంద్రంలో రోడ్లు వెడల్పు చేసి, అన్ని విధుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేసి అధునాతన పట్టణ కేంద్రంగా తీర్చిదిద్దుతా అని, 7వ వార్డుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఏడవ వార్డును అభివృద్ధి చేస్తానని, మీరు మీ బాధ్యతగా ఓటు వేసి వంగ సుమలత రవి యాదవ్ గారిని గెలిపించండి, నా బాధ్యతగా మాధవరావు పల్లె గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని, వర్షం పడగానే మురికి నీరు ఇంట్లోకి రాకుండా డ్రైనేజ్ వ్యవస్థను తీసుకొస్తానని, అలాగే యువత కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తానని, ఉద్యోగ మేళా ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, వీవర్స్ కాలనీ నందు కళాతోరణం నిర్మిస్తానని, పద్మశాలి కమ్యూనిటీ హాల్ నందు వంట గదిని నిర్మిస్తానని హామీ ఇస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి వంగ సుమలత రవి యాదవ్ ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు, ప్రజా ప్రతినిధులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అందరూ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**ములుగు, ఫిబ్రవరి 9మనం ప్రతినిధి :** మున్సిపాలిటీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు,16వ వార్డు,17వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుగ్గిళ్ళ దివ్య సుజన్ కు మద్దతుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు,దళిత సంఘాల నాయకులకు మంత్రి సీతక్క అభినందించారు. 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎండీ కుతుబుద్దిన్ మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రచారం నిర్వహించి మైనారిటీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు 17వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇమ్మడి రాజు యాదవ్ చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మంత్రి సీతక్క యాదవ సంఘం వారికి బీరన్న గుడి నిర్మాణం కోసం కూడా నిధులు విడుదల చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వార్డులో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని రానున్న రోజుల్లో పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి గుగ్గిళ్ళ దివ్య సుజన్ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి మరింత అభివృద్ధి చేసుకుందామని ప్రతిపక్షాల అబద్ధపు మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రతి ఒక్కరినీ మంత్రి సీతక్క అన్నారు. ప్రచారంలో జిల్లా నాయకులు, సీనియర్ నాయకులు యూత్ నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు మున్సిపాలిటీలో 144 సెక్షన్ అమలు



- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు, ఫిబ్రవరి 9, మనం ప్రతినిధి:** ములుగు మున్సిపాలిటీలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు-2026 నేపథ్యంలో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం సెక్షన్ 144 (క్రిమినల్ ప్రొసీజర్ కోడ్) / భారతీయ నాగరిక భద్రతా సంహిత-2023 లోని సెక్షన్ 163ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు, ములుగు మున్సిపాలిటీలో ఎన్నికలు ఫిబ్రవరి 11, 2026న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన చివరి 48 గంటలు (పోలింగ్కు ముందు) మరియు 24 గంటలు (పోలింగ్ అనంతరం) అత్యంత సున్నితమైనవిగా పరిగణించబడతాయని, ఈ నేపథ్యంలో ప్రజా శాంతి భద్రతల దృష్ట్యా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఫిబ్రవరి 9వ తేదీ ఆదివారం సాయంత్రం 5.00 గంటల నుంచి ఫిబ్రవరి 12వ తేదీ గురువారం సాయంత్రం 5.00 గంటల వరకు మొత్తం 72 గంటలు పాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఎవరు కూడా గుంపులుగా ఉండటం, ర్యాలీలు, ఊరేగింపులు, ప్రజా సమావేశాలు నిర్వహించకూడదని ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. ప్రజలందరూ ఎన్నికల సమయంలో చట్ట నిబంధనలను పాటించి, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## మల్లన్నదేవున్నిదర్శించుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు

**మహదేవపూర్, ఫిబ్రవరి 9 (మనం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో జరుగుతున్న జాడి బోనాల జాతరలో పాల్గొని మల్లన్న దేవున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు మొక్కలు చెల్లించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నెన్నెల గట్టయ్య తుంగల సర్వేష్ పాల్గొన్నారు.



## అంబేద్కర్ వర్సిటీలో ప్రొ. బషీరుద్దీన్ స్మారకోపన్యాసం

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్-ఛాన్సలర్ ప్రొ.ఎస్. బషీరుద్దీన్ 90వ జయంతి వేడుకలు నేడు జరుగున్నాయి. ఈ సందర్భంగా 'జర్నలిజంపై మహిళల ప్రభావం' అనే అంశంపై స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఓయూ జర్నలిజం విభాగ రిటైర్డ్ అధ్యాపకురాలు ప్రొ. పద్మజా షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు.

## గోద్రేజ్ ఆగ్రోవెట్ నుంచి కొత్త కీటక నాశిని టకాయ్ విడుదల

**తాడేపల్లిగూడెం ఫిబ్రవరి 9,మనం ప్రతినిధి: :** భారత్లోని ప్రముఖ వైవిధ్యభరితమైన అగ్రి బిజినెస్ సంస్థలలో ఒకటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్), వరి పంట కోసం అభివృద్ధి చేసిన సరికొత్త కీటక నాశిని టకాయ్ ని విడుదల చేసింది. జపాన్కు చెందిన ఐఎస్కె సంస్థ అభివృద్ధి చేసిన సైక్లాప్రిన్ టెక్నాలజీతో రూపొందిన టకాయ్, వరిలోని ప్రధాన తెగుళ్లైన కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగులపై సమర్థవంతంగా పనిచేస్తుంది. దీనిని నాట్లు వేసిన 15 నుంచి 30 రోజుల తర్వాత ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల తర్వాత 160 మి.లీ మోతాదులో వాడితే, వరి పంటకు సుదీర్ఘ కాలం పాటు రక్షణ లభిస్తుందని గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రతినిధి సునీల్ కటారియా చెప్పారు. మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ మరియు చెరకు పంటలలో కూడా టకాయ్ వినియోగానికి సంబంధించి లేబుల్ అనుమతులు పొందే ప్రక్రియలో కంపెనీ ఉందన్నారు. తీవ్రస్థాయిలో కాండం తొలిచే పురుగు ఆశించినప్పుడు 30 శాతం నుండి 40 శాతం వరకు దిగుబడి నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా ఆకు ముడత పురుగు ఉధృతి వల్ల 20 శాతం నుండి 30 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఇవి తరచూ పంట ప్రారంభ మరియు మధ్య దశలలో దాడి చేస్తాయి, ఆ సమయంలో వీటిని గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టడం సవాలుతో కూడుకున్న పని. ఈ కారణాల వల్ల, భారత్ 150.18 మిలియన్ టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, హెక్టారుకు సగటు దిగుబడి మాత్రం 2.9 టన్నుల వద్దే తక్కువగా ఉందన్నారు. ఇది ప్రపంచ అత్యుత్తమ దిగుబడి అయిన 5 టన్నులు/హెక్టారుతో పోలిస్తే చాలా తక్కువ అన్నారు. 'భారతీయ వరి రైతు విజయం అనేది సమర్థవంతమైన తెగుళ్ల నివారణపైనే ఆధారపడి ఉంటుంది. టకాయ్ ద్వారా మేము వరి రైతులకు తమ పంటలను తెగుళ్ల నుండి రక్షించుకునేలా చేయడమే కాకుండా, వేగవంతమైన నియంత్రణను, సుదీర్ఘ కాలం పాటు పని చేసే పరిష్కారాన్ని అందిస్తున్నాం అని, తద్వారా పంట ఆరోగ్యం మెరుగుపడుతుంది' అని తెలిపారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ వద్ద మా లక్ష్యం, మన రైతులు ఎదుర్కొంటున్న పర్యావరణ మరియు మార్కెట్ సవాళ్లను పరిష్కరించే పంట రక్షణ మార్గాలను అందించడం అని, టకాయ్ లాంచ్ మా వ్యూహానికి అనుగుణంగా ఉంది. మా పరిశోధన నైపుణ్యం, క్షేత్రస్థాయిలో మాకున్న పటిష్టమైన నెట్వర్క్ ద్వారా కీలకమైన పంటల విషయంలో మా పోర్ట్ఫోలియోను బలోపేతం చేస్తున్నాం అన్నారు. ఇది రైతులకు సాధికారతనివ్వడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తుంది' అని వివరించారు.




## కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 163 యాక్ట్ అమలు

**పెద్దపల్లి ఏప్రిల్ 09 (మనం ప్రతినిధి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్,పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలో మున్సిపల్ ఎన్నికలు ఫిబ్రవరి 11న జరగనున్న నేపథ్యంలో,పై పేర్కొన్న మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 గంటల నుండి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు మరియు 13-02-2026 ఉదయం 8:00 గంటల నుండి కౌంటింగ్,ఫలితాల వెల్లడింపు పూర్తయ్యే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని తెలిపారు.ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు,కవ్వింపు చర్యలు,గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసులు,అటవీ అధికారులు,కేంద్ర బలగాలు, హోమ్గార్డులు మరియు ఎస్పీఓలకు ఈ నిషేధాలు వర్తించవని స్పష్టం చేశారు.చట్టపరమైన అనుమతి లేకుండా ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని, పోలింగ్ కేంద్రాల ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు,కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని సీపీ తెలిపారు.తాత్కాలిక నిర్మాణాలైన షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేయడానికి కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.మైకులు, లౌడ్స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం,సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు.ఎన్నికల సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు,గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.



## ఘనంగా మల్లన్న బోనాల జాతర



- మల్లికార్జున స్వామిని దర్శించుకున్నసర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్

**మహాదేవపూర్, పిబ్రవరి 9(మనంన్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కేంద్రంలోనిమల్లన్న బోనాల జాతర లో భాగంగా సోమవారం రోజున మల్లికార్జున స్వామిని సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ దర్శించు కున్నారు. మండలంలోని మల్లన్న బోనాల జాతరలో భాగంగా ముందు రోజు ఆదివారం రోజున గోదావరి స్థానాలు ఆచరించి దేవునికి పట్నాలు వేసి మొదటి రోజు మొక్కులు తీర్చుకొనిమరుసటి రోజు సోమవారం రోజున బోనం పోసి భక్తులు మల్లికార్జునస్వామిని దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టి రెండో రోజు సాధారణ భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. మల్లన్న బోనాల జాతర మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించు కోవడం జరిగింది,ఈ కార్య క్రమంలో వార్డ్ సభ్యులు గడ్డం స్వామి తో పాటు భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 9 - 13 వరకు హార్దిక అక్షరాస్యత వారం



- లీడ్ బ్యాంక్ జిల్లా అధికారి జయప్రకాష్

**ములుగు,ఫిబ్రవరి 9మనం ప్రతినిధి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి పిలుపుమేరకు కేవైసీ సురక్షితమైన బ్యాంకింగ్ సంబంధించి అవగాహన పెంచేందుకు ఆర్థిక అక్షరాస్యత వారంగా నిర్వహిస్తోంది. ఈనెల 9 నుండి 13 వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుంది సైబర్ నేరాలపై దృష్టి పెట్టి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని జయ ప్రకాష్ లీడ్ బ్యాంకు జిల్లా అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో మహేందర్ జి అడిషనల్ కలెక్టర్( రెవెన్యూ ), సంపత్ రావు, అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) వెంకటేష్, ఆర్డీవో మరియు రాజ్ కుమార్, ఏవో పోస్టర్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం



- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి
- త్వరలో పెద్దపల్లిలో ఐటీ పార్కు, ఆటోనగర్ ఏర్పాటు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు

**పెద్దపల్లి ఫిబ్రవరి 09 (మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన యుద్ధ భేరి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు.

### ఈ సందర్బంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ

ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. గూడులేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆశ్రయం కల్పించినట్లు పేర్కొన్నారు. నిరుపేదలకు త్వరలోనే ఇంటి స్థలాలను కేటాయించి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో త్వరలోనే ఐటీ పార్కు ఏర్పాటు చేయబోతున్నట్లు, ఆటో కార్మికుల కోసం ఆటో నగర్ నిర్మాణానికి స్థల సేకరణ కూడా చె స్తున్నామని ప్రకటించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ మంజూరులో పెద్దపల్లి అగ్ర స్థానంలో నిలిచిందని, అందుకు స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు కృషి ఫలితమేనన్నారు. రూ. కోటితో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ కోచింగ్ సెంటర్ భవన నిర్మాణం. అత్యాధునిక ఎ కర్యాలతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన రైతులందరికి రూ. 2లక్షల రుణ మాఫీ అందించామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి పెద్దపల్లి పట్టణ ప్రజలు అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### పెద్దపల్లి శాసనసభ్యులు విజయరమణా రావు మాట్లాడుతూ

పెద్దపల్లి పట్టణాభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. మరో రూ.22 కోట్లు మంజూరు చె యించామని గుర్తు చేశారు. అభివృద్ధి సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరిగెత్తిస్తున్నట్లు వివరించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో 36 మంది కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత ప్రజలదేనని, పట్టణాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్దపల్లి నియోజకవర్గానికి నిధుల ప్రవాహాన్ని తెప్పిస్తానని చెప్పారు.

### ఎమ్మెల్సీ భానుప్రసాద్ రావు మాట్లాడుతూ

కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే పారదర్శకంగా జవాబుదారితనంతో ప్రజలకు సేవ చేసి గుర్తింపు పొందాలని సూచించారు. పట్టణాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎన్నికల ఇన్చార్జి, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పలు వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## కిరణ్ అబ్బవరం, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా కాంబినేషన్‌లో భారీ బడ్జెట్ సినిమా

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరో క్రేజీ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్ తో చేతులు కలిపారు. వీరు కిరణ్ హీరోగా ఓ భారీ 'పాన్-ఇండియా' సినిమాను నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఒక అద్భుతమైన 'మైథాలజీ యాక్షన్ ఎంటర్ టైనర్'గా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు.

ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కు కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వరల్ క్లాస్ 'విజువల్స్', హై టెక్నికల్ వాల్యూస్ తో సినిమాను నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ను వచ్చే సెప్టెంబర్ నెలలో ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

హీరోయిన్ ఎంపిక విషయంలోనూ చిత్ర బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. బాలీవుడ్ లేదా టాలీవుడ్ కు చెందిన ప్రముఖ హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సినిమా టైటిల్, డైరెక్టర్, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే అధికారికంగా అనౌన్స్ చేయనున్నారు. భక్తి, ఎమోషన్స్, డ్రామా, మరియు హై-వోల్టేజ్ యాక్షన్ కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం.. అన్ని వర్గాల ఆడియన్స్ ను ఖచ్చితంగా ఆకట్టుకుంటుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు.

T20 WORLD CUP

## ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం

టీ20 ప్రపంచ కప్ 2026 లో భాగంగా ఇటలీతో జరిగిన మ్యాచ్ లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మనెంటి (52; 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హెన్రీ మానెంటి (37; 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), స్మట్స్ (22; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.




12 ఓవర్లకు 113/3తో ఉన్న ఇటలీ.. వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. ఆ జట్టు 21 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84; 54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్ లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37; 30 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్ లు) రాణించాడు. ఈ జోడీ తొలి వికెట్ కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్ ముల్లెన్ (41*; 18 బంతుల్లో 4 సిక్స్ లు) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22*; 5 బంతుల్లో) వరుసగా 4, 2, 4, 6, 6 బాదేయడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ సాధించారు.

## మరో పసికూనను వణికించిన జింబాబ్వే

టీ20 ప్రపంచకప్ 2026లో జింబాబ్వే ఘనంగా బోణీ కొట్టింది. ఒమన్ తో ఇవాళ (ఫిబ్రవరి 9) జరిగిన మ్యాచ్ లో సునాయాస విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో జింబాబ్వే బౌలర్లు చెలరేగిపోయారు. రిచర్డ్ నగరవ (4-1-17-3), బ్లెస్సింగ్ ముజరబానీ (4-1-16-3), బ్రాడ్ ఈవాన్స్ (3.5-0-18-3), సికందర్ రజా (4-0-17-1) ధాటికి ఒమన్ 103 పరుగులకే (19.5 ఓవర్లలో) కుప్పకూలింది.

ఒమన్ ఇన్నింగ్స్ లో కేవలం ముగ్గురే రెండంకెల స్కోర్లు చేశారు. సుఫ్యాన్ మెహమూద్ 25,




వినాయక్ శుక్లా 28, నదీద్ ఖాన్ 20 పరుగులు చేయడంతో ఒమన్ అతికష్టం మీద 100 పరుగుల మార్కును తాకింది. మిగతా ఆటగాళ్లలో ఆమిర్ కలీమ్, కెప్టెన్ జతిందర్ సింగ్, షా ఫైసల్ తలో 5 పరుగులు, షకీల్ అహ్మద్ 4, జితెన్ రామనంది 1, వసీం అలీ 3 పరుగులు చేయగా.. హమ్మద్ మీర్జా, కరన్ సోనావలే డకౌట్లయ్యారు.

అనంతరం 104 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జింబాబ్వే ఆడుతూపాడుతూ ఛేదించింది. 13.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్), బ్రెండన్ టేలర్ (31 రిటైర్డ్ హర్ట్) రాణించారు. మరుమని 21, సికందర్ రజా 5 (నాటౌట్) పరుగులు చేయగా.. డియాన్ మైర్స్ డకౌటయ్యాడు. ఒమన్ బౌలర్లలో సఫ్యాన్ కు రెండు వికెట్లు దక్కాయి. బ్లెస్సింగ్ ముజరబానీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

## సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్
## ఐదు బంగారు పతకాలు గెలుచుకున్న భారత్




కొలంబోలో జరిగిన సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళలు, పురుషుల జట్లు చరిత్ర సృష్టించాయి. ఐదు బంగారు పతకాలు సాధించి అద్భుత విజయాలను నమోదు చేశాయి. సెపక్‌టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ సోమవారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సెపక్‌టక్రా మేనేజ్మెంట్ కమిటీ నాయకత్వంలో ఈ లెగ్ వాలీ బాల్ వేగంగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఖేలో ఇండియా ఖేలో ఉద్యమ స్ఫూర్తిని సాకారం చేస్తూ భారత ఆటగాళ్లు చారిత్రక విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్ ఇండియాలో మరింత జనాదరణ పొంది రికార్డులు సృష్టిస్తుందనీ, యువతలో క్రీడాభిమానం, స్పోర్ట్స్‌మెన్‌షిప్ భావనను పెంపొందింపజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల టోక్యోలో జరిగిన 2026 ఏషియన్ గేమ్స్ టెస్ట్ ఈవెంట్లోనూ భారత పురుషుల సెపక్‌టక్రా జట్టు గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈ విజయంపై సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, సెపక్ టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉమ్మడి కార్యదర్శి పెరిక సురేష్, జనరల్ సెక్రటరీ నరేష్ కుమార్ ఆటగాళ్లు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్ ఫెడరేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.




## వేడిగా దోసెలు వేసి వడ్డించిన హీరోయిన్..

సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత ఐశ్వర్య రాజేశ్ దశ తిరిగిపోతుందనుకున్నారంతా! స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్ అందుకుని ఫుల్ బిజీ అవుతుందనుకున్నారు! కానీ, అలాంటిదేమీ జరగలేదు. పెద్ద సినిమాల ఆఫర్లు రాలేదు. దీంతో తెలుగులో చిన్న సినిమా అయినప్పటికీ కథ నచ్చడంతో 'ఓ సుకుమారి'లో కథానాయికగా నటిస్తోంది.

అలాగే తమిళంలో రెండు, కన్నడలో ఒక మూవీ చేస్తోంది. తాజాగా తను సెట్ లో చెఫ్ గా మారింది. సెట్ లో ఉన్నవారికి స్వయంగా దోసెలు/ ఊతప్పం వేసి వడ్డించింది. సెట్ లో ఈ పని చేయడమంటే నాకెంతో ఇష్టం అంటూ అందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.

పద్ధతిగా చీర కట్టుకున్న ఐష్.. పెనంపై చిన్న దోసెలు వేస్తూ, వాటిని తిరగేస్తూ వేడివేడిగా వడ్డించింది. ఇంకా ఎవరికి కావాలి, రండి అంటూ అక్కడున్నవారితో ఇట్టే కలిసిపోయింది. ఈ వీడియో వైరల్ గా మారగా కీర్తి సురేశ్ హే, దోసె.. దోసె అంటూ ఫన్నీ కామెంట్ పెట్టింది. అందుకు ఐష్ స్పందిస్తూ.. అవును, నీ ఫేవరెట్ అని రిప్లై ఇచ్చింది.



## 'ది ప్యారడైజ్' నుంచి ఆయా షేర్ అంటూ వస్తున్న జడల్..!

న్యాచురల్ స్టార్ నాని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి క్రేజీ అప్ డేట్ వచ్చేసింది. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'ఆయా షేర్' త్వరలోనే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ మాస్ డ్యాన్స్ నంబర్ కోసం ఫ్యాన్స్ సోషల్ మీడియాలో అప్పుడే రచ్చ మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ పాట విడుదల తేదీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి సంబంధించిన వివరాలను చిత్ర బృందం త్వరలోనే వెల్లడించనుంది. అలాగే, సినిమా కొత్త విడుదల తేదీని కూడా త్వరలోనే అనౌన్స్ చేసే అవకాశం ఉంది. 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్ లో కయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. మోహన్ బాబు, సోనాలి కుల్కర్ణి, బాబు మోహన్ మరియు తనికెళ్ల భరణి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## 'స్పిరిట్' వార్తలపై ప్రకాష్ రాజ్ ఫైర్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ గతంలోనే వెల్లడించింది. అయితే, ఈ సినిమాలో నుంచి తాను తప్పుకున్నట్లు వస్తున్న వార్తలను నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రంగా ఖండించారు. గత రెండు రోజులుగా దర్శకుడు సందీప్ వంగతో ప్రకాష్ రాజ్ కు గొడవ జరిగిందని, అందుకే ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి వైదొలిగారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది.

ఈ పుకార్లపై ప్రకాష్ రాజ్ తన ఎక్స్(ట్విట్టర్) అకౌంట్ లో ఘాటుగా స్పందించారు. 'విషపూరితమైన ఫేక్ న్యూస్ ప్రచారం చేసేవారికి.. 'స్పిరిట్' సినిమా గురించి ఒక్క విషయం చెప్పాలి. అసలు నా సన్నివేశాలకు సంబంధించిన షూటింగే ఇంకా మొదలవ్వలేదు. అప్పుడే మీ 'వాట్సాప్ ఫ్యాక్టరీ'లో కథలు అల్లేస్తున్నారా? కాస్త ఎదగండి.. మీ పనులు మీరు చూసుకోండి' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ స్పష్టతతో 'స్పిరిట్' సినిమాలో ప్రకాష్ రాజ్ కొనసాగుతున్నారని తేలిపోయింది. ఈ చిత్రంలో ఆయన ప్రభాస్ తండ్రి పాత్రలో లేదా ఒక కీలకమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ భారీ యాక్షన్ డ్రామా మార్చి 2027లో విడుదల కానుంది.



## 'గాయపడ్డ సింహం'తో నవ్వులు పూయిస్తున్న తరుణ్ భాస్కర్

డైరెక్టర్ తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' టీజర్ విడుదలై సోషల్ మీడియాలో తెగ నవ్వులు పూయిస్తోంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను పవన్ సాదినేని సమర్పిస్తున్నారు. చిన్నప్పటి నుంచి అమెరికా వెళ్లాలని కలలు కని, తీరా అక్కడికి వెళ్ళాక డొనాల్ ట్రంప్ నిర్ణయంతో కథానాయకుడు చిక్కుల్లో పడటం అనే ఆసక్తికరమైన పాయింట్ తో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ తన కామెడీ టైమింగ్ తో అదరగొడుతున్నాడు. ముఖ్యంగా తన సొంత సినిమా 'పెళ్లి చూపులు' ఓవర్ రేటెడ్ అంటూ తనను తాను ట్రోల్ చేసుకున్న సీన్ టీజర్ కే హైలైట్ గా నిలిచింది. ఫరియా అబ్దుల్లా, శుభలేఖ సుధాకర్ కె.జి.ఎఫ్ స్టైల్ నరేషన్ తో నవ్వులు పంచుతుండగా, మానస చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. స్వీకర్ అగస్తీ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సమ్మర్ 2026లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



## ఉర్రూతలూగించేలా 'యమ యమ్మ' పాట

'జాతిరత్నాలు' ఫేం అనుదీప్, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కాంబినేషన్ లో తెరకెక్కిన తాజా చిత్రం 'ఫంకీ'. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, 'ధీరే ధీరే', 'రట్టాటటావ్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతం 'యమ యమ్మ' విడుదలైంది.

భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మాస్ గీతానికి దేవ్ పవార్ సాహిత్యం అందించాడు. గాయని రోహిణి సోరట్ తో కలిసి సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించడం విశేషం. తమ ఉత్సాహభరితమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. విశ్వక్ సేన్, కయాదు లోహర్ అదిరిపోయే మాస్ బీట్ లు, ఆట సందీప్ మాస్టర్ అద్భుతమైన నృత్యరీతులతో మాస్ పాటల అభిమానులకు విందు భోజనంలా మారింది.

గీతావిష్కరణ కార్యక్రమంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. 'ఒక మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతోనే సంవత్సరం విరామం తీసుకొని ఫంకీ సినిమా చేశాను. ఈ చిత్రం మీ అందరినీ మెప్పిస్తుంది. ఇదొక క్లీన్ ఎంటర్టైనర్. మీ కుటుంబంతో కలిసి థియేటర్ కి రండి. రెండు గంటల పది నిమిషాల పాటు అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకుంటారు. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం. మిమ్మల్ని ఈ సినిమా అసలు నిరాశపరచదు.' అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.